Website : www.saisadguruvani.org

'స్వాతంత్రదినోత్సవ' ప్రత్యేక సంచిక



# శ్రీ భరద్వాజ సద్గురువాణి




సంపుటి - 19

జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2019

సంచిక - 3



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - పవర్‌సిటీ

## (2019 ఏప్రిల్, మే, జూన్ లో నిర్వహించిన కార్యక్రమాలు)




ఈ పేజీ సమర్పించిన వారు :

పూర్తి వివరములకు 23వ పేజీ చూడగలరు

గురుపూర్ణిమ మరియు వినాయక చవితి శుభాకాంక్షలతో... **శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం** - శ్రీకాకుళం

**శ్రీమతి&శ్రీ ఆర్. స్రవంతి శ్రీనివాస్, శ్రీమతి &శ్రీ ఆర్. రామలక్ష్మి శ్రీనివాసరావు, చి॥ సాయి సరోజ నిహిత** - శ్రీకాకుళం

**శ్రీ నరసింహ పట్నాయక్, శ్రీమతి స్వర్ణలత** - విజయనగరం

శ్రీ భరద్వాజ
# సద్గురువాణి

సంపుటి - 19 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2019 సంచిక - 3

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'స్వాతంత్రదినోత్సవ' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**




"సమాజ శ్రేయస్సుతో కూడి మన శ్రేయస్సు ఇమిడి ఉన్నదని తెలిసి జీవించటమే ఆధ్యాత్మికత"

- సద్గురు బోధ

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224, 9441467648

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**

## విషయ సూచిక

ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక.. లోపలి కవర్‌పేజీ
1. విషయసూచిక ........ 1
2. మా మాట ........ 2
3. శ్రీ గురుపూర్ణిమ విశిష్టత ........ 3
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ........ 5
5. గురు పాదుకా స్తోత్రం ........ 7
6. స్వాతంత్రోద్యమ రథసారథి ........ 8
7. శ్రీగురు చరితామృతము ........ 9
8. ఒక్క క్షణం ........ 11
9. జిజ్ఞాస ........ 13
10. మాస్టర్ ఇ.కె. ఉపదేశామృతం ........ 14
11. పూర్ణ అంతరంగాలు ........ 15
12. పండుగలు - పర్వదినాలు ........ 18
13 స్ఫూర్తిప్రధాత శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ ........ 19
14. శ్రీగురు సిద్ధారూఢ ........ 21
15. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ........ 23
16. గురుపూర్ణిమ మహోత్సవం ........ 24
17. మేము సహితం ........ 25
18. జన్మదిన శుభాకాంక్షలు ........ 26
19. పూజ్యాయ రాఘవేంద్రాయ ........ 30
20. శ్రీ వెంకయ్యస్వామి ........ 31
21. స్వామి - మాస్టర్ ........ 32
22. లోకమాన్యుడు - శ్రీ గజానన్ మహరాజ్ ........ 33
23. భవితవ్యానికి బంగారుబాట ........ 35
24. సాయితత్వ సాధనం ........ 36
25. శ్రీ సాయికృష్ణ బోధామృతం ........ 37
26. తెలుసుకుందాము ........ 38
27. మాతృభక్తి - దేశ భక్తి, పాదుకా మహోత్సవం ........ 39
28. ఏరిన ముత్యాలు ........ 40








# మా మాట

**పాఠకులకు, ప్రకటన కర్తలందరికీ గురుపూర్ణిమ, కృష్ణాష్టమి మరియు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...**

"సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నము సాధన" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. ఉత్తమమైన మానవ జన్మ లభించిన తరువాత దానిని సార్థకత చేసుకోవటానికి, ఉత్తమ సంస్కారం అవసరం, అది కలుగ చేస్తారు గురువు. అయితే తగినంతగా ఆయనను సేవించుకొనలేక పోవటానికి గల కారణం, మనలో అంతర్లీనముగా "ఆధ్యాత్మికత అంటే అవసరం కోసం భగవంతుడిని సేవించటము" అని బలముగా నాటుకొని పోవటము వలన. దానికి కారణం వ్యక్తిలోని ఇష్టా అయిష్టాలు, అహంకార మమకారాలు, ఆలోచనలపై ఆధారపడి ఉంటాయి. మన మనస్సులోని భావాలు మాటల రూపంలో వ్యక్తమయ్యి, క్రియా రూపం దాలుస్తాయి, ఆ భావాలు గతజన్మ సంస్కారాల వల్ల ఏర్పడుతాయి. పాషాణము కంటే కఠినమైన ఇటువంటి సంస్కారాలలో మార్పు కలిగితేగాని మానవజాతిలో మార్పు రాదు. ఆమార్పు తేవటానికే త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడు శ్రీసాయిగా అవతరించింది. "సాయిని ఆరాధించటము అంటే వారికి ఇష్టమైన రీతిలో జీవించటము", ఆధ్యాత్మికత అంటే, మనిషి మనిషిగా తన మనుగడ కొనసాగిస్తూ, మానవత్వం మూర్తీభవించి, జన్మసాఫల్యం చెందించుకోవటానికి మన పూర్వీకులు ఏర్పాటు చేసిన ఒక నిర్దుష్టమైన మార్గం. పండుగలు, పర్వదినాలలో ఉపవాస తపవాసాలు అంటూ, ఆచారవ్యవహారాలతో సాటివారికి దూరంకావటంకాదు, ఆధ్యాత్మికత అంటే సాటిమనిషిలోని దైవత్వాన్ని గుర్తించటము. సాయి చేసిన బోధ అంతా అదే. సృష్టికి ఆధారభూతమైన జగద్గురువైన సాయిబాబా, నలుగురి కోసం పాడుపడ్డ మశీదులో ఫకీరుగా జీవితాన్ని గడిపేరు. సర్వులకు సర్వం ప్రసాదిస్తూ, అందించటములోని ఆనందం, అందుకోవటములో లేదని తెలియజేశారు. అసలు మన స్వస్వరూపము ఆనందం. అది మరచి, సుఖము, సంతోషము, ఆనందము ఇలా ఎన్నో పర్యాయపదాలు చెప్పుకుంటూ, అవి బాహ్యంలో ఉన్నాయి అని భావించి, దుఃఖవలయంలో చిక్కుకొనిపోతాము. అయితే ఆనందం ఎప్పుడు ఎట్లా కలుగుతుంది? అనుకున్నది లభించినప్పుడు, నెరవేరినప్పుడు కలుగుతుంది, అయితే అది సరిగా వినియోగించుకోలేని, లేక ఉపయోగపడని సమయంలో కూడ దుఃఖములోకి జారిపోతాము. స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని కోరికలనే బంధిఖానాలో బంధించివేస్తాము. అప్పుడు సద్గురువు ఎదురై, ఆనందం కోరికలలో లేదని, వాటిని విడవడంలోనే ఉందని, "కావాలనే కోరికను విడచి సర్వగతుడైన భగవంతుడిమీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు" అని బోధిస్తారు. పూర్వజన్మ సుకృతము వలన సాటిలేని సద్గురువు సాంగత్యము లభించింది మనకు. అయినా దానిని తగినంతగా సేవించుకోలేకపోవటానికి, "ఆధ్యాత్మికత అంటే అవసరము కోసం భగవంతుడిని ఆరాధించటము" అని మనస్సులో బలముగా ముద్రించుకున్న భావాలే కారణము. ఆ భావాలే గురుకృప పొందకుండా అవరోధాలై నిలుస్తాయి. "మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయే" "మోక్షానికి కారణమైన మనస్సే బంధానికి కూడ కారణమవుతున్నది" అని గుర్తించటమే సద్గురువును తెలుసుకోవటము, అది గుర్తెరిగి జీవించిననాడు నిర్విఘ్నముగా మన లక్ష్యం చేరుకోగలము. అది సూచించటానికే అనాదిగా విఘ్నేశ్వర ఆరాధన మన ఋషులు ఏర్పాటు చేసింది. అంతర్లీనమైన శత్రువులను జయించటము ద్వారానే నిర్విఘ్నముగా జీవన పయనం కొనసాగగలదు. బాహ్యమైన శత్రువులను పారద్రోలటానికి సంఘటితము కావాలనే ఉద్దేశ్యముతో అలనాడు బ్రిటీషు పరిపాలకులపై వ్యతిరేకతతో, మహారాష్ట్రలో, బాలగంగాధర తిలక్, ఖాపర్డే మొదలైన వారు అందరినీ సమైక్యపరచి వినాయకచవితి పండుగను నిర్వహించారు. అటుపిమ్మట అది దేశమంతటా వ్యాప్తిచెంది, సమైక్య ఉద్యమానికి నాందిగా నిలచింది. అసలైన ఆనందంకోసం ప్రయత్నం ప్రారంభమయినది. లౌకిక సుఖాలకోసం ప్రాకులాడుతూ, అదే ఆనందం అని భావిస్తూ, మనస్సుకి బంది అయినంత కాలం శాశ్వత ఆనందం పొందలేము. అది పొందాలి అంటే సచ్చిదానంద స్వరూపుడయిన సద్గురువు చరణాలే శరణ్యము. అందుకని మనిషికి బాహ్యస్వేచ్ఛ కన్నా అంతరంగిక స్వేచ్ఛ అవసరం. అది ప్రసాదించటము సద్గురువుల అవతార కార్యక్రమాలలో భాగం. నిజమైన స్వేచ్ఛాయుతమైన జీవితం కావాలంటే మానవనైజంలో మార్పు రావాలి. అందుకు అవరోధమైన పూర్వజన్మ సంస్కారాలను కరిగించుకుంటూ, సరియైన రీతిలో మనుగడ సాగిస్తూ, తనను ఉద్ధరించుకోవాలనే భావం హృదయలోతులలో తీవ్రంగా కలగాలి, అందుకు పురుషోత్తముడయిన గురుచంద్రుడి సాన్నిధ్యమే శరణ్యము. అందుకే విశ్వగురుడైన దత్తాత్రేయుడు, శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ శిరిడీ సాయిబాబా, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ వాసుదేవానంద సరస్వతిస్వామి, శ్రీ ధునీవాలా దాదా రూపాలలో ఒకేసారి అవతరించటములోని ఆంతర్యము, అంతరార్ధము అదే. తాను పొందిన అంతరంగిక మరియు బాహ్యస్వేచ్ఛను, సద్వినియోగము చేసుకోవాలంటే దానికి అనుగుణమైన మానసిక పరిస్థితి అవసరము. దానికి అనుగుణమైన రీతిన


మానవజాతిని సంస్కరించటము కూడ సద్గురువు అవతార లక్ష్యంలోని భాగమే.

శ్రీ బాలగంగాధర్ తిలక్‌కు కుడిభుజం వంటి దాదాసాహెబ్ ఖాపర్డే, ఫిరోజ్‌షా మెహతాకు కుడిభుజం వంటి కాకా దీక్షిత్ శ్రీ శిరిడీసాయి భక్తులే. శ్రీ తిలక్ కూడ శ్రీసాయిని దర్శించి ఆశీస్సులందుకున్నారు. బాబా సన్నిధిలో హారతి పాటలు వ్రాసిన శ్రీ జోగేశ్వర్ భీష్మ, యువకుడిగా స్వరాజ్యపోరాటములో పాల్గొన్నవాడే. ఇంకా, దాసగణు, వాసుదేవబల్వంత్ ఫడ్కే ఇంకా ఎందరెందరో సమర్ధ సద్గురువు శ్రీ సాయి సాన్నిధ్యం అనుభవిస్తూనే నాటి స్వాతంత్రోద్యమానికి ఇతోధికంగా సహకరించి తాము తరించటమే కాకుండా ఇతరుల తరింపుకూ ఎనలేని కృషి చేశారు.

మనకు స్వాతంత్ర్యము ఉంది, అది భావములోనూ, వాక్కులోను ఉంది, ఆచరణలోనూ ఉంది! అయితే అది ఎదుటివాడికి ఇబ్బంది, హాని కలిగించనంత వరకు ఉంటే అది సరియైనదే! మన మాట, చేత ద్వారా తోటివారికి హితము చేకూరుస్తూ, తామూ పొందుతూంటే మనమూ స్వతంత్రులమే. మన ఋషులు పూర్వము స్వార్థం మరచి "సర్వేజనా సుఖినోభవంతు" అని భావించటమే కాక, తమ ప్రతి మాట, చర్య తగురీతిన ఉండేలా జీవించారు. అందుకే భారతదేశము అత్యంత శక్తివంతమై, ధార్మికతలో ప్రపంచానికి మార్గదర్శి అయింది. నేడు వ్యక్తిలోని స్వార్థం ప్రబలంకాగా, దానిని ఆసరాచేసుకొని పబ్బం గడుపుకునే వారికి బానిసలుగా మారటం జరిగింది. కొందరు వ్యక్తుల కలయిక కుటుంబం, కొన్ని కుటుంబాలు ఒక సమాజము, కొన్ని సమాజాలు కలసి గ్రామము, జిల్లా, రాష్ట్రము, దేశము అయింది. కనుక మార్పు అనేది తనతోనే ప్రారంభం కావాలని ప్రతివారు అనుకుంటే దేశం సస్యశ్యామలమై, సర్వతోముఖాభివృద్ధి అవుతుంది. ఇతరుల శ్రేయస్సు తన శ్రేయస్సుగా భావించిననాడు అందరూ స్వేచ్ఛాయుతమైన ఆనందజీవితాల్ని గడుపుతారు. తనను సృష్టించినవాడి పట్ల కలిగింది దైవభక్తి అయితే, మన మనుగడకు, జీవితానికి కారణభూతమైన సమాజానికి హితం కూర్చేలా జీవించటమే దేశభక్తి. మనిషి ఎట్లా జీవించాలో చెప్పేది దైవభక్తి అయితే, దాని ఆచరణ రూపమే దేశభక్తి. "తన్ను తాను ప్రేమించుకోలేని వాడు ఇతరులని ప్రేమించలేడు". అసలు ప్రేమ తెలియనివాడు మానవ రూపంలోని పశువు. మనిషిని మహనీయునిగా మార్చి నడిపించేదే ఆధ్యాత్మికత, అది తెలియజేసి ఆచరింపచేయటానికి అవతరించిన వారే సద్గురువు. నైతిక విలువలు కొరవడి మానవత్వం కనుమరుగవుతున్న తరుణంలో సద్గురువు బోధలే శరణ్యం. అవి మన కర్మ బంధనాలను ఛేదించి, ఉత్తమ పథం వైపు నడిపిస్తాయి.

స్వాతంత్రోద్యమములో పాల్గొన్న నాయకుల ఆధ్యాత్మిక ఔన్నత్యానికి, వారి ఉన్నతికి కారకులై, వ్యక్తి, దేశ స్వాతంత్ర్యానికి కారణమైన సద్గురువు బోధనలను అందించటానికి ఈ సంచికలో ప్రయత్నించేము. అందుకే ఈ సంచికను "**స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచిక**"గా రూపొందించటము జరిగింది. మనకు జన్మ నిచ్చిన నేల పవిత్రం, గాలి పవిత్రం, నీరు పవిత్రం. ఎందరో మహాత్ములు ఉచ్ఛ్వాస నిశ్వాసలతో పవిత్రమైన గాలిని మనము పీల్చి, మనుగడ కొనసాగిస్తూ తరిస్తున్నాము. వారి పాదస్పర్శతో పునీతమైన భారతావనిపై మనమూ సంచరించే మహద్భాగ్యం కలిగింది. మహోన్నత దిశగా సాగిన ఋషులు, మహాత్ములు, సద్గురువులు నడచి చూపిన బాటలో మనమూ నడచి, మన జాతి, దేశ గౌరవాలు ఇనుమడింపచేస్తూ, ప్రపంచ దేశాలకు తలమానికంగా నిలిపే దిశగా, మరో వివేకానందుడిలా మన ప్రతి అడుగు ముందుకు సాగిద్దాము.సద్గురు సామ్రాట్ అయిన శ్రీ శిరిడీ సాయినాథుడు జన్మించిన దేశంలో మనము జన్మించాము. ప్రపంచము అంతా వసుధైక కుటుంబముగా కలసి మెలసి జీవించమని తన ఆచరణ ద్వారా బోధించిన విశ్వగురుడయిన శ్రీ శిరిడీసాయిబాబాను ఆరాధించే అద్భుతమైన అవకాశం మనకు లభించింది, ఒక అడుగు మనము ముందుకు వేస్తే, పది అడుగులు వెంటనుండి నడిపించే, సాయి బోధలను అనుసరించి, ఔన్నత్యాన్ని పెంచుకునేలా మన ప్రయత్నం కొనసాగిద్దాము. ఆ దిశగా సాగే ప్రతి అడుగుకు మా వంతు సహకారం తోడవ్వాలని "శ్రీ భరద్వాజ సద్గురువాణి" తనవంతు కృషి చేస్తున్నది. దానిలో భాగంగా దైవభక్తి, దేశభక్తి వేరుకాదని, అవి రెండూ రెండు కాళ్ళు ఒకే నడక, రెండు కళ్ళు ఒకే చూపు, రెండు చెవులు ఒక వినికిడిలా మన జీవిత మనుగడకు అవసరమైనవని తెలియజేసే చిరు ప్రయత్నంగా ఈ సంచికను "**స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యేక సంచిక**"గా తీర్చిదిద్దటము జరిగింది. ఇందులోని ఏ ఒక్క అంశము అయినా మీ హృదయాన్ని స్పృశించి, ఆలోచింప చేసినా, మా ఈ చిరు ప్రయత్నం ఫలించినట్లే.

"శ్రీ భరద్వాజ సద్గురువాణి" ప్రధాన సంపాదకులు అయిన వి.వి. పూర్ణచంద్రరావుగారి మాతృమూర్తి మరియు నా అత్తగారైన శ్రీమతి వి. సరోజిని గుండెకు సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతూ, మే నెలలో స్వర్గస్థులైన కారణముగా, అటుముందు, అటు తరువాత కార్యక్రమాల నిమిత్తము దాదాపు నెలరోజులుపైన స్వస్థలమైన గుంటూరులోనే ఇరువురము ఉండిపోవటము వలన, ఈ త్రైమాస పత్రిక కొంచెం ఆలస్యంగా మీకందించటము జరిగింది. అర్థంచేసుకొని, సహకరించగలరని భావిస్తూ, వచ్చే సంచిక నుంచి యథాతథముగా శ్రీ భరద్వాజ సద్గురువాణి మీ చెంతకు చేర్చగలమని తెలియజేస్తూ




"శ్రీ భరద్వాజ సద్గురువాణి" మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరము మా శాయశక్తులా ప్రయత్నిస్తామని, అందుకు మీ సహాయ సహకారాలను మాకు ఎల్లవేళలా ఇలానే కొనసాగాలని కోరుకుంటూ... **వినాయక చవితి శుభాకాంక్షలతో...**

**మీ పబ్లిషర్**

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# శ్రీ గురుపూర్ణిమ విశిష్టత

సృష్టిలో మానవ జన్మ మహోత్కృష్టమైనది. జంతూనాం "నరజన్మ" దుర్లభమ్ అని ఆర్యోక్తి. ఈ మానవులలో నాస్తికులు, ఆస్తికులు అని రెండు తెగలు. నాస్తికులు దైవం లేదు అంటారు. కానీ గురువు లేదని చెప్పలేదు. ప్రతి విద్యకు "గురువు" అంటే 'గు'కారోఅంధకారస్యాత్ 'రు' కారస్తన్ని బోధకం అనగా అజ్ఞానమనే అంధకారాన్ని నిరోధించి విజ్ఞానమనే "జ్ఞానజ్యోతి"ని వెలిగించేవాడు. అందుకే వేమన అంటారు. "ఎన్న గురుని కంటె ఎక్కువ లేదయా" విశ్వదాభిరామ వినురవేమ. గురుని మించిన శక్తి ఏదీ లేదు.



లలితా సహస్రంలో దేవిని "గురుమండల రూపిణీ" అని స్తోత్రం చేస్తారు. భగవంతుని శక్తి కొన్నివేల ఓల్టేజీ పవర్ కలిగి ఉంటుంది. దాన్ని దర్శించడానికి మన కళ్ళు తట్టుకోలేవు. ఆశక్తి గురుని రూపంలో మనం దర్శించగలం. ఉదాహరణకి సూర్యుడ్ని నేరుగా చూడలేం ఆ వేడిమిని భరించలేం కానీ సూర్యకాంతి చంద్రునిపై పడి అక్కడనుంచి రిఫ్‌లెక్ట్ అయివస్తుంది దాన్నే "వెన్నెల" అంటాం. ఆ వెన్నెల ఆహ్లాదాన్ని ఆనందాన్ని కలుగచేస్తుంది. చంద్రబింబాన్ని చక్కగా చూడగలం, అలాగే గురువుని త్రిమూర్త్యాత్మకునిగా భావిస్తాం. గురుబ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః అంటాం. అట్టి గురుని అనుగ్రహకారణంగా జన్మ జన్మాంతరాలు కర్మసంచితా భస్మీపటలమై పవిత్రమూర్తిగా శిష్యుడు తయారవుతాడు. పరుశువేది తాకిన ఇనుము బంగారంగా మారునట్లు గుర్వనుగ్రహం వలన శిష్యుడు కూడా గురుశక్తిని పొందుతాడు. గ్రహాలలోకెల్లా పెద్ద శుభాలనిచ్చే గ్రహాలలో 'గురుడు' శతశాతం శుభుడు, అందుకే భగవదవతారమైన శ్రీ రాముడు వశిష్ట, విశ్వామిత్రాదులను గురువులుగా పూజించాడు. శ్రీకృష్ణుడు సాందీపుని వద్ద శిష్యరికం చేశాడు. "గురువు లేని విద్య గురుతురాదు" అనగా గుర్తింపు పొందదని పెద్దలు పలికారు. గురునికి ఆగ్రహం కలిగిందా అట్టి వారిని భగవంతుడు కూడా రక్షించలేడు. జయ, విజయులనే ద్వారపాలకులను, సనక, సనందనాధులు శపిస్తే, శ్రీమన్నారాయణుడు వారిని మూడు జన్మలు ఎత్తక తప్పదని చెప్పాడు. తాను కూడా వాళ్ళతో పాటు భూమి మీద అవతారమూర్తిగా అవతరించాడు. గురుద్రోహం చేసిన పాపాత్ముని ముల్లోకాల్లోనూ రక్షించేవారులేరు. సంపూర్ణ ప్రేమమూర్తి సద్గురుడు. గురు శుశ్రూష చేసిన సామాన్యులయిన పైలుడు, జైమిని మొదలగువారు అసామాన్యులుగా వెలుగొందేరు. పూర్ణిమా, అనగా 15వ తిథి. జ్ఞానేంద్రియాలు 5, కర్మేంద్రియాలు 5, మనోబుద్ధి, చిత్ అహంకారములు 4, మహత్తు 1, మొత్తం 15 కలిస్తే పూర్ణిమ సంఖ్య అవుతుంది. అందుచే వీటిని నిరోధించి మనఃపూర్వకంగా అఖండసచ్చిదానంద స్వరూపమైన మానవ రూపంలో నున్న గురుని త్రికరణ శుద్ధిగా నమ్మి పూజించి, పాదాలను స్పర్శించే శిష్యుని జీవితం ధన్యం.

దుర్లభో విషయత్యాగో
దుర్లభం తత్త్వ దర్శనమ్
దుర్లభా సహజావస్థా
"సద్గురో కరుణా నినా"

"సద్గురు కటాక్షం తప్ప మరిఏదీ విషయసుఖాలనుండి విముక్తి కావించటంగాని, తత్త్వాన్ని దర్శింపచేయ గలదిగాని, నీ సహజస్వరూపం (ఆత్మతత్వమ్) అయిన దానిని తెలియజేసేదిగానీ సృష్టిలో అన్యమైనది లేదు" అంటారు శివ స్వరూపమయిన ఆదిశంకరాచార్యులు.

అందరికీ అమృత తత్వాన్ని "గురుపూర్ణిమ"
అందించాలని కోరుకుంటూ....

జూలై 16వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా సమర్పణ

రచన : **శ్రీ విశ్వనాథచైతన్య మహరాజ్**, ఎందువ, శ్రీకాకుళం జిల్లా

## "సద్గురువు" అంటే ఎవరు? ఆయన్నే ఎందుకు ఆశ్రయించాలి?

మన ఇష్టదైవాలను శ్రద్ధగా ఉపాసిస్తే, ఆ దేవతలు సద్గురువును చూపుతారని, సద్గురువే సకల దేవతలని, దేవతల కంటే సద్గురువు అధికుడని శాస్త్రాలు చెబుతున్నాయి. వశిష్ట, విశ్వామిత్రులను గురువుగా స్వీకరించి శ్రీరాముడు, సాందీపుని గురువుగా స్వీకరించి శ్రీకృష్ణుడు ఇదే విషయాన్ని చాటి చెప్పారు. అందుకే ఆధ్యాత్మిక జీవితం సద్గురువును ఆశ్రయించటంతోనే ప్రారంభం అవుతుంది. కానీ సద్గురువును గుర్తించడం ఎంతో కష్టం. ఆధ్యాత్మికత పేరిట ఎన్నో మోసాలకు పాల్పడుతున్న ఎందరో నకిలీ గురువులున్న ఈ కలియుగంలో నిజమైన సద్గురువుని గుర్తించేదెలా? అందుకని భగవంతుడే మనపై ప్రేమతో అట్టి ఆనందమయ జీవనం ప్రసాదించడానికి మనకు "దత్తం" అంటే అంకితం అయ్యారు. ఆయనే విశ్వగురుడైన దత్తాత్రేయుడు. సర్వజనులను ఉద్ధరించడమనే దత్తావతార కార్యం సృష్టి ఉన్నంత వరకూ కొనసాగుతుంది. కనుక దత్తస్వామి అవతార త్యాగం చేయకుండా నిత్యమూ భూమిపై సంచరిస్తుంటాడు. శ్రీ దత్తాత్రేయుడే ఆది గురువు.

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు" అన్నారు సాయిబాబా అయితే సద్గురువును తెలుసుకోవటం ఎట్లా? సృష్టి అంతటా వ్యాపించిన చైతన్య స్వరూపుడయిన సద్గురువు సకల జనావళిని ఉద్ధరించాలనే భావనతో ఐదున్నర అడుగుల రూపంతో మన మధ్య మనలాగా అవతరించి, అనేక మిషలమీద కార్యాకారణ సంబంధంగా పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు తన వద్దకు లాగి, మనల్ని ఉద్ధరించాలని ప్రయత్నిస్తుంటే, ఆయన ద్వారా కోరికలు నెరవేర్చుకున్న వారలు, తిరిగి ఆయనకే కానుకలిస్తున్నామని భావిస్తూ, ఆడంబరముగా జీవించే వారలకు సద్గురువును తెలుసుకోవటం ఎట్లా సాధ్యం? సద్గురువును తెలుసుకోవాలి అంటే అంతకుముందు తన్ను తాను తెలుసుకోవాలి, అనేక జన్మలనుంచి సంస్కరించుకుంటూ ఈ జన్మలో తనలాగానే భౌతికదేహం ఇచ్చి తనచెంత చేర్చుకున్న సద్గురువు ఏకారణంగా మన ఇష్టాలను నెరవేరుస్తున్నారో, దానికి ప్రతిగా మనం ఏమి చేయాలో తెలుసుకోవాలి.



దానికి నాందిగా అసలు సద్గురువు దగ్గరకు మనం ఎందుకు వెళుతున్నాము, ఏమి అడుగుతున్నాము, ఏమి పొందుతున్నాము, పొందినది సరియైనదా, అసలు పొందాల్సింది ఏదో తెలుసుకోవాలి. అందుకు అవరోధముగా నిలచిన తనలోని ఇష్టా అయిష్టాలను జయించి, దానికి సహకారి అయిన అహంకారాన్ని పారద్రోలాలి. ఇవేవీ జరగకుండా సద్గురువును తెలుసుకోవటం సాధ్యమేనా! సర్వ జగత్తును సృష్టిచేసి, పోషించి తన అక్కున చేర్చుకునే సాయికి మనం దక్షిణ సమర్పించ గలమా? సంపదను ఒనకూర్చగలమా? "సర్వ జగత్తును కాపాడే సాయి నాకు అత్యంత ప్రీతిపాత్రుడు, నా ఆరాధ్యదైవం, సర్వం ఆయనకే సమర్పణ అంటూ ధన, వస్తు, భూషణాలు సమర్పించి, వాటితో అలంకరించి, భద్రతకై నాలుగు గోడల మధ్య సాయిని బంధించి (అని తలుస్తాము) బలమైన తాళంకప్ప వేసి, తాళంచెయ్యి కాపలాదారుడికి ఇచ్చి బాబాను బాగా చూసుకో" అంటూ మన హృదయాలలో నిలుపుకోవాల్సిన సాయిని బాహ్యాండంబరాలతో బంధిస్తూ, అర్చిస్తున్నామని భావించటం ఎంతటి హాస్యాస్పదం. సర్వం ప్రసాదించే బాబాకు, 'నేను అన్నీ సమకూరుస్తున్నాను' అని భావించటం అహంకారానికి పరాకాష్ట, అది తెలియక ఎన్ని విధాలుగా ఎన్ని రకాలుగా ఆరాధించినా సద్గురువును తెలుసుకోవటం అసాధ్యమే కనుక, అలనాడు సాయి హేమాద్రిపంత్‌ను హెచ్చరించినట్లు, ముందుగా మనలోని అహంకారాన్ని తొలగించుకుంటే గాని సాయి విశ్వచైతన్యం అవగతమయ్యి, తద్వారా వారికి సర్వస్య శరణాగతి చెంది, వారి కృపకు పాత్రులయ్యి, వారిని తెలుసుకోవటానికి అవకాశం కలుగదు. ఈ విషయం సాయిని మొట్టమొదట అత్యంత సన్నిహితునిగా సేవించిన కాశీరాంషింపే జీవితం ద్వారా ప్రస్ఫుటముగా తెలుస్తుంది. బాబా రెండవసారి తిరిగి శిరిడీలో ప్రవేశించినప్పుడు, మహాత్ముడుగా గుర్తించి "ఆవో సాయి!" అని పిలచిన మహల్సాపతికి సన్నిహితుడు శ్రీ కాశీరాం. తన మిత్రుడైన మహల్సాపతి ద్వారా సాయిని దర్శనం చేసుకున్న కాశీరాం సాయిలోని దివ్యతేజస్సును గుర్తించి, తరచు బాబా దగ్గరకు వస్తుండేవాడు. మహల్సాపతి పేదవాడు అవటంమూలాన, తాను మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్న కాశీరాం సాయికి అవసరమైన సదుపాయాల ఏర్పాటుతోపాటు, చిలిమ్ గొట్టాలు, అందులోకి పొగాకు, మశీదులో నిరంతరం వెలిగే ధునిలోనికి కావాల్సిన కట్టెలు మొదలైనవి కొని సమర్పిస్తుండే వాడు. బయ్యాజీబాయి సాయికి అన్నపానీయాలు సమకూరుస్తూ ఉండేది. క్రమేపీ సాయి సహచర్యం పొందుతున్న కాశీరాం అంతవరకు తన దగ్గర సంపద ఇవ్వలేని ఆనందం సాయి చెంత లభించటముతో తన రాబడి యావత్తూ నిరంతరం సాయికి సమర్పిస్తూ ఉండేవాడు. అయితే సాయి మాత్రము అందులో కొద్ది పైసలు మాత్రమే తను తీసుకొని, మిగిలినదంతా అతనికి తిరిగి ఇచ్చేసేవారు. అయితే కాశీరాం మాత్రము బాబానే మొత్తము తీసుకొని, కొద్దిపాటి పైసలనే తనకు ఇవ్వమని ప్రాధేయపడేవాడు, ఒక్కొక్కసారి సాయిని బలవంతం చేసేవాడు కూడా. కుగ్రామమైన శిరిడీలోని ప్రజల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అందుచేత వారు సాయికి సమర్పించే దక్షిణ చాలా తక్కువ ఉండేది. అందుకే స్తోమత కలిగిన కాశీరాం సాయికి మశీదులోని అవసరాలకు కావలసిన పైకం తానే సమర్పించే వాడు. క్రమేపీ మానవ సహజమైన అహంకారము అతనిలో పొడచూపి సాయికి కావలసిన ధనసహాయం తానే అందిస్తున్నానని భావించేవాడు. అతనిలోని అహంకారం క్రమేపీ బలపడుతూ ఉండటముతో ఆధ్యాత్మిక ధనంతోపాటు లౌకికమైన సంపద, రాబడి కూడ తగ్గుతూ వచ్చింది. దానికి తగ్గట్టు అతని ఆంతర్యం

గమనించిన బాబా, రాబడి హెచ్చుగా ఉన్న రోజుల్లో ధనం ఎక్కువ సమర్పిస్తానన్నా స్వీకరించని సాయి, కాశీరాంలో అహం పెరిగి రాబడి తగ్గిన సమయంలో తరచు దక్షిణ ఇవ్వమని అడిగేవారు. ఒకసారి బాబా అడిగినప్పుడు దక్షిణ సమర్పించడానికి అతని దగ్గర చిల్లర నాణేలు కూడ లేకుండా పోవటంతో బాధపడుతున్న కాశీరాంతో సాయి, గోవిందరావ్ అనే మార్వాడి దగ్గర చేబదులు తీసుకొని సమర్పించమని సూచించారు. క్రమేపీ దానికి అలవాటు పడ్డ కాశీరాం మార్వాడీ దగ్గర చేసిన అప్పు సకాలములో తీర్చలేకపోవటంతో, ఒకరోజు గోవిందరావ్ చేబదులు ఇవ్వటానికి నిరాకరించాడు. అంతటితో అంతర్మథనకు లోనైన కాశీరాం, అడిగిన క్షణంలో దక్షిణ సమర్పించలేని తన నిస్సహాయతకు వగచి, బాబా పాదాలపై వ్రాలి తరుణోపాయం వేడేడు. బాబా చిరునవ్వు నవ్వుతూ, "ఎందుకు బాధపడుతున్నావు? ఒక్కసారి దక్షిణ ఇవ్వలేకపోతే ఏమయింది. నేను శిరిడీ వచ్చినప్పటినుంచి నా బాగోగులు గమనిస్తూ, నా ధునిలోని కట్టెలకు, చిలుముకు, చిలుములోని పొగాకుకు, తదితరమైన వాటికి ఆర్ధిక సహాయం అందించి నన్ను పోషిస్తున్నవాడివి కదా, ఈ చిన్న దానికే బాధపడటము దేనికి, నీవు అట్లా బేల స్థితిలో ఉంటే ఇక నా బాగోగులు ఎవరు చూస్తారు" అన్నారు సాయి. ఆ మాటతో విజ్ఞత మేల్కొన్న కాశీరాంలోని అహంకారం మంచులా కరిగిపోయి, కన్నీళ్ళు ప్రవహించి బాబా పాదాలను కడిగివేశాయి. "సర్వులకు సర్వం ప్రసాదించి, పరిపాలించే నీకు నేను సహాయం చేస్తున్నాననే అహంకారమే నా ఈ దుస్థితికి మూలకారణం. తద్వారా నా ఆస్తి కరిగిపోయింది, రాబడి తగ్గిపోయింది, చివరకు ఊరిలో అప్పు పుట్టక, ఉన్న పరువుకూడ పోయింది. నేను నీకు సంపద ఇస్తున్నానని భావించానే కాని, నీవు ప్రసాదించిన ఆధ్యాత్మిక సంపదను ఏ కొద్దిపాటి కూడ స్వీకరించలేకపోయినాను, నేను నీకు సమర్పించాల్సింది, సంపద కాదు బాబా, నాలోని అహంకారాన్ని, అభిజాత్యాన్ని, అవి నీపాదముల ముందు ఉంచుతున్నాను. ఇకపై నా యావశ్శక్తిని ఉపయోగించి శ్రమించి, సంపాదించిన దానిలో నీవు కోరే దక్షిణ సమర్పించి, నీవందించే ఆధ్యాత్మిక సంపద పొందటానికి ప్రయత్నం చేస్తాను" అని బాబా పాదాలపై పడి వేడుకున్నాడు. కన్నీటితో పరిశుద్ధమై, స్వచ్ఛమైన మనస్సుతో తన తప్పును తెలుసుకొని పరితాపంతో పవిత్రుడైన కాశీరాం తలపై చేయి ఉంచి ఆశీర్వదించారు సాయి. అప్పటినుంచి కాశీరాం ఆర్థిక పరిస్థితి క్రమేపీ మెరుగు పడసాగింది. కొద్ది కాలంలోనే అతడు తిరిగి ధనవంతుడు అయినాడు. ఆ తరువాత సంపదను తీసుకోమని కాశీరాం ఏనాడు బలవంతం చేయలేదు, బాబా ప్రసాదించే అసలైన సంపద పొందటానికి ప్రయత్నం కొనసాగించాడు. నాటినుండి కాశీరాంను దక్షిణ అడగడం, ఇచ్చినా స్వీకరించటము మానివేశారు శ్రీసాయిబాబా.

తాను మునుపటి స్థితికి వచ్చినా, తాను మునుపటిలా సాయికి దక్షిణ సమర్పించలేని స్థితికి కాశీరాం నిరంతరం బాధపడేవాడు. అది గమనించి మారుతీ ఆలయంలో నివసించే జానకీదాసు అనే సాధువు కాశీరాంను చేరబిలచి, "సాయి నీనుండి కోరేది లౌకికమైన రూపాయి కాసులు కాదు, తన గురువుకు తాను సమర్పించిన నిష్ఠ, ఓరిమి అనే దక్షిణ. సాయిపై అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండి, సర్వకాల సర్వావస్థలయందు అది చెదిరిపోని దృఢమైన నమ్మకంతో నీ సర్వ బాధ్యతలు సాయిపై వేసి నిశ్చింతగా, నిర్భీతిగా, ధర్మబద్ధముగా జీవితాన్ని గడుపు, అదే నీవు సాయికి సమర్పించే దక్షిణ. పశ్చాత్తాపంతో ప్రాయశ్చిత్తం చేసుకొన్న నీవు, ఆధ్యాత్మిక సంపద కూడగట్టాలనే, సాయి లౌకికమైన దక్షిణ నీనుండి స్వీకరించటము మానివేశారు. అయితే ఆత్మ సమర్పణతో పాటు బాహ్యసమర్పణ కూడా తోడయితే గాని సంపూర్ణముకాదు అన్నది నీభావం. అందుకే సాయి ఆంతర్యాన్ని సంపూర్ణముగా గ్రహించలేకపోతున్నావు. అయినా నీ మనసు శాంతించటానికి ఒక మార్గము ఉంది. సర్వ జీవ స్వరూపుడయిన సాయి అద్భుతమైన, సులభతరమైన ఒకమార్గం మనకు చూపేరు, "నాకు అర్పించకుండా ఎవరు ఏమీ తినరో వారికి నేను బానిస, ఎవరిని సేవించినా, ఆదరించినా నాకే చెందుతుంది" అన్నారు సాయి. ఏది అయినా స్వీకరించే ముందు సర్వజీవ స్వరూపుడయిన సాయిని స్మరించి, సర్వులలో సాయి ఉన్నారని భావించి, దానిని జీవులకు సమర్పించటం ద్వారా, అది సాయికి అర్పించినట్లు అవుతుంది, వారిని స్మరించి, అర్పించి, స్వీకరించటము ద్వారా అది సాయి ప్రసాదము కూడ అవుతుంది. వ్యాపార నిమిత్తము వివిధ ప్రదేశాలకు వెళ్ళే నీకు, అన్నివేళల అనువుగా ఉండటానికి, కలకండ పలుకులను చిన్న మూటకట్టి నీవద్ద ఉంచుకో. నీవు ఎక్కడకు వెళ్ళినా ముందు అక్కడ చీమలకు, పశుపక్ష్యాదులకు సమర్పించి, అది సాయికి సమర్పించే దక్షిణగా భావించు, తద్వారా నిరంతరం సాయి నీవెంట ఉన్నట్లే, నీవు సమర్పించినది వారు స్వీకరించినట్లు, వారి అనుగ్రహ ప్రసాదము నీకు లభించినట్లు అవుతుంది" అని జానకీదాసు పలికిన హితవాక్యములు శాంతచిత్తుడైన కాశీరాం హృదయంలో బలంగా నాటుకున్నాయి. అప్పటినుంచి నిరంతరం కలకండ పలుకులు సకల జీవ స్వరూపుడయిన సాయికి అర్పించే దక్షిణ, ప్రసాదముగా జాగ్రత్తగా వెంటనుంచుకునేవాడు. ఒకసారి వ్యాపార నిమిత్తము 'నేర్' గ్రామం నుంచి తన వస్త్ర వ్యాపారాన్ని ముగించుకొని వస్తున్న కాశీరాం గుర్రంమీద తన గ్రామానికి తిరిగి వస్తుండగా దొంగలు దారికాచి అతనిపై దోపిడీకి దిగేరు. బలిష్టులైన ఆరుగురు దొంగలు అతని చుట్టిముట్టి, కాశీరాం దగ్గర ఉన్న సామాను, నగదు దోచుకున్నారు. ప్రతిఘటించి, ఫలితం లేదని భావించిన కాశీరాం వారికేమీ అడ్డు చెప్పలేదు. చివరకు వారికన్ను కాశీరాం వద్దనున్న చిన్న సంచిపై

పడింది. చివరకు అది తీసుకోవటానికి దొంగలు ప్రయత్నించగా కాశీరాం ప్రతిఘటించాడు. అది అతను జానకీదాసు సూచనపై సాయికి దక్షిణ, ప్రసాదముగా తన దగ్గర ఉంచుకున్న కలకండ ఉన్న చిన్న సంచి. అంతవరకు ప్రతిఘటించని కాశీరాం ఆ చిన్న మూటను ఇవ్వటానికి ఎదురు తిరగటంతో అది అత్యంత విలువైన ధనపుసంచి అని భావించిన దొంగలు కాశీరాంపై మరింతగా దాడిచేశారు. తన సొమ్మును అపహరించినా సహించిన కాశీరాం, సాయికి సమర్పించే దక్షిణగా తాను భావించే కలకండమూటను అపహరించటానికి వారి ప్రయత్నాన్ని భరించలేక, సాయిని స్మరించి వారిని తీవ్రంగా ప్రతిఘటించి, ఆ దొంగల దగ్గరనున్న కత్తి ఒకటి లాగుకొని, అమితమైన ఆవేశంలో ఇద్దరు దొంగలను మట్టుబెట్టాడు కాశీరాం. ఇంతలో ఒక దొంగ వెనుకచాటుగా తలపై గొడ్డలితో కొట్టగా, కుప్పకూలిపోతున్న తరుణంలో కూడ కాశీరాం ఒకచేత తలను మరొకచేత కలకండ మూటను పట్టుకొని నేలకు ఒరిగేడు. తమవారు చనిపోవటంతో పాటు, సమీప గ్రామంలోని ప్రజలు అక్కడి గొడవకు పరుగెత్తి రావటం చూసిన మిగిలిన దొంగలు కాశీరాం చనిపోయాడని భావించి, ఆచోటు విడచి పారిపోయారు. దొంగల అలజడికి పరుగెత్తుకు వచ్చిన నేర్ గ్రామ ప్రజలు కాశీరాంను వైద్య నిమిత్తం గ్రామానికి తీసుకువెళ్ళటానికి ప్రయత్నించినా వారించి, తన కొన ఊపిరి సాయి పాదాలచెంత వదలాలని వారికి నచ్చచెప్పగా, రక్తసిక్తుడైన కాశీరాం కోరికను మన్నించి, గుర్రంపై అతనిని వేసి శిరిడీలోని సాయిబాబా సన్నిధికి తీసుకువచ్చారు వారు. సాయి వెంటనే చికిత్స నిమిత్తము శ్యామా వద్దకు కాశీరాంను పంపివేశారు. తాను చనిపోతానని కాశీరాంతో పాటు, అతనితో వచ్చిన వారు కూడా భావించారు, కాని అతను త్వరితగతిన కోలుకున్నాడు. **ఒంటరిగా ఇద్దరు బందిపోటు దొంగలను మట్టుబెట్టి, ప్రజల ఇక్కట్లు తీరటానికి దోహదపడిన కాశీరాం ధైర్యసాహసానికి మెచ్చిన అప్పటి బ్రిటిష్ గవర్నమెంటులోని పోలీసుశాఖవారు అతనిని ఘనముగా సత్కరించి, ఒక కత్తిని బహుకరించారు.** ఆ ఆనందం కంటే, తాను దొంగలతో పోరాడుతున్న సమయంలో మశీదులోని సాయి తీవ్రమైన ఆగ్రహంతో "కొట్టు, చంపు అంటూ వివిధ భంగిమలు చేస్తూ కేకలు వేశారని" ఆ తరువాత భక్తులద్వారా తెలుసుకున్న కాశీరాం పరమానంద భరితుడై, త్రికరణ శుద్ధిగా తాను సమర్పించిన మనో దక్షిణను సాయి స్వీకరించారు అని గ్రహించి, తన జీవితం ధన్యమయిందని భావించాడు. పోరాటము ద్వారా, తనలో శేషముగా మిగిలిన అహంకార రక్తాన్ని బయటకు తీసి, సాయి తనకు పునర్జన్మ ప్రసాదించారు అని గ్రహించిన కాశీరాం, **"అహం వదిలి సర్వజీవుల హితంకోసమై పాకులాడటమే నిజమైన సాయి సేవ అని, తద్వారా అపారమైన సాయి అనుగ్రహం, సర్వం పొందవచ్చుని"** అనుభవంలోకి వచ్చి, తన జీవితాన్ని సాయిసేవకే పునరంకితం చేశాడు. తనువు, మనస్సు, ధనాలను సద్గురువుకు అర్పించటమే నిజమైన దక్షిణ సమర్పించటమని, తద్వారా సర్వ హృదయ నివాసియైన సాయి మనలోకూడ, కూడి ఉంటాడని ఎరుక గలిగి జీవించటమే సద్గురువును తెలుసుకోవటానికి ప్రథమ సోపానమని, సమాజ శ్రేయస్సుతో కూడి, తన శ్రేయస్సు కూడ ఇమిడి ఉందని, అందుకు మనము ఒక్కఅడుగు ముందుకు వేస్తే, సాయి పది అడుగులు మనవైపు వేసి తన కృపానుగ్రహ రక్షణకు పాత్రులను చేస్తారని, కాశీరాం షింపే జీవితంలోని ఈ సంఘటన ద్వారా తెలుస్తుంది. ఇటువంటి ఎన్నో సంఘటనలకు వేదిక అయిన ద్వారకామాయి. వాసుడి సన్నిధిలో జరిగిన మరొక అద్భుతమైన సంఘటన గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

# శ్రీ గురుపాదుకా స్తోత్రమ్

అంతులేని సంసార సాగరాన్ని దాటడానికి పడవల వంటివి, గురుభక్తి నొసగేవి, వైరాగ్యమనే మహా సామ్రాజ్యాన్ని ఇచ్చేవి, పూజనీయమైనవి అయిన శ్రీ గురు పాదుకలకు అనేక నమస్కారములు.

జ్ఞాన సముద్రముపైన ఆహ్లాద కరుడైన చంద్రునివలె వుండేవి, దురదృష్టాలనే కారుచిచ్చుల పాలిట మేఘమాలికల వంటివి, శరణు జొచ్చిన వారి కష్టాల పరంపరలను దూరం చేసేవి అయిన శ్రీ గురు పాదుకలకు అనేక నమస్కారములు.

శరణు పొందిన వారు బొత్తిగా దరిద్రులయినా వేనివల్ల సంపదలను పొందుతారో, మూగవారు కూడా మాట్లాడగలరో, ఏవి హితము కలుగ చేసేవో అట్టి శ్రీ గురుపాదుకలకు అనేక నమస్కారములు.

తామర పూలతో సమానంగా అందమయిన పాదాలు కలిగినట్టివి, అనేక రకాల విభ్రాంతులను తొలగించేవి, శరణు జొచ్చిన వారి అభీష్ట పరం పరలను తీర్చేవి అయిన శ్రీ గురు పాదుకలకు అనేక నమస్కారములు

వరుసగా వంగి నమస్కారము చేస్తూ వుండే రాజుల తలల సమూహాలనుండి వెలువడే రత్నకాంతులనే నదిలో ఈదే మత్స్య కన్యకల వంటివి, నమస్కారము చేసేవారందరికి రాజ గౌరవాన్ని సమకూర్చేవి అయిన శ్రీ గురుపాదుకలకు అనేక నమస్కారములు.

పాపాలనే చీకట్లకు సూర్యుల పరంపర వంటివి, ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మికాలనే మూడు రకాల తాపములనే పాములను సంహరించే గరుడుని వంటివి, భవరోగమనే సముద్రాన్ని ఎండించే బడబాగ్నుల వంటివి అయిన శ్రీ గురు పాదుకలకు అనేక నమస్కారములు.

శమ, దమ, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములనే ఆరు సంపదలను ఇచ్చే వైభవ వంతము లయినవి, సమాధి దాన వ్రతాలలో దీక్ష నిచ్చేవి, లక్ష్మీపతి యొక్క పాదాలపై స్థిర భక్తిని ఇచ్చేవి అయిన శ్రీ గురు పాదుకలకు అనేక నమస్కారములు.

శ్రావణ పౌర్ణమినాడు శిరిడీలోని గురుస్థానములో
పాదుకా ప్రతిష్ఠ సందర్భముగా సమర్పణ.

# స్వాతంత్ర్యోద్యమ రథసారథి శ్రీ సాయి

జీవుడు రాగద్వేషాలతో అమితమైన కర్మఫలము సిద్ధముచేసుకొని, ఆఫలాన్ని అనుభవించటానికై పుట్టుట, మరణించుట అనే నిరంతర భ్రమణానికి దాస్యముచేస్తుంటాడు. సత్పురుషులు, మహాత్ములు, భగవదవతారాలు ఈ అజ్ఞానాన్ని తొలగించి, శాశ్వత ఆనందాన్ని యిచ్చే ఆత్మరాజ్యములో ఆత్మ స్వరూపుడుగా నిలచివుండే స్వాతంత్ర్యాన్ని పొందేలాగా ప్రేరేపించి దానిని లభింపజేస్తారు. ఇది ఆత్మ స్వాతంత్ర్యము. దీనిని శ్రీ సాయి “వెనుక ఎన్ని వేల జన్మలు మీతో వున్నానో, ఇంకా రాబోవు ఎన్ని జన్మలు మీతో వుండవలెనో, నాకప్పగించబడిన ప్రతి పైసాను నేను భగవంతునికి లెక్క చెప్పుకోవాలి” అన్నారు. ఇది పూర్తిగా వ్యక్తి వికాస స్వాతంత్ర్యము.

అయితే భగవదవతారాలు సమాజ, దేశ, శ్రేయస్సును కూడా చేయడం వారి అవతార ముఖ్యోద్దేశము. ''లోకాసమస్తా సుఖినోభవంతు'', అది వారి నిత్యసంకల్పము గదా!



వ్యాపార మిష మీద భారతదేశము వచ్చిన ఇంగ్లీషు వారు విభజించి పాలించు అనేసూత్రం మీద సాటి మానవుల స్వేచ్ఛను అరికట్టి రాజకీయంగా, ఆర్థికంగా, మనలను అణచివేయడమే గాక, సంస్కృతిని, ధర్మాన్ని కృంగతీసే కుటిల ప్రయత్నాలు ప్రారంభించారని మనకు చరిత్రద్వారా అవగతమవుతుంది. అన్ని ధర్మాలు, భగవంతుని ద్వారా ప్రకటమైనవే గనుక, ఆయా ధర్మాల సుస్థిరత గూడా భగవంతుని సంకల్పము గనుక అట్టి ధర్మాన్ని తిరిగి పునః ప్రతిష్ఠ చేయటానికి భారత స్వాతంత్ర్య సమరమనే నాటక ప్రదర్శనానికి నేపథ్యములోని సూత్రధారి శ్రీ శిరిడీ సాయిబాబా.

నాడు బ్రిటీషు ప్రభుత్వము బారినుండి, వారి దహన కాండనుండి తప్పించుకొనుటకు షిరిడీ చేరిన జాతీయోద్యమకారులు ఎంతమందో! వారిలో దాదా సాహెబ్ ఖపర్డే, హరిసీతారాం దీక్షిత్(కాకా సాహెబ్), హారతి పాటలు రాసిన భీష్మ, దాసగణు మొదలగువారు ఉన్నారు.

అయితే మన ప్రజలలో తగిన నైతిక పరివర్తన కలిగిన తరువాతనే స్వాతంత్ర్యం రావాలన్నది సాయి సంకల్పముగా తోస్తుంది. తర్వాత చరిత్ర దానిని నిరూపిస్తుంది. నాటి ప్రభుత్వ వైశ్రాయి యొక్క కార్యచరణ సమితిలో సభ్యుడైన సర్. శంకరన్ నాయర్, ఖపర్డే ద్వారా తన భావాలను బాబాకు విన్నవించు కున్నాడు. దానికి బాబా ఏమి చెప్పారో మటుకు ఖపర్డే డైరీలో లేవు.

నాటి నాయకులలో మేటియైన శ్రీ బాలగంగాధర్ తిలక్ స్వరాజ్యం గురించి సాయిని ప్రశ్నించినపుడు “నీవింతవరకు నిస్వార్థంగా దేశసేవకోసం పాటుపడ్డావు. యికకొంతైనా నీ కోసం చేసుకో, కొద్దికాలంలో భగవంతుడే స్వరాజ్యాన్ని ప్రసాదిస్తాడు. స్వరాజ్యమవతరించడానికి అవసరమైన వ్యక్తి రానున్నాడు” అన్నారు. నిజంగానే బాలగంగాధర్ తిలక్ శాశ్వత నిద్రలోనికి పోగానే మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో ఉదయించారు.

అబ్దుల్లా డైరీలోని 2 అంశాలను బాబా చెప్పినవి బి.వి. నరసింహస్వామి వారు వ్రాశారు. మన దేశంలోని బ్రిటీషు సామ్రాజ్యం తొమ్మిది పరిపాలకుల కాలం మాత్రమే వుంటుందనే సూచన బాబా వచనాలలో వున్నదట. నిజానికి 1947 లో స్వాతంత్ర్యం సిద్దించినప్పుడు తొమ్మిదవ బ్రిటీషు రాజు కాలమే అరంభమయింది.

దైవం అన్ని జాతులకు అవసరమైన ధర్మాన్ని సంస్కృతిని పంచియిచ్చాడు కనుక, వాటిని కాపాడుకోవటము కూడా ఆయన ధర్మమే. అయితే ప్రజలలో అట్టి కాంక్షపూర్తిగా ఒకే లక్ష్యముతో బలపడేదాకా దానికి కావలసిన ధైర్యమును, ఓరిమిని కల్గించటము భగవంతుని లక్ష్యము. హిందు, ముస్లిం సఖ్యతను చాటి చెప్పి, ఆచరించి చూపిన దివ్య అవతారము శ్రీ సాయిబాబా. భారత జాతి సుసంఘటితముగా కలిసి మెలసి స్వరాజ్య సాధనకు నడుంకట్టింది ఈ సమయంలోనే. గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా, నిష్కామంగా, ధర్మంకోసం, తన సంస్కృతిని రక్షించుటకోసము, భారతజాతి జరిపిన పోరాటాలు శ్రీ శిరిడీ సాయి నాధుని రూప ప్రకటన, బోధలు, ఆచరణలు, భారతజాతిని ఒక త్రాటిమీద సుసంఘటితము చేసి, విదేశీ పాలకుల కుటిల అనైక్య విధానమునకు సమాధానమా అన్నట్లు, పరబ్రహ్మ శ్రీ సాయిగా అవతరించారు. అప్పటి భగవంతుని ఆ అవతారాల పరాకాష్టతలోని ఈ సత్యము చరిత్ర మనకు ఈ రీతిగా బోధిస్తుంది.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

సౌజన్యం : **త్రివేణి సంగమం**

రచన : **శ్రీ కె.వి. రంగారావు**, ఒంగోలు



# శ్రీ గురు చరిత్రామృతము

**వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు**

'గురువు' అంటే అజ్ఞానమనే చీకటి నుంచి జ్ఞానమనే వెలుగు వైపు నడిపించేవాడు. "గురువు" అంటే 'గుణానికి, రూపానికి అతీతమయి ఉన్నవాడు. సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యమే 'గురువు'. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని భావించేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అని ప్రత్యక్ష నిరూపణచేసి జగద్గురువై భాసిల్లుతున్నారు శ్రీ శిరిడీసాయిబాబా. అలనాడు అవధూత సృష్టిలోని 24 మంది గురువుల నుండి తాను సముపార్జించిన జ్ఞానాన్ని యయాతి మహరాజుకు బోధిస్తే, నేడు శ్రీ శిరిడీసాయినాధుడు సహస్ర ముఖాలుగా, సహస్ర విధాలుగా మనకు బోధిస్తున్నారు, వినటం చూడటం చేత కావాలి అంటారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో భువిపైన జగద్గురువుగా అవతరించిన త్రిమూర్త్యాత్మకుడైన శ్రీ దత్తాత్రేయుడు, కలియుగములో దేశ, కాలమాన పరిస్థితులననుసరించి, మరింతగా ఆర్త జనులకు చేరువై, వారిని జిజ్ఞాసులుగా, జ్ఞానులుగా మార్చటానికి, శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ శిరిడీసాయిబాబాగా అవతరించటము జరిగింది. కుల, మత, జాతి, స్త్రీ, పురుష వయోబేధము లేకుండా సర్వులను, అనేక మిషలమీద, కార్యకారణ సంబంధముగా తన చెంతకులాగి, దరి చేరిన ఆర్తులను, అర్థార్థులను సమాదరిస్తూ వారి పాలిటి కామధేనువు, కల్పవృక్షము కంటే అధికమై భాసిస్తున్నారు శ్రీ శిరిడీసాయిబాబా. తద్వారా, జిజ్ఞాసులైన వారు గురుతత్త్వ మెరిగి, జ్ఞానులుగా మారటానికి సాధనంగా తన ముందటి అవతారాలైన శ్రీపాద శ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి స్వామి జీవిత చరిత్ర అయిన "శ్రీ గురుచరిత్ర" పారాయణను నిర్దేశించారు. శ్రీ సాఠే, హేమాద్రిపంత్, దాసగణు మొదలైనవారు, సకల ఉపనిషత్తు, వేదాలు, పురాణ ఇతిహాసాల సారమైన "శ్రీగురుచరిత్ర" పారాయణ వలన, సాయి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులైన విషయము బాబా చరిత్రలో చూడవచ్చు.

పరిమితమైన జ్ఞానంతో, తమ సంస్కారము మేరకు గురువుని ఎన్నుకొని, అటుపిమ్మట, అయోమయస్థితిలో పడే వారిపాలిట దిక్సూచి, 'శ్రీగురుచరిత్ర'. కుల, మత, జాతి, లింగ, వయోబేధము లేకుండా, ఎటువంటి వారైనా శ్రీ గురుచరిత్ర పారాయణ ద్వారా సాటిలేని సద్గురువు సన్నిధికి చేరి, సేదతీరి, ఉత్తమమైన గురు మార్గంలో పయనిస్తున్న వేలాది మంది నాకే తెలుసు. గురువున్న వారికి, వారి గురువుపై గురి కుదిరించి, వారి అనుగ్రహానికి పాత్రులను చేసి, జన్మసార్థకత చెందించే గ్రంథము 'శ్రీగురుచరిత్ర'. అభయమిచ్చి, ఆదరించే కరుణామయి 'శ్రీగురుచరిత్ర' గ్రంథరాజము.

సర్వ దేవతా ఆరాధకులకు, ఆ యా సందర్భానుసారమైన ఇతిహాస, పురాణాల అంతరార్థాన్ని తెలియజేయటమే కాకుండా, ఆచార, కర్మ, కాండలను విశదీకరిస్తూ, జ్ఞానమార్గంలో నడిపించే మార్గదర్శి, త్రయీకాండ రూపమైన 'శ్రీగురుచరిత్ర'. జ్ఞానకాండ, కర్మకాండ, భక్తికాండల స్వరూపమైన శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా, జగద్గురువైన శ్రీసాయి నిర్దేశించిన మార్గంలో పయనించి, జీవితాన్ని ధన్యత ఒనరించుకుంటున్న లక్షలాది మంది సామాన్యులతో పాటు అసమాన్యులు కలరు. శ్రీగురుచరిత్ర నిత్య పారాయణ వలననే మహరాష్ట్ర దేశం ఎందరో దత్తావతారుల, అవధూతల, మహాత్ములకు జన్మస్థానమైనది. శ్రీ దత్త స్వరూపుడైన శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి వారిచే విరచితమైన 'సంహితాయన గురుద్విసాహస్రి' గ్రంథాన్ని వారి శిష్యులైన శ్రీ గుళవణి మహరాజ్ గారి ద్వారా అనుగ్రహింపబడి, దాని పారాయణ వలన సాటిలేని సద్గురువు విశ్వతత్త్వాన్ని, నిత్య సత్య స్వరూపాన్ని దర్శించి, వారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులై, సాయి అనుంగు బిడ్డడుగా, 'శ్రీసాయి మాస్టర్'గా వినుతికెక్కేరు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు. తనకు ప్రసాదించిన సంస్కృత గ్రంథాన్ని శ్రీ దత్తానుగ్రహముతో 'శ్రీగురుచరిత్ర' రూపంలో తేటతెలుగులో మనకు అందించారు. శ్రీగురుచరిత్ర పారాయణ ప్రారంభించిన నాటినుండే శ్రీ దత్తసాయి కృపకు పాత్రులైన వారెందరో కలరు. శ్రీగురుచరిత్ర గురువును చూపించి, వారి కృపకు పాత్రులను చేసే గ్రంథము మాత్రమే కాదు, మన నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కార రూపం శ్రీగురుచరిత్ర. శ్రీగురుచరిత్రలోని ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతుంది. గొడ్డలితో పోయే సమస్యను, గోటితో తొలిగించివేస్తుంది. ఇది నాస్వానుభవమే కాదు, అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీగురుచరిత్ర



పారాయణ చేసే లక్షలాదిమంది, అనుభవము కూడ. కొన్నివేల శ్రీగురుచరిత్ర గ్రంథాలు మా సత్సంగమము ద్వారా కూడ అందజేయటము జరిగింది. మారుమూల గిరిజన గ్రామాలలోని వారు కూడ నిర్భయంగా, నిశ్చలభక్తితో శ్రీగురుచరిత్ర పారాయణ చేస్తూ, దత్త స్వరూపుడైన శ్రీసాయి అనుగ్రహానికి పాత్రులైన ఉదాహరణలు ఎన్నో, ఎన్నెన్నో కలవు. శ్రీగురుచరిత్ర లోని అధ్యాయాలు వాటి పారాయణ ఫలితాల గురించి అవకాశాన్ని అనుసరించి శ్రీ దత్తజయంతి సందర్భముగా వచ్చే సంచికలో మీతో పంచుకోవటానికి ప్రయత్నం చేస్తాను,

ఇక మనము శ్రీగురుచరితామృతాన్ని గ్రోలే ప్రయత్నం చేద్దాము. కలియుగములో రెండవ దత్తావతారుడు, శ్రీగురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహసరస్వతి స్వామి తన గోదావరి పరిక్రమములో భాగముగా వాసరబ్రహ్మేశ్వరక్షేత్రం చేరి, అక్కడ నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న ఒక బ్రాహ్మణుని కాపాడేరు. వారానికో, పక్షానికో ఒకసారి ఆహారము తీసుకుంటే చాలు విపరీతమైన కడుపునొప్పితో విలవిలలాడిపోతూ మరణానికి సిద్ధమైన అతనిని వారించి, తన దర్శనార్థమై వచ్చిన సాయందేవుడనే గ్రామాధికారి విన్నపాన్ని మన్నించి, అతని గృహానికి, తన శిష్యులతోపాటు ఆ బ్రాహ్మణుడిని కూడ తీసుకొని వెళ్ళి గారెలు, బూరెలు, పరమాన్నముతో కూడిన షడ్రశోపేతమయిన భోజనాన్ని ఆ బ్రాహ్మణుడిచే ఆరగింపచేసి, తన మాటమాత్రము చేత అపథ్య భోజనముతో అతని ఉదరశూల రోగాన్ని క్షణంలో పోగొట్టేరు శ్రీగురుడు.



శ్రీ గురుని ఆదేశము మేరకు ఆ బ్రాహ్మణునికి విందు భోజనము పెట్టటము ద్వారా తనకు బ్రాహ్మణ హత్య దోషము ప్రాప్తిస్తుందేమోనని భావించినా, శ్రీగురుని అభయముపై అపారమైన విశ్వాసముతో వారి ఆదేశాన్ని అమలుచేశాడు సాయందేవుడు. శ్రీగురుని అనుగ్రహముతో ఆ బ్రాహ్మణుడు మృత్యుకుహరం నుంచి బయటపడి, ఆనంద శిఖరాలు అధిరోహించటము ప్రత్యక్షముగ తిలకించిన సాయందేవుడు శ్రీగురుని పాదాల చెంతకు చేరి, "సద్గురోత్తమా! ప్రథమంగా మీ పాదపద్మాలకు నా ప్రణామములు. కాంచీపురం స్వస్థలమైన నేను, కేవలము భుక్తికోసం ఈ రాజ్యమేలే నరరూప రాక్షసుడైన ఈ యవనరాజు కొలువులో, వేరుదారి లేక సంవత్సరకాలము నుండి పనిచేస్తున్నాను. జీవితంపై విరక్తి కలుగుతున్న సమయములో మీదర్శన భాగ్యం కలిగింది. అంతటితో నా గత జన్మ పాపాలన్నీ దావాగ్నిలో పడిన ఎండుటాకులవలే భస్మీపటలమైపోయినాయి. గంగలో స్నానం చేస్తేనే పాపాలు నశిస్తాయి. చంద్రుడు రాత్రి సమయములలో మాత్రమే తాపాన్ని పోగట్టుతాడు, కల్పవృక్షం తన నీడను ఆశ్రయిస్తే మాత్రమే కోరినది ప్రసాదిస్తుంది. కాని, ఈ విశ్వాన్ని తరింపచేయటానికి అవతరించిన తమ దర్శనం తక్షణమే పాప, తాప, దైన్యాలను హరించి, ధర్మార్ధ మోక్షాలను ప్రసాదించగలదు. ఎన్నో సంవత్సరాలుగా ఉదరశూలవ్యాధితో బాధపడుతూ, ప్రాయోపవేశానికి సంసిద్ధుడైన బ్రాహ్మణుడి బాధను, షడ్రశోపేతమయిన భోజనముతో తక్షణమే నివారించటము ప్రత్యక్షముగా తిలకించి, శాసనము అయిన మీ ఆదేశాన్ని ఆచరించి ఆ పుణ్యకార్యంలో నిమిత్తమాత్రుడనయ్యే అదృష్టము పొందిన భాగ్యశాలిని నేను. సద్గురూ! మీ ఆదేశము శిరసావహించి చేసిన సత్కర్మతో నా జన్మ సార్థకమయింది. అంతేకాదు పరబ్రహ్మ స్వరూపుడవయిన మిమ్ములను సకలోపచారాలతో పూజించుకునే భాగ్యం లభించటమే కాకుండా, మీకు, మీ శిష్యులకు కూడ విందారగింపచేసే మహద్భాగ్యము నాకు లభించింది. అంతేకాదు మీ పాదసేవ చేసుకునే మహద్భాగ్యాన్ని కూడ ప్రసాదించారు. ఎంతో పుణ్యఫలం వలన మాత్రమే లభించే ఇంతటి మహత్తరమైన అవకాశాన్ని పొంది పరమానందభరితుడ నయిన నేను, ఇక ఎక్కువ సమయం ఈ సేవ కొనసాగించలేనే అనే దిగులుతో ఈక్షణమే మీపాదాల చెంత నా తుదిశ్వాస విడవాలని ఉంది, ఈ రాజ్యాన్ని ఏలే రాక్షస స్వరూపుడైన యవనరాజు ప్రతి సంవత్సరము ఒక బ్రాహ్మణుడిని చంపుతాడు, నేడు నన్ను బలిచేయదలచి, ఇంతకుముందే నాకు కబురు పంపేరు, అతిథి మర్యాదలలో మునిగిన నేను వారిని వారిస్తూ వచ్చాను, ఆరుబయట వేచిఉన్న ఆ భటులు నన్ను రాజాజ్ఞపై బలవంతంగా ఈడ్చుకుపోయి ఆ నరరూప రాక్షసునికి బలి పశువును చేయబోతున్నారు, ఇవే మీకు నా చివర ప్రణామములు" అంటూ శ్రీగురుడి పాదాలపై వ్రాలి, విలపించాడు సాయందేవుడు.

శ్రీగురుడు చిరునవ్వుతో "మమ్ములను, మా శిష్యులను నీ అతిథి మర్యాదలతో పరవశింపచేసిన నీవు దైన్యంతో ఉండటము తగదు. ప్రాయోపవేశము చేసుకోబోయే ఆ బ్రాహ్మణుడే పునర్జన్మ పొందేడు. అంతటి పవిత్రమైన ఈ ప్రదేశంలో నీవు తుదిశ్వాస విడవాలి అనుకోవటం కూడదు. ఆ యవనరాజు కేవలం నీ శరీరానికి మాత్రమే యజమాని, కాని సృష్టి కర్త అయిన భగవంతుడు సర్వానికి యజమాని, విశ్వం సహచక్రవర్తి అయిన భగవంతుని ముందు పిపీలికం వంటి వాడు ఆరాజు. విశ్వవ్యాపకుడైన ఆ భగవంతుడిని మనసారా కొలచి ఆరాధిస్తూ, అణువణువూ గురుసేవకు వినియోగించే నిన్ను ఆ రాజేమిచేయగలడు? నీవు ఆశ్రయించిన పాదాలు చివరికంటా వెంటనుండి గమ్యం చేర్చేవే గాని జారవిడిచేవి కాదు. వ్యాకులత మాని, ఆనంద వదనముతో రాజభవనానికి వెళ్ళు. ప్రాణాలు తీసే అతడి చేతిలోనే సత్కరింపబడి పరమానంద భరితుడవై తిరిగి వస్తావు, అంతవరకు మేము ఇక్కడే వేచి ఉంటాము., దైన్యముతో కాక ధైర్యముతో కదులు అంటూ సాయందేవుడి శిరస్సుపై చేయి ఉంచి "దీర్ఘాయుష్మాన్ భవ" అని ఆశీర్వదించారు శ్రీగురుడు.

శ్రీగురుని అభయంతో సంతోష తరంగితుడైన సాయందేవుడు తనను బలి తీసుకోబోయే యవనరాజు వద్దకు బయలుదేరేడు. అటుపిమ్మట జరిగిన వృత్తాంతాన్ని, ఈ అధ్యాయ పారాయణ వలన ఒనకూడే సత్ఫలితాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుంటాను.

# ఒక్క క్షణం !

మానవులందరూ ఈ ప్రపంచం, శాశ్వతమైనదని, ఇందులోని ఐహిక సుఖాలే నిత్యమైనవని నమ్మేస్థితిలో ఉన్నారు. కానీ, ఇది అసత్యం. మాయ వారినలా నమ్మేలా చేస్తున్నది. మన మధ్యనే అనేకమంది మరణించడం చూస్తున్నాం. వారి అంత్యక్రియలు మన చేతుల్తో జరుపుతున్నాం. మార్పు అనేది ప్రపంచానికి సహజం. క్షణకాలం హాయిని కలిగించే ఈ ఐహిక సుఖాలు అశాశ్వతమైనవి. చివరికి అవి దుఃఖాలకే దారితీస్తాయి. మన ఆశలకు అంతముండదు. ఒకటి తీరితే మరొకటి తలెత్తుతూనే ఉంటుంది. ఈ కోరికల గొలుసుకట్టు మనల్ని జనన మరణ చక్రంలో బంధిస్తోంది. ఈ సంకెళ్ళ నుంచి తప్పించుకునే ప్రయత్నం చెయ్యక, ఆశకు పోయి కర్మలుచేసి ఆ సంకెళ్ళను ఇంకా గట్టిగా బిగుసుకునేలా చేసుకుంటున్నాం.




మానసికంగానూ, ఆధ్యాత్మికంగానూ చితికిపోయిన మనిషిని శారీరక రోగాలు కూడా పట్టి పీడిస్తున్నాయి. బాల్యంనుంచి వృద్ధాప్యంవరకూ సుఖశాంతుల కోసం వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఎక్కడ చూసినాఏదో ఆరాటం. తామేనాటికి కనుక్కోలేని దాని కోసం ఎడతెగని ప్రయత్నం. ఎండమావుల వెంట పరుగులాట. ఆస్తిపాస్తులు, ఆరోగ్యం, పదవులు, పరపతి, మిగిలిన ఐహిక సుఖాలు ఇవన్నీ అశాశ్వతమైనవి. అవి మనిషి జీవితంలో మెరుపుల్లా మెరిసి మరుక్షణం మాయమౌతూ వారిని భ్రమింపజేసి అసంతృప్తిని మిగిల్చి పోతున్నాయి. ఇంద్రియసుఖాలు వారిని బిచ్చగాళ్ళను చేస్తున్నాయి. ఎంతటి సుఖాశక్తి ఉంటే అన్ని రోగాలు, దుఃఖాలు. ఒక్కక్షణం అనుభవించిన శరీరసుఖం, స్వల్పకాలం చెలాయించిన అధికార దర్పం, ఒక్క నిముషం పొందిన మోహం, ఇవన్నీ చివరకు తీవ్రమైన దుఃఖాన్నీ, వేదనను కలుగజేస్తాయి. అయినా వాటివెంట పరుగులెత్తుతూనే ఉంటారు. గురుమార్గం పట్ల విముఖత చూపుతారు. కానీ అదొక్కటే వారిని ఈ అంతులేని దుఃఖాలనుంచి తప్పించగలదు.

దైవాంశ సంభూతమయిన ఆత్మ మనసు యొక్క ప్రాబల్యానికి బలైపోయింది. ఆ మనసు ఇంద్రియాలకు వెట్టి చాకిరి చేస్తోంది. ఆ కారణంగా అరిషడ్వర్గపు భీభత్సానికి ప్రపంచమంతా గురవుతుంది. మనసు అంతులేని వ్యర్థ ప్రయత్నాలలో విశ్రాంతి లేకుండా తిరుగుతోంది. ఎన్నిసార్లు దుఃఖమనుభవించినా దానికి పశ్చాత్తాపం లేదు. పాత అనుభవాల నుంచి అది పాఠం నేర్చుకున్నట్లు కనిపించదు. **మనసు చాలా సమర్థవంతమైన సేవకురాలు. కానీ దాని చేతిలో అధికారం ఉన్నంతవరకూ దానంతటి చెడ్డ యజమాని మరొకరుండరు. దాని శక్తిని సద్వినియోగం చేసుకోగల్గితే దానిచేత ఎన్నో అద్భుతాలు చేయించవచ్చు.** కట్టుబాట్లు లేకుండా దాని ఇష్టానికి వదిలేస్తే జరగరాని వినాశనం జరుగుతుంది. తమ స్వగృహాన్ని మర్చిపోయి, తామెంతటి ఉన్నత లక్ష్యం సాధించడానికి ఈ జన్మ యివ్వబడిందో తెలియక, తమ గమ్యం ఎటో నిర్ణయించుకోలేక అగమ్యంలో కొట్టుమిట్టాడుతున్న మానవుల దశ మారాలంటే ఆత్మ మనస్సును కట్టుదిట్టం చెయ్యాలి. మనస్సు, ఇంద్రియాలను అదుపులో ఉంచాలి. మానవులు ప్రపంచంవైపు ఎంత గట్టిగా ఆకర్షింపబడతారో, అంత ఎక్కువగా తమ స్వగృహానికి దూరమౌతున్నారు. ఈ వేదనలను రూపు మాపాలనుకుంటే సద్గురువు దరిచేరి వారు చూపిన మార్గాన నడవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఈ ప్రపంచంలోని రూపాలు, అందచందాలు, మోహింపజేసే విషయాలన్నీ మాయాజాలం తప్ప మరేమీ కావు. ఆత్మ, మనస్సులను తప్పుత్రోవ పట్టించి వేదనకు గురిచేసేటందుకే కాలపురుషుడు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను నియమించాడు. కనిపించని వలక్రింద జల్లబడిన కోరికల ధాన్యపు గింజలు ఏరుకు తినేటందుకు దిగి, చిక్కుకుపోయిన పావురంలాంటిది ఆత్మ. కోర్కెల మహాప్రవాహం ప్రతిసారీ చేదు రుచిని మిగులుస్తూ ప్రవహిస్తూనే ఉంటుంది. వినాశన ప్రక్రియను గమనిస్తూ మూగ బాధననుభవించడం తప్ప మరేమీ చెయ్యలేకపోతోంది. సద్గురువు దయవలన వారి సంపర్కం కలిగితే గానీ దానికి విముక్తి లేదు. ఈ ప్రపంచం సృష్టికర్తను మరచి సృష్టిని ఆరాధిస్తోంది. కానీ ఆ సృష్టికర్తను ఆరాధిస్తేనేగాని మోక్షం లేదు.

చిత్త చాపల్యం లేనివాళ్ళు లోకంలో ఎవ్వరూ లేరు. దాని నుంచి భగవంతుని కృప ఒక్కటే మనల్ని రక్షించగలదు. ఆ పరమాత్మ సర్వ శక్తిమంతుడు. సంపూర్ణ జ్ఞానము కలవాడు. అతని లీలల్ని ప్రశ్నించే అర్హత ఎవ్వరికీ లేదు. తాను తల్చుకుంటే మనల్ని ఈ ఐహిక సుఖాల ఉచ్చు వలలో పడవేయనూ గలడు, యీ పాపకూపం నుంచి బయటకు లాగి మహాత్ముల మార్గంలో ఉంచనూగలడు. ఏది చెయ్యాలో, ఏది చెయ్యనక్కరలేదో ఆయనకు సలహానిచ్చే అర్హత, అధికారం ఎవడికున్నాయి? భగవంతుని భక్తులు, భగవంతుని

సహాయంతోనే ఈ భవసాగరాన్ని ఈదగల్గుతారు. వారు ధ్యాసనంతా భ్రూమధ్యంలో లగ్నపరచి నామంలో లీనమవుతారు. కానీ ఐహిక సుఖాశక్తి గల వారు తమ శక్తినంతా బాహ్య ప్రపంచపు ఆకర్షణలలో వృధాగా ఖర్చుచేస్తారు. మన ధ్యానశక్తిని బయటకు లాగడం మాయ యొక్క పన్నాగం. అయితే లోపలకు ఆకర్షించడం నామం యొక్క కర్తవ్యం.

క్షామం వచ్చి పశుగ్రాసం దొరకనప్పుడు పశువుల కాపరులు పచ్చిక మైదానాల కోసం వెతుకుతూ తిరుగుతారు. అలాంటి చోటేదైనా కనబడినప్పుడు తాత్కాలికమైన వసతులు ఏర్పరచుకుని అక్కడ ఉంటారు. ఎందుకంటే కొద్దిరోజుల తరువాత తమ పల్లెలకు తిరిగి వెళ్ళిపోవాలని వాళ్ళకు తెలుసు. ఈ ప్రపంచంలో మన వలస కూడా అలాంటిదే! అందుకే మనం కూడా తాత్కాలికమైన వసతులు మాత్రమే ఏర్పరచుకోవాలి. ఇక్కడ శాశ్వతంగా ఎవ్వరూ ఉండరు. ఒక రోజున ఆస్తిపాస్తుల్ని, కుటుంబాన్ని, బంధుమిత్రులనూ వదలి వెళ్ళవలసిందే. మన శరీరం కూడా మనతో రాదు. ఏ రోజున మృత్యువు పిలుస్తుందో ఎవ్వరికీ తెలియదు. కనుక ఈ ప్రాపంచిక వస్తువులను సొంతం చేసుకునే భావన వదలి, వాటిని అద్దెకు తీసుకున్న వస్తువుల్లా వాడుకుని వదలి వెయ్యగల మనోవైరాగ్యం అలవరచుకోవాలి. బాటసారి ప్రయాణంలో ఒకరాత్రి సత్రంలో చేసే మజిలీలాంటిది ఈబ్రతుకు, తెల్లవారగానే మళ్ళీ ఇక్కడికే రావలసి వస్తుంది. ఆ మోహం మనల్ని ఇక్కడికి రప్పిస్తుంది. దేనిమీద ఆశ ఉంటుందో దానితోటి పాశం బలపడుతుంది. రాజ్యాలు ఏలి, రారాజు బిరుదులను పొంది, 'నేను-నాది' అనే అహంకారంతో విర్రవీగిన చక్రవర్తులు ఎందరో ప్రపంచంలోకి వచ్చి వెళ్ళిపోవడం మనకు తెలుసు. వారిలో ఏ ఒక్కరూ పోతూ, పోతూ తనతో పూచిక పుల్ల కూడా తీసుకుని వెళ్ళలేక పోయారనేది పచ్చినిజం, కనుక ప్రాపంచిక మనోవేదనల నుండి బయట పడుటకు గాను మన మనస్సును బాహ్యం నుండి మళ్ళించి అంతర్ముఖులం కావాలి. జీవితం ఒక కల్లబొల్లి కల. దీన్లో ఏదీ నిజం కాదు. గడ్డిపూలు పూచి వాడి పోయినట్లే మన బ్రతుకులు కూడా అతి స్వల్పం. **రాజు, రాణి, సేనాధిపతుల వేషాలు వేసినవాళ్ళు నాటకం ముగియగానే తమ పాత్రలు మర్చిపోయి, రంగులు చెరిపివేసుకుని ఇంటికి ఎలా వెళతారో, అలాగే ఈ ప్రపంచమనే విశాలమైన రంగస్థలం మీద మనమంతా ముందే నిర్ణయించబడ్డ పాత్రల్ని నటించి, నిష్క్రమిస్తూ వుంటాం. నాటకంలోని పాత్రల మధ్య వున్న బంధుత్వాలు ఎంత కపటమైనవో ఈ ప్రపంచంలో మనం ఏర్పరచుకునే బంధాలు కూడా అంత అసత్యమైనవి. నాటకం విజయవంత మవ్వాలంటే ఎవడి పాత్రను వాడెలా సమర్థవంతంగా నిర్వహించాలో, అలాగే ఈ సృష్టి నడిచేటందుకు మనకు అప్పజెప్పబడిన పాత్రలలో మనం కూడా నటించాలి. ఒక అతిథి ఆతిధ్యం స్వీకరిస్తున్న గృహంలో అది కావాలి, ఇది కావాలి అని అడగకుండా, ఆ గృహస్తుదేది సమర్పిస్తే దానిని సంతోషంతోను, కృతజ్ఞతతోను ఎలా స్వీకరిస్తాడో అలాగే ఈ ప్రపంచానికి అతిథులమైన మనం కూడా ఆ సృష్టికర్త ఏది ప్రసాదిస్తే దానితో తృప్తిపడి కృతజ్ఞతతో మసలుకోవాలి.**

ప్రపంచమంతా వృధా ప్రయాసలలో క్షణం తీరిక లేకుండా మునిగిపోయింది. ప్రతి మెట్టుకూ ఎదురుదెబ్బలు తింటూ, జారిపడుతూ, అర్థం లేని ప్రయత్నం చేస్తూనే ఉంది. ధనం కొరకు, భార్యాబిడ్డల కొరకు ఎన్ని కన్నీళ్ళు కారుస్తామో లెక్కేలేదు. వానిని పోగొట్టుకున్నప్పుడు చెప్పలేనంత మనోవేదన ననుభవిస్తాము. కానీ అదే తపన, అదే వాదన ఆ భగవంతుని కోసం ఒకే ఒక్కరోజు అనుభవించినా చాలు అతణ్ణి తప్పక పొందగల్గుతాం. రోజంతా కష్టపడి పనిచేసి ఇంటికి వట్టి చేతుల్తో వచ్చే జీతం బత్తెంలేని వెట్టివాడిలాగ జీవితాన్ని నిష్ఫలంగా గడుపుతాం మనం. జీవితధ్యేయం సాధించబడకుండానే మిగిలిపోతుంది.

**సద్గురువును తెలుసుకోలేని బ్రతుకువ్యర్థం. బ్రతికి ఉండగా తననుతాను తెలుసుకోలేని వాడు, మరణానంతరం తనకోసం ఎన్ని పాపాల గుట్టలు పేర్చబడి వుంటాయో ఊహించనైనా ఊహించలేడు. కనుక భగవంతుణ్ణి ప్రార్థించడం మన తక్షణ కర్తవ్యం.** ఈ భౌతికమైన కంఠంతోటి, నాలుక తోటి స్తోత్రాలు వల్లెవెయ్యడం ప్రార్థన కానేకాదు. శరీరంలో ప్రవేశించిన నాదాన్ని వినడమే నిజమైన ప్రార్థన. కంఠస్థంచేసిన పద్యాలు, శ్లోకాలు పాడినంత మాత్రాన భగవంతుడు కనబడడు. అలాచేసే వాళ్ళందరూ భ్రమపడుతున్నారు. **సద్గురువు దయవలన మాత్రమే భగవంతుడు సాక్షాత్కారిస్తాడు. ఆ జీవి పరమానందాన్ని చవిచూస్తాడు.**

"సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవటానికా? ఎవరైతే ఎప్పుడూ నన్నే చూస్తూ, నాగురించి వింటూ, ఎప్పుడూ సాయి, సాయి అని స్మరిస్తూ, నాయందే మనస్సు నిలుపుతారో వారు నిశ్చయంగా దైవాన్ని చేరుతారు. వారు ఇహపరాల గురించి ఆలోచించాల్సిన పనిలేదు. భోగికంటే యోగి ఎప్పుడూ మెరుగే. రాజై వుండికూడ బిచ్చగాని దుస్తులు ధరించే వాడే నాకు ఇష్టుడు. భగవంతుడు మనల్ని ఎలా సృష్టించాడో అలా ఉండటములోనే తృప్తి పడాలి.

భూమి విత్తును ధరిస్తుంది. మేఘాలు వర్షిస్తాయి, సూర్యుడు తన రశ్మితో వాటిని మొలిపిస్తాడు. అయినా విత్తనాలు మొలిచినందుకు ఇవేమీ సంతోషించవు. మాడితే దుఃఖించవు. వాటిపని అవి చేసుకుంటూపోతాయి. నీవూ అలానే చలించకూడదు. ఇక దుఃఖమెక్కడిది. దుఖం లేకపోవడమే ముక్తి. నన్ను కేవలం ఆనందంగా ధ్యానించు అది కష్టమైతే నారూపాన్ని గురించే ఆలోచించు, మనస్సు ఆ ఒక్క రూపంలోనే నిలిచిపోతుంది. ధ్యానం చేసేవాడు, ధ్యానములనే భేదం నశించి 'చైతన్య ఘనత' లేక బ్రహ్మసమరసత కలుగుతుంది" అని బోధించారు శ్రీ శిరిడీసాయి. ఆచరించి తరించటమా లేదా అన్నది మన నిర్ణయమే. ఒక్కక్షణం ఆలోచించి ముందుకు సాగుదాము. "గురుపౌర్ణమి" శుభాకాంక్షలతో

సౌజన్యం : **'ఆత్మకథ'**

సేకరణ & సంకలనము : **వి.వి.పూర్ణచంద్రరావు**, విశాఖపట్నం

# జిజ్ఞాస



**మాస్టర్ ఇ.కె. గా ప్రసిద్ధి కెక్కిన వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, దేశవిదేశాలలో లక్షలాదిమందికి జ్ఞాన బోధను గావించిన కులపతి శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు (పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారి పెద్దన్న) గారు అనేక సందర్భాలలో భక్తుల సందేహాలను నివృత్తి చేసిన జ్ఞాన గుళికలను "జిజ్ఞాస" ద్వారా ఆగష్టు 11వ తేదీ వారి జయంతి సందర్భముగా మీకు అందిస్తున్నాము మాస్టర్ ఇ.కె. గారికి కృతజ్ఞతాభివందనాలతో...**

**- సంపాదకుడు**

**ప్రశ్న : మాస్టరుగారూ! ఫలానా దిక్కువైపుకే తిరిగి జపాలు పూజలు చేసుకోవాలనే నియమం ఏదైనా ఉన్నదా? చాలామంది తూర్పుదిక్కు మంచిదంటారు. కొందరు ఉత్తరదిక్కైనా ఫరవాలేదంటారు. పడమర దక్షిణాల విషయం సామాన్యంగా ఒప్పుకోరు. ఈ దిక్కుల కథేమిటి?**

జవాబు : జప తపాదులు భక్తి భావన కోసమైనపుడు అంతర్యామి అన్ని దిక్కులలోను ఉన్నాడు. ఏ దిక్కుకు తిరిగి కూర్చున్నా సాధన జరుగుతుంది. కాని భూమిమీద ఉన్న జీవులు అహోరాత్రాలకు బద్ధులు గనుక సూర్యోదయ సూర్యాస్తమయాలు అందరినీ ప్రభావితం చేస్తాయి. వాటి ధర్మాలను అనుసరించి తూర్పువైపు తిరిగి కూర్చోవటం ఎక్కువ అనుకూలం. అలాగే ఉత్తర దక్షిణ ధ్రువాలు అందరి వెన్నెముకలలోను చైతన్య వేగాన్ని పుట్టిస్తున్నాయి. కనుక వాటి ధర్మాల ననుసరించి ఉత్తర దిక్కుగా తిరిగి కూర్చోవటం కూడా దైవ భావనకు అనుకూలం. అదికాక ఆరోగ్యం కోరినవారు దక్షిణ దిక్కుగాను, విఘ్ననాశం కోరినవారు పశ్చిమ దిక్కుగాను తిరిగి సాధన చేయాలి. కేవలం భక్తి భావన, బ్రహ్మ, వర్చస్సు, విద్యాభివృద్ధి కోరినవారు ఉత్తరంగానో, తూర్పుగానో తిరిగి కూర్చోవాలి.

**ప్రశ్న : మైలలో మంత్రోపాసన చేయవచ్చునా! దేవుడు, పూజలు ఇవేమీ పనికిరావంటారు. నిజమేనా మాస్టారూ! అలాగే సంవత్సర సూతకం ఉంటుందని ఆ సంవత్సరంలో పుణ్యక్షేత్రాలకు వెళ్ళకూడదని, దేవుడి గుళ్ళలో ప్రవేశించకూడదని ఆంక్షలు పెడతారు. ఇవన్నీ ఎంతవరకు నిజం మాస్టారూ.**

జవాబు : ఇది కేవలం అజ్ఞానం. దేవుడుగాని, మంత్రంగాని, మైలపడి పోతారనడం అతి తెలివి. ఇందులోనే గనుక సత్యముంటే "అపవిత్రః పవిత్రోవాః" అనే శ్లోకాన్ని సంధ్యావందనంలోంచి కత్తిరించి పారేయాలి. ఆ శ్లోకాన్ని నమ్ముతారో, ఈ సిద్ధాంతాన్ని నమ్ముతారో ఎవరికి వారే తేల్చుకోవాలి. ఇకపోతే పూజాద్రవ్యాలు, పాత్రలు, విగ్రహాలు తాకినందువల్ల అతని అశౌచ వాతావరణం వాటికి సోకే అవకాశం ఉంది. అది కూడా స్థిరబుద్ధి గల వాడికి వర్తించదు. శోక సంవిగ్న మానసులకు వర్తిస్తుంది. కనుక అశౌచ దినాల్లో పూజా ద్రవ్యాదులు తాకకుండా మంత్ర, జప, ధ్యానాదులు నిర్భీతిగా చేసుకోవచ్చు. చేసుకున్నందువల్ల అశౌచం త్వరగా తొలగిపోతుంది. ఆ ఇంట్లో ఇంకొకళ్ళు నిర్విఘ్నంగా పూజ జరపడం కూడ చాల మంచిది. అది పనికిరాదంటే అశౌచ వాతావరణాన్ని ఎక్కువ చేసుకొనడమే అవుతుంది.

ఇక సంవత్సరసూతకం ఉంటుందని ఆ సంవత్సరంలో పుణ్యక్షేత్రాలను దర్శించడం పనికిరాదని అనడంలో అర్థమేలేదు. పుణ్యక్షేత్రాల్లో ఉన్న వాళ్ళకి సూతకం వస్తే ఊరు వదలి వెళ్ళిపోవలసి ఉంటుందా! అదీ కాక దహనం చేసిన రోజునే శ్మశానం నుండి సూటిగా శివాలయానికి వెళ్ళి శివలింగం దగ్గర దీపదర్శనం చేయాలని ఉంది. శివాలయం పుణ్యక్షేత్రం కాక, పాపక్షేత్రమా?

**ప్రశ్న : కొంతమంది వారానికొక రోజు భక్తుల ప్రశ్నలకు జవాబులిస్తూ ఉంటారని, ఆ వారం నాడు వాళ్ల ఇష్ట దేవత వారి నావేశించి మనకక్కావలసిన విషయాలన్నీ చెపుతూ ఉంటుందని, ప్రశ్నలడగదల్చిన వాళ్ళు ఆ వారంనాడు వెళ్ళాలని చెప్పుకుంటూ ఉంటారు. ఇక ఆ వారంనాడు తండోపతండాలుగా భక్తులు చేరుతూ ఉంటారు. క్యూలో నిలబడి వరుసగా వెళ్ళి తమ ప్రశ్నలను ఏకరువు పెడుతూంటే ఆ దేవుడో, దేవతో బదులు చెపుతూ వుంటారు. దీని లోని సత్యమేమిటి? ఆవారంనాడు ఆ భక్తుడ్ని ఆవేశించి పలుకు తాడంటారా? అది నిజమేనా?**

జవాబు : దేవతలకి, వారాలకి ఉన్న సంబంధం భక్తులు మాట్లాడి పెట్టిందే. మనస్సుకి అభ్యాసబలం వల్ల ఆ వారాలు ప్రాధాన్యం వహిస్తాయి. వేంకటేశ్వరస్వామి శుక్రవారం నాడు పనిచేయలేడా? ఆంజనేయులు మంగళవారం నాడు తప్ప మరో రోజున సముద్రం దాటలేడా? ఈ దేవతల ఇండ్లలో భక్తులు ఏర్పాటు చేసుకున్న వారాలివి.

ఇక ప్రశ్నలు చెప్పటానికి, భవిష్యత్తును, అదృష్టాన్ని వివరించడానికి ఆ దేవతలకేం కర్మ పట్టింది? మనస్సులో నమ్మి ఏది అభ్యాసం చేస్తే దాంట్లోనే భగవంతుని అంతర్యామిత్వం ఉంటుంది. ప్రశ్నలూ, భవిష్యత్తూ చెప్పే సామర్థ్యం, భక్తిభావంతో ఆత్మవిశ్వాసాన్ని పుంజుకుని ఒంటికాలిమీద లేస్తుంది. అలాంటి మొండిధైర్యానికి భక్తిభావమే అక్కర్లేదు. మద్యం కైపుచాలు. ఒక్కొక్క చిల్లర జ్యోతిష్యుడూ, థాట్‌రీడింగ్ (Thought Reading) వాడూ, బుడ్డీ వేశాక ధారాళంగా చెబుతారు. ఆ బుడ్డీని కూడ కొందరు

దేవుని పేరుతో పుచ్చుకోవడానికి దేవత ఉపాసన అంటారు. అదీ బుద్ధీ ఖాళీ అయిందాకా పనిచేస్తుంది. తీరా ఈ వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, కాళికాదేవి చెప్పే ప్రశ్నలు కూడా కొన్ని తప్పిపోతూ ఉంటాయి. ధారాళంగా నోటికి ఏది వస్తే అది చెప్పేసినా నూటికి యాభై పాళ్ళు జరుగుతాయిగదా! గనుక ఆ దేవుళ్ళ ప్రశ్నలు చెప్పుకునే దుకాణాలు పెట్టుకుంటారనడంలో ఆవేశం ఎంత ఉందో అసత్యం అంత ఉంది. తిరుపతి దాకాపోయి స్వామిసమక్షంలో మొక్కుకునే కోరికల్లోనే కొన్ని తప్పిపోతూ ఉంటాయి. దీని అర్థం ఏమిటి? భక్తికి, ఆ కోరికలకు సంబంధం లేదనీ, భగవంతుడి డ్యూటీలు అవి కాదనీ అర్థం. కాకపోతే నిస్సహాయ దుర్బల హృదయులకి ధైర్యం చెప్పటానికి ఈపద్ధతులు పనికివస్తాయి. కానీ ఈ దుకాణాలు పెట్టేవాళ్లలో ధైర్యం ధారపోసే వారికన్నా, ధనం ఆకర్షించే వారే ఎక్కువ. బాధతో ఉన్న వాడిదగ్గర పదిరూపాయలు పుచ్చుకొని మభ్యపెట్టి, మరింత నిస్సహాయుణ్ణి చేయటమే ఎక్కువ జరుగుతుంది. నిజమైనభక్తులు, ఉపాసకులు వీటికి చాలాదూరంగా ఉంటారు.

# మాస్టర్ ఇ.కె. ఉపదేశామృతం

"నీవు ఒక సద్గురువును ఎంచుకుందామని చూస్తున్నావు. అది నీకు సాధ్యమయ్యే పని కాదు. గురువు మనల్ని స్వీకరిస్తాడు తప్ప మనము అతనిని ఎంచుకోలేము. మార్కెట్లో మంచి వంకాయలను ఎంచుకోగలుగుచున్నామంటే వంకాయల కన్నా మనం తెలివిగలవాళ్ళము కనుక. అలాగే గురువును నీవు నిర్ణయించగలిగావంటే అతడికన్నా నీవే ఎక్కువన్నమాట. గురువులకు మార్కులు వేస్తున్నాం. ఎంతటి సాహసం! మనకు తెలియకుండానే మనను స్వీకరించి మనకు కనబడకుండానే మనను నడిపిస్తూ అవసరమైన వేళ, మనకు శరీరంతో సాక్షాత్కరిస్తాడు గురువు. అంతవరకూ నీకు తెలిసిన సత్కర్మను త్రికరణశుద్ధిగా ఆచరించు. నీ గురువే నీ దగ్గరకు నడచి వస్తారు."



"నీ నుండి ఏమైనా ఆశించేవాడు నీకు గురువు కాలేడు. నీపైన ఆధారపడేవాడు నీకు గురువు కాదు. తనను, తన నమ్మకాలను, విశ్వాసాలను నీపైన రుద్దేవాడు నీకు గురువు కాదు. గుర్తింపును కోరేవాడు నీకు గురువు కాదు. **నీ నుండి ఏమీ కోరనివాడు, నీ శ్రేయస్సు తెలిసి, నిన్ను నిష్కామంగా నడిపించేవాడు, నిన్ను తనంతవానిగా తీర్చిదిద్దేవాడు నీ గురువు.** ఒక అయస్కాంతం తన సాన్నిధ్యం చేత మరో ఇనుపముక్కను అయస్కాంతంగా చేస్తోంది. అలాగే గురువు కూడా తన సాన్నిధ్యాన్ని ప్రసాదించడం ద్వారా నిన్ను దివ్యత్వంలోనికి మేల్కొల్పుచున్నాడు."

"సూర్యునికీ, పద్మానికీ ఎంత దూరం. కాని సూర్యుడు ఉదయించగానే పద్మం వికసిస్తోంది. దీనినే సాన్నిధ్యం ప్రసాదించడం అంటారు. గురువుకు ఎంత దూరంలో ఉన్నా శిష్యుడు గురువును స్మరించడం ద్వారా ఆయన సాన్నిధ్యాన్ని పొంది విప్పారగలడు. ఇంకో గమ్మత్తు చూశారా, పద్మం వికసించే పద్ధతిలో ఒక రమ్యత ఉన్నది. అది అన్నివైపులా సమానంగా ఏకకాలంలో వికసిస్తోంది. అలాగే పరమగురువు సాన్నిధ్యం వలన శిష్యుడు సర్వతోముఖాభివృద్ధిని పొందుతాడు."

"ఆవేశకావేషాలతో కాగి కాగి క్రమంగా దైవం కొరకు అన్వేషణగా చల్లారుతున్న పాలవంటి శిష్యుని మనస్సులో గురుని ఉపదేశము మజ్జిగ చుక్కై తోడౌతుంది. ఆపై పాలు పెరుగైనట్టు, శిష్యుని మనస్సు నిశ్చలత్వాన్ని పొందుతుంది. ఆపైన సత్కర్మాచరణ అనే చిలకడం ద్వారా అనుభూతి అనేది వెన్నగా పైకి తేలుతోంది. ఇలా వెన్నగా రూపొందిన శిష్యుడు, వెన్న మజ్జిగలో తేలుతూ మజ్జిగకు మంచి రుచి యిచ్చినట్టు, తన చుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఉంటూ ఆ ప్రపంచానికి దివ్యానుభూతిని ప్రసారం చేసే కేంద్రంగా రూపొందుతాడు. అంటే తయారైన యీ మజ్జిగ ఇంకెన్ని పాలకుండలకైనా తోడుగా పనికివస్తుందన్నమాట. వెన్న ఎంత పిసికినా కలవనట్టు, ఎలాంటి స్థితిగతు లెదురైనా ఇతడు పూర్వపు స్థితులలోనికి జారిపోవడం అంటూ ఉండదు."

"లెక్కల పుస్తకం మనకందరకు తెలుసు. ముందు అధ్యాయాల వారీగా లెక్కలుంటాయి. చివరిపేజీలో అదే అధ్యాయాల వరుసలో ఆ లెక్కలకు ఆన్సర్లు (జవాబులు) ఉంటాయి. ఆన్సర్లు వేసుకుంటూ పోతే మార్కులు రావు. లెక్కల్లో కొన్ని స్టెప్పు (మెట్లు) ఉంటాయి. అవి చేయటం చేతకావాలి. సమాధానాన్ని సాధించాలి. అలానే 'అంతటా భగవంతుడు నిండియున్నాడు'. 'అంతా భగవంతుని నిర్ణయం ప్రకారం జరుగుతుంది' మున్నగు వాక్యములు సమాధానాలు వంటివి. అవి సాధించాలంటే కొన్ని స్టెప్స్ (మెట్లు) మనము ఆరోహణ చేయాలి. వాటినే విష్ణూపాసన, వాసుదేవోపాసన, నారాయణోపాసన అంటారు. అవి చేయకుండా చెప్పే పలుకులు చిలక పలుకులు."

జూలై 16వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు అందించిన ఉపదేశామృతాన్ని ఆగష్టు 11వ తేదీ వారి జయంతి సందర్భముగా మీకందిస్తున్నాము.

**– సంపాదకుడు**

సౌజన్యం : అనంతపుత్రుని అనంత వైభవం



# పూర్ణ అంతరంగాలు

"క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషిచేయటము ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి" అంటారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. "ఆత్మవికాసం అటుంచండి, మనోవికాసానికి కృషిచేయటానికే సమయం చాలటము లేదు" అంటూ తిరిగే వయస్సులో, నా తల్లితండ్రులు చేసిన పుణ్యఫలం వలన, లక్షలాది మందిని నిర్దుష్టమైన శ్రీ శిరిడీసాయి మార్గంలో పయనింపచేస్తున్న, పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి సాంగత్యము లభించటము నా పూర్వజన్మ సుకృతము. చిన్నప్పటి నుంచి శ్రీరామ భక్తుడినైన నేను, పూజ్యశ్రీ భరద్వాజగారి సందర్శనముతో శ్రీసాయిరాం సన్నిధికి చేరేను. చాలామంది, చాలాసార్లు నన్ను అడిగేరు, "మీరు సాయిమార్గంలోనికి రావటానికి దోహదపడిన అద్భుత సంఘటన ఏది?" అని, వారి ప్రశ్నకు నా ముఖములో కనిపించిన ప్రశ్నార్థకాన్ని చూసి, ఆలోచనలో పడిన వారికి, వెంటనే విషయం వివరిస్తూ, 'బాబాను నమ్మకోవటం వలన ఉద్యోగం వచ్చిందనో, ఆపద తొలగిపోయిందనో, వివాహమయిందనో, కఠినమైన చిక్కు సమస్యలకు పరిష్కారం లభించిందనో, పిల్లలు పుట్టేరనో, బాబాకు పరీక్ష పెడితే అనుకున్నది నెరవేర్చడం వల్లనో, ఇంకా ఎన్నో ఎన్నెన్నో కారణాల వలన సాయిమార్గము లోనికి వచ్చాము, అప్పటినుంచి సాయిని ఆరాధిస్తూ ఆయన సేవకే మా జీవితం అంకితం చేశామని చెబుతుంటారు కదా, మరి అటువంటి అద్భుతమేమైనా నా జీవితంలో జరిగిందా' అనే కదా మీ ప్రశ్న. శ్రీరామ భక్తుడనైన నేను గుంటూరు M BTC Govt. Polytechnic లో విద్యాభ్యాసం పూర్తి చేసిన వెంటనే 1979వ సంవత్సరములోనే సొంత ఊరిలోనే, కేంద్రప్రభుత్వ Telecom డిపార్టుమెంటులో ఉద్యోగము లభించింది. తదనంతరం ప్రఖ్యాతిగాంచిన భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం, శ్రీహరికోటలో 1982లో జాయిన్ అవ్వటం జరిగింది. ఇంతవరకు ఎక్కడా నా జీవితంలో బాబా ప్రశక్తే లేదు. షార్ ఉద్యోగి అయిన శ్రీ కొమాండూరు నారాయణాచార్యులు ఇచ్చిన శ్రీ సాయిలీలామృతము పారాయణ, వెనువెంటనే సూళ్ళూరుపేటలో అల్లు భాస్కరరెడ్డి గారింటిలో పూజ్య శ్రీభరద్వాజగారి దర్శనంతో శ్రీ సాయిరామ్ మార్గములోనికి రావటం జరిగింది. ప్రథమ దర్శనంలోనే మాష్టారిగారికి ఒక అడుగు దూరంలో కూర్చున్నప్పుడు, "ఏమన్నా అడుగు" అని మాష్టారుగారు అన్నప్పుడు, "నాకొక చిన్న సందేహం సార్, సూళ్ళూరుపేటలో చెంగాళ్ళమ్మ, అదేవిధముగా అనేక ప్రదేశాలలో ఆందాలమ్మ, నూకాలమ్మ, పోలేరమ్మ అని అనేక పేర్లతో ఉన్న దేవతా మూర్తులకు, శ్రీలక్ష్మీదేవి, పార్వతీదేవి, సరస్వతీ మొదలైన దేవతా (స్త్రీ) మూర్తులకు తేడా ఏమిటి" అని అడిగిన నాసందేహానికి, మెచ్చుకోలు చూపుతో మాష్టారుగారు ఇచ్చిన సమాధానంతో, అంతవరకు వారు 'శ్రీసాయిలీలామృత గ్రంథ రచయిత' అనే భావం తొలగిపోయి వారిపై పూజ్య భావం కలిగింది. తరువాత ఒంగోలులోని శ్రీమతి సుబ్బలక్ష్మిగారింట్లో, నేను ఇచ్చిన

సిగరెట్టు ప్యాకెట్టు తీసుకొని వెంటనే వెలిగించుకొని, "వీటికోసమే ఎదురుచూస్తున్నాను" అనటంతో వారి కరుణకు కరిగిపోయాను. నీదీ గుంటూరేనా, అయితే మనిద్దరిదీ ఒకే ఊరు అన్నప్పుడు, వారి ఆత్మీయతకు పరవశించాను. మరొకసారి శ్రీ కొమాండూరు నారాయణాచార్యులు ఒంగోలులో జరిగే తన వివాహానికి మాష్టారిగారిని ఆహ్వానించటానికి, నన్ను కూడ తనతో తీసుకుని మాష్టారిగారింటికి వెళ్ళినప్పుడు, శ్రీ నారాయణాచార్యులు మాష్టారిగారితో "పూర్ణచంద్రరావు నా బెస్ట్ ఫ్రెండ్" అని పరిచయం చేయబోతే "నాకెందుకు తెలీయదు, ఇంతకు ముందునుంచే నాకు తెలుసు" అన్న వారి ఆత్మబంధుత్వానికి దాసోహమయినాను. అటు తరువాత 1989 ఫిబ్రవరి 2వ తేదీ వారి ఉచ్ఛిష్ట తీర్థాన్ని స్వీకరించినప్పుడు, వారి విశ్వప్రేమతత్వాన్ని చవిచూసినప్పుడు వారికి పాదాక్రాంతుడనయినా, వీటిలో ఎక్కడా మీరనుకున్న సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అద్భుత సంఘటనలు "లేవు", అంటారా! "ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుని అనుంగు బిడ్డడై "సాయిమాస్టర్"గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి మొదటి దర్శనంలోనే, వారితో ఏకాంత భాషణము లభించటము నా జీవితంలో మొదట జరిగిన ఆధ్యాత్మిక పరమైన అద్భుతమైన ఘటన, "మనము చేసిన పూజలు పునస్కారాలతో, ఆచార వ్యవహారాలు, నియమ నిష్టలు, సత్ప్రవర్తనకు సంప్రీతుడైన భగవంతుడు సాటిలేని సద్గురుసన్నిధికి చేరుస్తాడు" అన్న ఋషివాక్యం నాజీవితంలో ఋజువయ్యి, శ్రీరాముడు, శ్రీ సాయిరాం అవ్వటం మరొక అద్భుత సంఘటన. గతాన్ని సింహావలోకనము చేసుకుంటుంటే "క్షణ క్షణమూ ఆత్మ వికాసానికై కృషిచేయటము ఒక్కటే మానవజీవిత లక్ష్యం కావాలి " అన్న మాష్టారిగారి మాటలో ఆంతర్యం ఇప్పుడు కొద్ది కొద్దిగా నాకు అవగతమవుతున్నది.

సాయి చరిత్రలో శ్రీ అన్నాసాహెబ్ ధబోల్కర్ అన్నట్లు, "నాజీవితంలో ఎంతో మంది, సన్నిహితులు, హితులు, స్నేహితులు, బంధువులు ఉండి ఉండవచ్చునేమో కాని, శ్రీసాయిని నాకు పరిచయం చేసిన వారే నాజీవితంలో నిజమైన హితులు, బంధువులు. శ్రీసాయి పాదాలు స్పృశించిన వెంటనే నా వెనుకటి జీవితానికి, ఇప్పటికి పొంతన లేకుండా పోయింది" అన్నట్లుగా, శ్రీ నారాయణాచార్యుల వలన శ్రీసాయి-మాస్టర్‌ల పరిచయముతో నా వెనుకటి ఆధ్యాత్మిక జీవితానికి ఇప్పటికి ఎంతో మార్పు వచ్చింది. వీటన్నింటిలో నా అర్హత కంటే సద్గురువు యొక్క అనుగ్రహమే మిన్న. మనము ఒక్క అడుగు వారివైపు వేస్తే, పది అడుగులు మనవైపు వేసి వెంటనుండి నడిపిస్తాడు సద్గురువు. మానసిక ఉల్లాసానికై పరుగులెత్తాల్సిన వయస్సులో సత్సంగాలు, పారాయణలు, భజనలు ఏమిటి? అంటూ సాటివారు, సహోద్యోగులు అన్నా, అదొక లోకంగా, పిచ్చిగా గడిపిన ఆ క్షణాలు ఇప్పుడు గుర్తు చేసుకుంటుంటే, కోరికల అగాధంలో పడిపోకుండా కాపాడుతూ, నిరంతరం వెంట ఉండి, ప్రతి విషయంలో శ్రేయస్కరమైనదే ప్రసాదిస్తూ, నడిపిస్తున్న అపార కరుణామూర్తి, ప్రేమ స్వరూపుడయిన శ్రీసాయి-మాస్టర్‌లకు ఏమిచ్చి ఋణము తీర్చుకోగలను, వారు చూపిన బాటలో పయనించి జన్మసార్ధకం చేసుకోవటం తప్ప. "ఆరెండింటిని సమర్పించటానికి ప్రయత్నం చేస్తున్నాను" అనే దాని కంటే, ఆ అర్హత పొందే విధముగా నడిపించే వారి లీలావిలాసాలు పరిశీలిస్తే, ఆత్మవికాసము దానంతట అదే జరుగుతుంది. అక్కడ మన ప్రయత్నమేమి ఉండదని నాభావన. "సాధన అంటే ఏదోవిధముగా ఏదేదో చేసేయటం కాదు, ఏమీ చేయకుండా ఉండటమే" అని చదివినట్టు గుర్తు. పూజ్య శ్రీ భరద్వాజ మాష్టారిగారికి అప్రయత్నంగా దక్షిణ సమర్పించుకునే అవకాశం కలిగిన సన్నివేశాన్ని ఇప్పుడు తలచుకున్నా ఒడలు పులకాంకితమయ్యి, మనస్సు ఆనంద పారవశ్యములో మునిగిపోతుంది.

పూర్వాపరాలలోకి వెళితే, 1989 ఫిబ్రవరి 2వతేదీ (తేదీ 2 లేక 3 అన్నది చిన్న సంశయము) సూళ్ళూరుపేటలో భాస్కరరెడ్డిగారింట్లో మాష్టారిగారి సన్నిధిని అనుభవించి, వారుచ్ఛిష్ట తీర్థాన్ని గ్రోలిన అనంతరం, శ్రీమాష్టారుగారి ఔదార్యానికి సంభ్రమాశ్చర్యానికి లోనైన నేను, దానినుండి తేరుకునేలోపే, మరొక అదృష్టం నావెన్ను తట్టింది. అప్పటికే మధ్యాహ్న సమయం అవ్వటముతో, అక్కడకు విచ్చేసిన వారందరికీ శ్రీభాస్కరరెడ్డి భోజన ఏర్పాట్లు చేయటమైనది. బయటవరండాలో అందరికీ భోజనం వడ్డిస్తుండగా ముందు గదిలో మాష్టారుగారు పక్కన శ్రీ రామారావు, శ్రీ పాండురంగగుప్త కూర్చొనగా మాష్టారిగారి ఎడమవైపు పంక్తిలో కూర్చొని భోజనం చేసే అదృష్టం నాకు కలిగింది. ఆ భాగ్యానికి పొంగిపోతూ వడ్డించిన పదార్థాలను ఆరగిస్తూ, మధ్యమధ్యలో మాష్టారుగారిని చూస్తూ, భోజనం ఆస్వాదించాను. భోజన విస్తరిలో కొద్దికొద్దిగా వడ్డింపచేసుకొని, వాటి అన్నింటిని కలిపి ఒక ముద్ద చేసి సమస్కరించి విస్తరిలో కుడివైపున ఉంచి, మిగిలిన పదార్థాలన్ని కలుపుకుంటూ ప్రక్కవారితో చిన్నగా మాట్లాడుతూ మాష్టారుగారు తన భోజనం ముగించారు. శ్రీ పాండురంగగుప్త గారి అభ్యర్ధన మేరకు మాష్టారుగారు సమీపంలోని చిత్రకూట మండపానికి రిక్షాలో బయలుదేరేరు. అప్పుడే ఉద్యోగ విధులనుంచి అక్కడకు వచ్చిన శ్రీనారాయణ సైకిల్ తీసుకురావటానికి ఇంటికి వెళ్ళి, దానితోపాటుగా అంతకు ముందు నావద్ద తీసుకున్న 'శిరిడీ ఆల్బమ్'ను తెచ్చి, వాళ్ళింట్లో వాళ్ళు అందరూ చూడటము అయిందని చెప్పి, నాకు తిరిగి ఇచ్చివేశాడు. ఇద్దరము కలసి సైకిల్‌పై చిత్రకూట మండపానికి చేరేము. అప్పటికే అక్కడకు చాలామంది చేరుకున్నారు. మాష్టారుగారు శిధిలమైన ఆ రామాలయ ప్రాంగణమంతా తేరిపార చూసి, నూతనముగా నిర్మించతలపెట్టిన

మందిరానికై తగు సూచనలిచ్చి, మద్రాసు నుంచి హైదరాబాదు వెళ్ళే హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు వెళ్ళటానికి అక్కడ నుంచి సూళ్ళూరుపేట రైల్వేస్టేషనుకు బయలు దేరేరు. శ్రీ భాస్కరరెడ్డి, శ్రీ జనార్ధనశెట్టి మొదలైన చాలామంది వారిని అనుసరించారు. మాష్టారుగారి దర్శనం కోసం విధులనుంచి నేరుగా వచ్చిన శ్రీ నారాయణ, నేను ఒట్టి చేతులతో మాస్టారి దర్శనం చేసుకున్నాము, వారికి ఒక్క పండుకూడ సమర్పించలేదనే భావంతో, పండ్లుకొనే నిమిత్తము మేమిద్దరము సైకిల్‌పై చిత్రకూట మండపమునుంచి సూళ్ళూరుపేట లోని బజారుకు వెళ్ళి, చెరొక డజను పెద్దసైజు ఆకుపచ్చ అరటిపండ్లు కొని, రైలు వచ్చేస్తే మాష్టారుగారు దర్శనం లభించదేమోనని త్వరత్వరగా రైల్వేస్టేషనుకు వచ్చాము. ట్రైను రాక లేటయింది. రావటానికి ఇంకా 20 నిముషాలు ఉందని తెలిసింది. మాష్టారుగారు రైల్వేస్టేషనులో ఒక సిమెంటు బెంచిపై కూర్చున్నారు. చుట్టూ చాలామంది నిలబడి ఉన్నారు. అప్పుడే అక్కడకు వచ్చినవారు మాష్టారుగారిని దర్శించుకుని వారి పాదాలకు నమస్కరిస్తున్నారు. మాష్టారుగారు తనవద్ద ఉన్న పండ్లను చేతికి వచ్చిన దానిని తీసి, ఒక్కొక్కరికీ ప్రసాదంగా ఇస్తున్నారు, మేము తీసుకువెళ్ళిన అరటిపండ్లను ఒకరి తరువాత ఒకరము మాష్టారుగారి చేతిలో ఉంచి, వారి పాదాలకు నమస్కరించుకొగా, వాటిలో నుంచి ఒక పండును తిరిగి మాకు ప్రసాదంగా ఇచ్చి, మిగిలిన పండ్లను ప్రసాదం అందని అక్కడి వారికి క్షణంలో పంచిపెట్టేశారు. మాష్టారుగారికి అందరు నమస్కరించుకోవటం పూర్తయిన తరువాత మరల మాష్టారిచుట్టూ చేరి అందరమూ నుంచున్నాము. మాష్టారుగారికి ఎడమవైపు నేను నుంచున్నాను. నావెనుక శ్రీ నారాయణ, మాష్టారుగారికి కుడివైపు శ్రీ రామారావు, శ్రీ జనార్ధన శెట్టి తదితరులు, ఎదురుగా భాస్కరరెడ్డి మొదలైనవాళ్ళు నుంచున్నారు. మాష్టారుగారు అంతసేపు ఆ సిమెంటుబెంచిపై కూర్చోవటానికి కారణమైన రైలుబండి ఆలస్యానికి భాధపడుతూనే, మరింత సేపు వారితో గడిపే అవకాశం కలిగినందుకు ఒకింత సంతోషమూ కలిగింది మా అందరికీ. ఆ విషయం అక్కడివారి ముఖంలో దౌఖ్యమవుతూనే ఉంది. అంతవరకు నిశ్శబ్దముగా ఉన్న నా మదిలో ఒక కోరిక కలిగింది. ఆ కోరికను నెరవేర్చుకోవటానికి ఇదే సమయమని భావించిన నేను, భుజానికి తగిలించుకున్న సంచిలోనుంచి ఫోటో ఆల్బమ్ బయటకు తీశాను. అవి నేను 1985లో శిరిడీ వెళ్ళినప్పుడు నా దగ్గర ఉన్న చిన్న కెమెరాతో, గురుస్థానం నుంచి సమాధి మందిరం వరకు వివిధ కోణాలలో తీసిన 24 ఫోటోలు. వాటిని శిరిడీ దర్శన్ పేరిట ఒక ఆల్బమ్‌గా తయారు చేసుకున్నాను. నల్లటి పేపరుపై రెండుఫోటోలు అతికించే అలనాటి ఆల్బమ్ అది. సంచిలోనుంచి బయటకు తీసి అది మాష్టారుగారి చేతిలో ఉంచి, "మాష్టారుగారు! ఇవి నేను శిరిడీలో తీసిన ఫోటోలు ఒక్కసారి మీరు చూడండి" అంటూ వారి చేతికి అందించాను. వారు వాటిని చూసి మెచ్చుకుంటేచాలు, అది నాకు సాయి సంపూర్ణ అనుగ్రహముతో సమానము, అంతేకాక వారి స్పర్శతో అవి సజీవముగా గోచరిస్తాయని నా భావం. ఫోటో ఆల్బమ్‌ను అందుకున్న మాష్టారుగారు మొదటిపేజీ తెరిచేరు. "గురుస్థానం ఫోటో చూసి చాల బాగుంది, ఈ విధముగా నావద్ద లేవు, ఈఫోటో నాకు ఇస్తావా" అన్నారు మాష్టారు, "తీసుకోండి మాష్టారు" అన్నాను. మరొక పేజీ తిప్పేరు మాష్టారుగారు, "ఇదీ చాలాబాగుంది, ఈ ఫోటో కూడ కావాలి నాకు అన్నారు", "తప్పకుండా మాష్టారు" అన్నాను. మరొక పేజీ తిప్పేరు, "ఇది ఇంకా బాగుంది శిరిడీచూస్తున్నట్లే ఉంది ఈ ఫోటో కూడ కావాలి" అన్నారు మాష్టారుగారు నావైపు చూస్తూ. ''తప్పకుండా మీరడిగినవన్నీ ఇస్తాను మాష్టారు'' అన్నాను. చిరునవ్వుతో మాష్టారుగారు మిగిలిన ఫోటోలు అన్నీ త్వరత్వరగా చూసి, "అన్నీ చాలా బాగాఉన్నాయి, అన్ని ఫోటోలు నాకు కావాలి ఇస్తావా" అన్నారు నావైపుచూస్తూ. "అంతకంటేనా మాష్టారు, ఆల్బమ్ మొత్తము మీకిచ్చేస్తాను తీసుకోండి మాష్టారు'' అన్నాను పరమానందముతో. చిరుమందహాసముతో మాష్టారు నావైపుచూస్తూ, "మరి నాకు మొత్తం ఇచ్చేస్తే నీకు ఎట్లా ఆఫోటోలు" అన్నారు. "అవి నేను తీసినవే మాష్టారు, ఫిల్మ్ నాదగ్గరే ఉంది మరల ప్రింట్ చేయించుకుంటాను" అన్నాను. మాష్టారుగారు నావైపు ఒక్కక్షణం అలా చూశారు. ( ఆచూపులోని భావాన్ని ఇప్పటికీ నేను వర్ణించలేను) వెంటనే శ్రీరామారావుతో మాష్టారుగారు "ఇది నా సంచిలో జాగ్రత్తగా ఉంచు, ఆల్బమ్ మొత్తం నాకే ఇచ్చాడు" అన్నారు. "అదికాదు మాష్టారు, ఒక్కొక్క ఫోటో చూస్తూ అదికావాలి, ఇది కావాలి అని అన్నిసార్లు అడిగి తీసుకున్నారు, ఒకేసారి ఆల్బమ్ మొత్తము అడిగితే పూర్ణచంద్రరావు ఇవ్వడా ఏమిటి?" అన్నారు ప్రక్కనే ఉన్న శ్రీ జనార్ధనశెట్టి. ''అతని మనోభావాన్ని తెలుసుకోవటానికి అట్లా అడిగేను'' అన్నారు మాష్టారుగారు. "తెలిసిందా మాష్టారు" అన్నారు శ్రీ జనార్ధనశెట్టి. "తెలిసింది కనుకనే మొత్తం తీసుకున్నాను" అన్నారు మాష్టారుగారు. ఒక్కక్షణం అక్కడ మౌనం రాజ్యమేలింది. ఆ సంఘటన ఇప్పుడు తలచుకున్నా, నా మదిలోని ఆనందతరంగాలు ఇప్పటికీ ఎగసిపడుతునే ఉన్నాయి. బండబారిన హృదయాలను సహితం "శ్రీ సాయిలీలామృత" ప్రవాహముతో కరిగించి, వారి గుండెగుడిలో శ్రీసాయిని సజీవముగా ప్రతిష్టించ గలిగిన లబ్దప్రతిష్టితులైన మాష్టారుగారికి నానుంచి శ్రీసాయి చిత్తరువు కావాలా? వారి అవాజ్యమైన ప్రేమామృతపు జల్లుతో నన్ను పునీతము చేసి, నా జన్మసార్ధకమయ్యేలా, శ్రీ సాయిస్వరూపులయిన మాష్టారుగారు స్వయముగా అడిగి తీసుకున్న చిరు దక్షిణ అది. నా జన్మ సాఫల్యానికి ప్రధమ సోపానమది. ఈనాటికి స్మృతి పథములో ఆ సన్నివేశం కదలాడుతుంటే కన్నుల వెంట అప్రయత్నముగా ఆనందాశ్రువులు జాలువారుతాయి. స్మృతిపథముపై అలనాటి జ్ఞాపకాల దొంతరలు జాలువారుతుండగా, దరి చేరిన అందరికీ

అభయమిస్తూ, ఆదరిస్తూ, శ్రీసాయిని అందించే మాష్టారుగారి అమృతహస్తం, నానుంచి అడిగి అందుకోవటము నాపాలిటి మేరుసదృశ్యమైన శ్రీసాయి అనుగ్రహానికి ప్రతీక, నా భాగ్యము ఏమని చెప్పను, ఎంతని చెప్పను, గుండె గొంతుకతో కొట్లాడుతుండగా, మనోతెరపై అలనాటి సంఘటన, దృశ్యంలా ఎదుట కదలాడుతుండగా, ఎక్కడినుంచో వినవస్తున్న పదకవితా పితామహుడు అన్నమాచార్య విరచితమైన "ఇందరికీ అభయమిచ్చు చేయి" కీర్తన కర్ణ ప్రేయము కాగా, ఆలకిస్తున్న మనస్సు మాష్టారి అభయహస్తాన్ని మనోఫలకంపై దర్శిస్తూ ఉండగా ఆనంద పారవశ్యంతో మౌనంగా ఉండిపోయాను.

ఇందరికీ అభయంబులిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి !!

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి క్రింద చేర్చు చేయి
కలికి యగు భూకాంత కౌగలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాడి చేయి !!

తనివోక బలి చేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసగు చేయి
మొనపి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి
ఎనయ నాగేలు ధరియించు చేయి !!

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబు బరపెడి దొడ్డ చేయి
తిరువేంకటాచలా ధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణుల కెల్ల తెలిపెడి చేయి !!

అందరికీ అభయంబులిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి !!

మీ... వి.వి. పూర్ణచంద్రరావు

## పండుగలు - పర్వదినాలు

**జూలై - 2019**

1 శ్రీ గులాబ్‌బాబా జయంతి (కాటేల్) (తేదీ ప్రకారం)
4 పూరి జగన్నాధుని రథయాత్ర
14,15,16 గురుపూర్ణిమ మహోత్సవాలు, పవర్‌సిటీ, వైజాగ్
16 శ్రీగురుపూర్ణిమ మహోత్సవము
17 దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం

**ఆగష్టు**

7 విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి (తేదీ ప్రకారం)
9 వరలక్ష్మీ వ్రతం
11 కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల జయంతి
12 బక్రీదు
15 స్వాతంత్ర్య దినోత్సవము
15 సద్గురువుల పాదుకామహోత్సవం – నర్సీపట్నం రాఖీపండుగ
17 శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
17 హజరత్ శ్రీతాజుద్దీన్ బాబా ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
21 శ్రీ గురుసిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
24 శ్రీకృష్ణాష్టమి
24 అవధూత శ్రీ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
24, 25వ తేదీలలో 25వ సద్గురువులపాదుకామహోత్సవము పవర్‌సిటీ, విశాఖపట్నం
30 పోలాల అమావాస్య

**సెప్టెంబరు**

2 వినాయక చవితి, శ్రీపాద శ్రీవల్లభుల జయంతి
3 అవధూత శ్రీ చీరాల స్వామి ఆరాధనోత్సవము, ఋషిపంచమి, శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
5 ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజామహోత్సవం)
7 కేదారేశ్వరవ్రతం
12 శ్రీ అనంతపద్మనాభ (వ్రతం) చతుర్దశి
14 మహాలయ పక్షాలు ప్రారంభం
16 ఉండ్రాళ్ళతద్ది
17 విశ్వకర్మ జయంతి
28 మహాలయ అమావాస్య
29 శరన్నవరాత్రులు ప్రారంభం

**అక్టోబరు**

2 గాంధీ జయంతి
5 సరస్వతి పూజ
6 శ్రీ దుర్గాష్టమి
8 విజయదశమి
శ్రీ శిరిడీ సాయి 101వ మహాసమాధి మహోత్సవము
13 వాల్మీకి జయంతి
16 అట్లతద్ది
26 ధనత్రయోదశి
27 నరక చదుర్ధశి
28 దీపావళి
30 పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి జయంతి

# స్ఫూర్తి ప్రదాత శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్

వంగదేశములో 1861 మే 7వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు పద్నాలుగవ సంతానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మించాడు. ఇతని బాల్యం చాలా విచిత్రముగా గడిచింది. ఆముదం దీపం ముందు పుస్తకం పట్టుకొని కూర్చొని ఆవలిస్తూ కునికిపాట్లు పడుతూ చదివేవాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించేవాడు. కథలంటే చెవి కోసుకునేవాడు. సామాన్య దుస్తులతో నిరాడంబరంగా పెరిగాడు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచమొక రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహలపడేవాడు.



శ్రీ రవీంద్రుడు పాఠశాలలో చదవటానికి ఇష్టపడక ఇంటివద్దనే క్రమశిక్షణతో ప్రతి ఉదయం వ్యాయామం చేసి, లెక్కలు చేసి, చరిత్ర భూగోళ పాఠాలను, సాయంత్రం చిత్రలేఖనం, ఆటలు ఇంగ్లీషు అభ్యసించేవాడు. ఆదివారాలలో సంగీత పాఠాలు, భౌతిక శాస్త్రం ప్రయోగాలు, సంస్కృత వ్యాకరణం నేర్చుకొనేవాడు. బొమ్మలున్న ఆంగ్ల నవలలను స్వయంగా చదివేవాడు. కాళిదాసు, షేక్స్పియర్ రచనలు చదివాడు. మాతృభాష పట్ల అభిమానం పెంచుకొన్నాడు.

శ్రీ రవీంద్రుడు ఇంగ్లాండులో ఒక పబ్లిక్ స్కూలులో చేరి, ప్రొఫెసర్ మార్లే ఉపన్యాసాలు విని, ఆంగ్ల సాహిత్యంపై అభిరుచి పెంచుకున్నాడు. సాహితీపరుల ప్రసంగాలు విని వారితో సంభాషించి నాటకాలకు, సంగీత కచేరీలకు వెళ్ళి, ఆంగ్ల సంస్కృతీ సంప్రదాయాలు బాగా ఆకళించుకొన్నాడు. తన అనుభవాలను భారతి పత్రికకు లేఖలుగా వ్రాసేవాడు. శ్రీ రవీంద్రుడు ఇంగ్లాండులో వుండగానే భగ్న హృదయం అనే కావ్యాన్ని రచించాడు. అయితే ఇంగ్లాండులో పద్దెనిమిది మాసాలు వుండి ఏ డిగ్రీని సంపాదించకుండానే స్వదేశానికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత 1883 డిసెంబరు 9న మృణాలిని దేవిని వివాహం చేసుకున్నారు.

శ్రీ రవీంద్రుడు బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించాడు. ఆయన రచించిన సంధ్యాగీత్ కావ్యాన్ని కవులందరూ మెచ్చుకొనేవారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర చటర్జీ కూడా శ్రీ రవీంద్రుని ప్రశంసించాడు. శ్రీరవీంద్రుడు రచించిన భక్తిగీతాలను తండ్రి విని, వాటి ప్రచురణ కవసరమైన డబ్బు ఇచ్చేవాడు. ఆ తరువాత విర్గరేర్, స్వప్న భంగ, సంగీత ప్రభాత్ కావ్యాలను రచించాడు శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్.

శ్రీ రవీంద్రుని రచనలలో గీతాంజలి చాల గొప్పది. శ్రీ రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించి "గీతాంజలి" అని పేరు పెట్టాడు. అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించబడింది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి, శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. 1913వ సంవత్సరంలో సాహిత్యానికి సంబంధించిన శ్రీ రవీంద్రుని గీతాంజలికే నోబెల్ బహుమతి లభించింది. "విశ్వకవి" అనే బిరుదు సాధించి పెట్టింది. ఆసియా ఖండంలో మొదటిసారి నోబెల్ బహుమతి పొందిన వ్యక్తి ఆయన. గీతాంజలి వెలువడిన తరువాత అన్ని దేశాలవారు శ్రీ రవీంద్రుని గ్రంథాలను చదవడం ఆరంభించారు.

శ్రీ రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండిపోక, బాలల హృదయాలను వికసింపచేయటానికై ప్రాచీన మునుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అది అయిదుగురు విద్యార్థులతో మొదలై, క్రమంగా విస్తరించింది. చిన్న పిల్లలు ఉపాధ్యాయుల ఇళ్ళలో భోజనం చేసేవారు. ప్రాతఃకాలానే నిద్రలేవడం, కాలకృత్యాలు తీర్చుకొని, తమగదులను తామే శుభ్రపరచుకొని స్నానం చేయడం, ప్రార్థన చేయటం, నియమిత వేళలో నిద్రపోవటం వారి దినచర్య. ఆరోగ్యం కాపాడుకోవటం, పరిశుభ్రత, సత్యాన్నే పలుకుట, కాలినడక, పెద్దలను, గురువులను గౌరవించటం వారికి నేర్పేవారు. 1919లో కళాభవన్‌ను ఆయన స్థాపించారు. ఇక్కడ విద్యార్థులు విభిన్న కళలను నేర్చుకునేవారు.

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని శ్రీ రవీంద్రుడు భావించాడు. అందుకై శ్రీనికేతాన్ని నెలకొల్పి గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేసేవాడు. శ్రీ రవీంద్రుడు మొదట "వాల్మీకి ప్రతిభ" అనే నాటకాన్ని రచించాడు. ఆ తరువాత అమల్ అనే పిల్లవాణ్ణి గురించి "పోస్టాఫీసు" అనే నాటకం వ్రాశాడు. శ్రీ రవీంద్రుడు రచించిన "చిత్రాంగద" నాటకం ఆయనకు మంచిపేరు తెచ్చింది.

ప్రకృతి–ప్రతీక అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించాడు. శ్రీ రవీంద్రుడు కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటిర్‌పూజ మొదలగు అనేక శ్రేష్ఠమయిన నాటకాలు రచించాడు. మతాలు వేరైనా పరస్పర స్నేహంతో కలసి మెలసి ఉండాలి అనే సాంఘిక ప్రయోజనం ఉత్తమ సందేశం మిళితమైన "గోరా" నవల శ్రీ రవీంద్రులకెంతో పేరు తెచ్చింది.

శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ డెబ్భైఏళ్ళ ప్రాయంలో చిత్రకళా సాధనను ప్రారంభించాడు. ఆయన వేసిన చిత్రాలు లండను, ప్యారిస్, న్యూయార్క్ మొదలగు నగరాలలో ప్రదర్శింపబడ్డాయి. ఆయన దాదాపు రెండు వేల చిత్రాలు గీశాడు. శ్రీ రవీంద్రునికి సంగీతమంటే ప్రీతి. ఆయన బెంగాల్ జానపద గీతాలను, బాపుల్ కీర్తనలను విని ముగ్ధుడయ్యేవాడు. ఆయన స్వయంగా గాయకుడు. భారతీయ సంగీతంలో 'రవీంద్ర సంగీతం' అనే ప్రత్యేక శాఖలను ఏర్పరచిన వాడు శ్రీ రవీంద్రుడు.

శ్రీ రవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలున్న వాడు. "హిందూ మేళా"లో దేశభక్తి గీతాలను పాడేడు. పృథ్వీరాజు పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించాడు. బ్రిటిష్ ప్రభుత్వం తిలక్‌ను నిర్బంధించినపుడు శ్రీ రవీంద్రుడు తీవ్రంగా విమర్శించాడు. బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమంలో శ్రీ రవీంద్రుడు ప్రముఖపాత్ర వహించాడు. జాతీయ నిధికి విరాళాలు వసూలు చేశాడు. శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో మొట్టమొదటిగా బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరాన్ని ఆలపించాడు. శ్రీ రవీంద్రుడు వ్రాసిన "జనగణమణ" ను జాతీయ గీతంగా ప్రకటించేముందు "వందేమాతరం", "జనగణమణ" లపై దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలని సుదీర్ఘ చర్చ, తర్జన భర్జనలు జరిగాయి. అంతిమంగా శ్రీ రవీంద్రుడి "జనగణమణ" ఎంపిక అయింది. దీంతో రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్ 1950 జనవరి 24న "జనగణమణ"ను జాతీయగీతంగా, "వందేమాతరం"ను జాతీయ గేయంగా ప్రకటించాడు. అదే సమయంలో రెండూ సమాన ప్రపత్తి కలిగి ఉంటాయని స్పష్టం చేసాడు.

గీతాంజలి కావ్యం శ్రీ రవీంద్రునికి కవిగా ప్రపంచఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఈ కావ్యంలోని ఈ క్రింది గీతం మహాత్మాగాంధీకి మిక్కిలి అభిమాన పాత్రమైంది.

"ఈ మంత్రములు జపమాలలు విడిచిపెట్టు, తలుపులన్నింటినీ బంధించి ఈ చీకటిగదిలో ఎవరిని పూజిస్తున్నావు? కళ్ళు తెరచి చూడు, నీవు ఆరాధించే దేవుడు నీ ఎదుట లేడు, ఎచ్చట రైతు నేలను దున్నుతున్నాడో, ఎచ్చట శ్రామికుడు రాళ్ళు పగులగొట్టుతున్నాడో, అక్కడ ఆ పరమాత్ముడున్నాడు. వారితో ఎండలో, వానలో ధూళిధూసరితములైన వస్త్రములలో ఉన్నాడు. నీవు కూడా నీ పట్టు పీతాంబరములు ఆవల పెట్టి ఆనేల మీదికి పదా"....

శ్రీరవీంద్రనాథ్‌ఠాగూర్ ఆంగ్ల రచనలలో విస్తృతంగా జనప్రియమై చాలా పాఠ్యపుస్తకాలలో ఒక పాఠంగా చేర్చబడింది ఈ క్రింది రచన

"ఎక్కడ మనస్సు నిర్భయంగా వుంటుందో,<br>
ఎక్కడ మానవుడు సగర్వంగా తల ఎత్తుకుని తిరుగుతాడో<br>
ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా మనగలుగుతుందో,<br>
ఎక్కడ ప్రపంచం ముక్కముక్కలై ఇరుకైన గోడల మధ్య మ్రగ్గిపోవదో,<br>
ఎక్కడ మాటలు అగాధమైన సత్యం నుంచి బాహిరిల్లుతవో,<br>
ఎక్కడ విరామమైన అన్వేషణ, పరిపూర్ణత వైపు చేతులు చాస్తుందో,<br>
ఎక్కడ పరిశుద్ధ జ్ఞానవాహిని మృతాంధ విశ్వాసపుటెడారిలో ఇంకిపోదో,<br>
తలపులో పనిలో నిత్య విశాల పథాలవైపు ఎక్కడ మనస్సు<br>
పయనిస్తుందో ఆ స్వేచ్ఛాస్వర్గంలోకి, తండ్రీ! నా దేశాన్ని<br>
మేల్కొంచేట్టు అనుగ్రహించు"

తన జీవితంపై శ్రీ రవీంద్రుని ప్రభావమెంతో ఉన్నదని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా చెప్పుకొన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు శ్రీ రవీంద్రుడు మానసికంగా కృంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యాడు. తీవ్రంగా వ్యాధితో బాధపడుతూ, చికిత్సకై కలకత్తా నగరానికి వెళ్లాడు. కానీ, ప్రయోజనం లేకపోయింది. రచయితగా, సంగీతవేత్తగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతావేత్తగా శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ చరిత్రలో నిలిచిపోయాడు. మాతృభూమి, మానవ సంబంధాలపట్ల అచంచలమయిన నమ్మకం, ప్రేమాభిమానాలు కలిగి ఉన్న విశ్వకవి 'శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ 1941 ఆగష్టు 7న మరణించాడు.

(ఆగష్టు 7వతేదీ విశ్వకవి ఆరాధన మరియు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ వికీపీడియా**

సేకరణ : **శ్రీమతి కె. సాయి ప్రత్యూష**, గోవా

## ప్రార్థన

"నా హృదయంలోని పేదరికాన్ని సమూలంగా తొలగించు ప్రభూ!<br>
నా సుఖదుఃఖాలను తేలికగా భరించే శక్తిని నాకు ప్రసాదించు<br>
సేవలోనే నా ప్రేమను ఫలింపజేసుకునే శక్తిని అందజేయి.

పేదలను కాదనకుండా, అధికారదర్పానికి<br>
దాసోహమనకుండా ఉండే శక్తిని ప్రసాదించు.

దైనందిన అల్పవిషయాలకు అతీతంగా<br>
బుద్ధిని నిలుపుకోగల శక్తిని ప్రసాదించు<br>
నీ అభీష్టానికి ప్రేమతో నా శక్తిని అర్పించుకోగలిగే శక్తినివ్వు."

**– విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్, గీతాంజలి**

# శ్రీ గురు సిద్ధారూఢస్వామి

కన్నడ దేశంలోని ప్రఖ్యాత మహాత్ములైన శ్రీ గురు సిద్ధారూఢస్వామి ఆధ్యాత్మిక చక్రవర్తియైన శ్రీ శిరిడీసాయినాధులకు సమకాలీకులు. ఒకసారి సాయి సన్నిధికి ఒక వ్యక్తి రాగానే బాబా "వీరు ఒక పెద్ద మహాత్ముని కొలువుకు చెందినవారు" అన్నారు. అతడు గురుసిద్ధారూఢస్వామి శిష్యుడవడమే విశేషం.

కన్నడ దేశంలోని బీదరికోట అనే గ్రామంలో గొప్ప శివభక్తులైన గురు శాంతప్ప, దేవ మల్లమ్మ అనే పుణ్య దంపతులకు తానే పుత్రునిగా వారికి జన్మిస్తానని ఈశ్వరుడు వారికి వరం ప్రసాదిస్తాడు. నిత్యం ధ్యానము, పూజ, పంచాక్షరీ మంత్ర జపములతో గడిపే గురు శాంతప్ప, దేవ మల్లమ్మకు శక సం॥ 1758 దుర్ముఖి నామ సంవత్సర శ్రీరామనవమి, గోధూళి సమయమున కర్కాటక లగ్నంలో జన్మించిన మగ శిశువునకు సిద్ధుడని నామకరణం చేశారు. తల్లిదండ్రులతోపాటు రోజు శివపురాణ శ్రవణానికి వెళుతుండేవాడు. ఒక సంక్రాంతికి సిద్ధుడు పంచాక్షరీ మంత్రం చదువుతూ నువ్వులు, బెల్లం ఉన్న కుండని పగులగొట్టి వాటిని అందరికి పంచసాగారు. ఎంతమందికి పెట్టినా ఆ నువ్వుల బెల్లం రాశి తరగకపోవడం చూసి, ఊరి జనులంతా "ఇతడు శివుని అవతారమే" అంటూ సిద్ధునికి నమస్కరించారు. బడికి వెళ్ళమని అన్న తల్లితో, "ఈ భూమి అనే పాఠశాలకి గురువై వచ్చాను, నేను బడికి వెళ్ళాలా? మందమతులకు అక్షరాభ్యాసం గానీ, నిత్య వ్యాపకం, నిర్మలమైన అక్షరాత్ములకు పాఠశాలకు వెళ్ళాలనే ఇచ్ఛ ఉంటుందా?" అని జ్ఞానపరమైన మాటలు అన్నారు. బాల్యంలోనే అనేక లీలలు ప్రదర్శించి, తత్వ జ్ఞానమును ప్రజలకు బోధించిరి. కుల గురువులైన వీరభద్రస్వామి వారి ఆదేశాన్ని అనుసరించి, శివుని స్మరించి, తల్లి దండ్రులను ఒప్పించి పరిపూర్ణత్వం పొందడానికి సమర్ధుడైన సద్గురువును ఆశ్రయించడానికి సిద్ధుడు బయలుదేరెను. ముందుగా దక్షిణదేశ యాత్ర చేస్తూ పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, సురపురమనే ఊరిలో ప్రసిద్ధులైన "గజదండ మహారాజ్" అనే గురువు చెంతకు చేరుకున్నారు. ఉచ్ఛ నీచ భావం లేకుండా, ఆనందంగా పన్నెండు సంవత్సరాలు రాత్రి పగలు గురుసేవలో నిమగ్నమైపోయాడు. సిద్ధుని సేవానిరతిని మెచ్చి గురువుగారు ఆయనకు శాస్త్రాధ్యయనం చేయించిరి. సిద్ధునికి మంగళస్నానము చేయించి, శాస్త్రోక్త విధి పూర్వకముగా అవధూతాశ్రమాన్నిచ్చి "సిద్ధారూఢ భారతి" అనే నామాన్ని ప్రసాదించి, పుణ్యక్షేత్రాలలో సంచరిస్తూ ప్రజలలో భక్తిభావం కలిగిస్తూ, తత్వబోధ గావిస్తూ లోకాన్ని ఉద్ధరించి, ప్రారబ్ధరూపమైన సుఖ దుఃఖాలను సమభావంతో స్వీకరిస్తూ, పరమయోగియై జీవించమని ఆశీర్వదించారు.



గురువుగారి ఆజ్ఞను శిరసావహిస్తూ అక్కడినుండి దేశసంచారానికి బయలుదేరారు సిద్ధారూఢస్వామిగారు. ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, ఋషిపుంగవుల దగ్గరికి వెళ్ళి వారిని దర్శించి, జిజ్ఞాసువులు కనిపిస్తే చర్చలు జరుపుతుండేవారు. ఆనేగొంది రాజు యొక్క తీవ్ర ముముక్షత్వానికి ప్రసన్నులై వేదశ్రుతి ఆధారాలతో వారికి జ్ఞానబోధ చేసారు. చింతామణి ఆశ్రమంలో బ్రహ్మానందుడనే శిష్యుని విద్యాగర్వాన్ని రసాయన శాస్త్ర వాక్యాలతో భంగపరిచి, శ్రీశైలానికి చేరుకున్నారు. మల్లిఖార్జున స్వామిని దర్శించి, గుజ్జమ్మ అనే ఒక విరక్తురాలైన భక్తురాలికి విధి ప్రకారముగా పంచాక్షరీ మంత్రముపదేశించి, మానస పూజావిధానమంతా బోధించి ముందుకు సాగారు. గోకర్ణ క్షేత్రంలో మహా తేజస్వియైన "జడిస్వామి" తమ సహపాఠి అని గుర్తించి వారితో కలిసి భిక్షాటన చేసారు. అరిషడ్వర్గాలను జయించి, ఎవరు శాంతితో వుంటారో అతడే అసలైన పౌరాణికుడు అని ఒక పౌరాణికునికి చెప్పి తన జోలెలో నుండి ఏడు బంగారు నాణాలు తీసి అతనికి ఇచ్చారు. శ్రీసాయిబాబా లాగా "ప్రపంచమంతటా అన్ని జీవుల రూపాలలో సంచరించేది పరమాత్మయేనని గ్రహించి, సేవించడమే సర్వధర్మాలకు మూలమని, ఆకలిగొన్నవాడికి అన్నం పెట్టిన అది పరమాత్మకే చెందుతుంది" అని బోధించారు. దీర్ఘజ్వరముతో బాధ పడుతున్న ఒక విప్రునికి పంచాక్షరీ మంత్రముపదేశించి రోగ నివారణ చేసారు. కాశీ క్షేత్రంలో ఒక అన్న సంతర్పణలో భోజనం చేసి వెళ్లిపోతున్న సిద్ధులను "నీవు తిన్న ఎంగిలాకు నీయబ్బ వచ్చి తీస్తాడా?" అని కొట్టబోగా, కాశీవిశ్వేశ్వరుడు ప్రత్యక్షమై విస్తరి ఎత్తివేశాడు, అన్నపూర్ణేశ్వరి వచ్చి తన పమిట చెంగుతో మూతి తుడిచి అదృశ్యమైపోయింది.

సుమారు 1876-77 ప్రాంతంలో సిద్ధులు తమ దేశ పర్యటన ముగించి హుబ్లీలో స్థిరపడ్డారు. 52 ఏళ్ళపాటు సిద్ధుల పాదస్పర్శను పొంది హుబ్లీ పుణ్యక్షేత్రమయింది. గురు స్వరూపులైన మడివాళస్వామి వారు హుబ్లీలో రానున్న ఆపదలను సూచించి, వారించినా వినక సిద్ధులు హుబ్లీలోనే స్థిరనివాసం చేసారు. వారు

ఎక్కువగా మౌనంగా ఉంటూ, గోపాలకులతో కలిసి ఆడుతూ, నగరంలో తిరుగుతూ, కనిపించిన యింటిముందు చేతులు జోడించి మాట్లాడకుండా నిలబడేవారు. ఎవరు ఏమి పెట్టినా దాన్ని అక్కడే తినేవారు. కొందరు వారిని పిచ్చి వాడనీ, మూర్ఖుడనీ, మూగవాడనీ తిట్టినా పలికేవారు కాదు. జడిమఠ మఠస్వామివారైన శ్రీ సిద్ధవీరయ్య సిద్ధుల నిజస్థితిని తెలుసుకొని వారిని దర్శించి, పూజించారు. అప్పుడు ఒక పడగ విప్పిన నాగుపాము సిద్ధుల తల మీద ఆడుతూ వారికి కనిపించింది. ఇలా గోపాలురతో ఆడుతూ, జనులకు లీలలు చూపుతూ, అడవిలోని పండ్లతో ఆకలి తీర్చుకుంటూ, రోజులు గడపసాగేరు. ఎవరు ఏమి అన్నా, కొన్ని సందర్భాలలో వారిని కొట్టినా, అది "జ్ఞానికి కర్మపాశము ఏదో ఒక నెపముతో తీరిపోవలసినది వున్నది, కృష్ణుడు తాను ఏ తప్పు చేయకనే అపవాదులకు గురి కావలసి వచ్చింది. అట్లాగే నాకున్నూ" అని తమ భక్తులకు చెప్పేవారు.

శ్రీ సిద్ధుల వద్ద బళికాయి చిన్నప్ప, పరప్ప, శివప్ప, హెంబన్నా, సిద్ధప్ప, తిప్పణ మొదలగువారంతా రోజు శాస్త్రశ్రవణము చేసి, భజన చేసి మంగళ హారతి ఇచ్చేవారు. శ్రీ సిద్ధులవారికి అక్కడ ఒక ఆశ్రమం నిర్మించారు. వారు ఆశ్రమంలో వుంటూ భక్తుల కష్టాలను తొలగిస్తు, వారికి శాంతిని ప్రసాదించేవారు. భక్తుల అర్హతను పరీక్షించి, వారిని తగిన సేవలో నియమించేవారు. ఆకలితో అలమటించే నిరుపేదలకు స్వయంగా ఆయనే నిలబడి అన్నదానం చేయించారు. సిద్ధుల నిస్వార్థ నిరాపేక్ష సేవా భావము, ఇతరుల శ్రేయస్సును గురించి చింతన, ఐక్యభావము వలన సర్వమతస్థులూ సిద్ధులలో తమ ఆరాధ్యదైవాన్ని చూచుకొనేవారు. వంటిమీద చిన్న కౌపీనము, బోడి తల, బక్క చిక్కిన శరీరముతో వారు సాక్షాత్తు పరమ శివుడే అయినారు. వారి కీర్తి చుట్టుప్రక్కల చాలాదూరం వరకు వ్యాపించింది. మహాయోగీశ్వరుల చేతనే పరమశివుని అవతారంగా కొనియాడబడిన సిద్ధారూఢుల కీర్తి దశదిశలా వ్యాపించి, ఎందరో ముముక్షువులు వారి చెంతకు వచ్చి చేరారు. **స్వాతంత్ర్యయోధులైన శ్రీ బాలగంగాధర్ తిలక్, శ్రీ గాంధీజీగారు హుబ్లీ వచ్చినప్పుడు వారి సభలకు సిద్ధులే అధ్యక్షత వహించారు.** చనిపోయిన వారిని బ్రతికించారు. తమకూ, తమ చిత్రపటానికి భేదంలేదని నిరూపించారు. వారు శాస్త్ర ప్రవచనం చేస్తుంటే అనేక పశుపక్ష్యాదులు కూడ అక్కడకు చేరి శ్రద్ధగా వినేవి. వారి కీర్తి కొందరి అసూయకు కారణమై, ఒక భక్తురాలిగా వచ్చి సిద్ధులకు పెట్టిన విషాన్నాన్ని వారు ప్రసాదంగా తిని, 20రోజులు సమాధి స్థితిలో ఉండి 21వ రోజున సమాధి నుండి లేచి కూర్చున్నారు. కాలకూట విషాన్ని ఆరగించి సాక్షాత్తు పరమశివుడే అయ్యారు సిద్ధులు.

తల్లి లేని గురప్పను చేరదీసి తామే తల్లి తండ్రియై పెంచి శాస్త్రాధ్యయనం చేయించారు. సిద్ధారూఢులంతటి మహాత్ముని సాన్నిధ్యంలో అనేక ఆధ్యాత్మిక స్థితులు, అవస్థలు అనుభవించాడు గురప్ప. చివరకు గురప్పను మఠానికి ఉత్తరాధికారిని చేసి "శ్రీ గురు సిద్ధారూఢులు"గా నామకరణ చేసి "నీవు ఆస్థి, ఐశ్వర్యము, భోగభాగ్యాలు పట్టించుకోవద్దు. భక్తుల చేతిలో చిక్కుకోవద్దు" అని హితబోధ చేశారు.

ఆస్థి పెరిగే సరికి మఠ సంబంధమైన వైషమ్యాలు తలెత్తి కలహాలు ప్రారంభమైనాయి. కొందరు సిద్ధులను హతమార్చాలని వారికి విష ప్రయోగం చేసారు. రోజూ విషం తాగిస్తున్నా సిద్ధులు "శివార్పితం" అని అంటూ గడగడ తాగేవారు. వారి ఆరోగ్యం క్షీణించసాగింది. 21-8-1920 గురప్పను పిలిపించి తన కార్యం పరిసమాప్తం అయిందని, ఇక మీదట అంతా గురప్పే చేయాలని, ఒక క్షణం తీక్షణంగా యోగదృష్టితో చూశారు సిద్ధులు. గురప్ప దేహమనే ఇంటిలో జ్ఞానమనే నందదీపాన్ని వెలిగించారు.

సిద్ధుల నిర్యాణ వార్త క్షణంలో ఊరంతా వ్యాపించింది. వారి దేహాన్ని అలంకరించి, ఏంతో ఘనంగా ఊరేగించి 1906లో నిర్మించబడిన సమాధి మందిరంలో వారి దేహాన్ని సమాధి చేసారు. హుబ్లీలోని వారి సమాధినుంచి నేటికీ పిలిచిన వారికి పలుకుతూనే వున్నారు సిద్ధులు.

ఆగష్టు 21వ తేదీ బుధవారం శ్రీ గురుసిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ

సేకరణ : **శ్రీమతి వై. సాయి శిరీష**, బెంగళూరు

## నమస్కారం

'నమస్తే' అనే పదం 'నమరి', 'తె' అన్న వాటిని కలపడం ద్వారా వచ్చింది. 'నమరి' అన్నదానికి అర్థం శిరస్సు వంచడం, 'తె' అంటే 'మీకు' అని అర్థం, పదం చిన్నదైనా వినయవిధేయతల చిహ్నమైనది. భారతీయ సంస్కృతిలో తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు పెద్ద వారి నందరిని గౌరవించుటకు శిరస్సు వంచి నమస్కరించడం ఒక సంస్కారముగా భావిస్తారు. నిజానికి ఇద్దరు వ్యక్తులు కలిసి 'నమస్తే' అని ఒకరి కొకరు పలుకరించుకోవడమంటే వారి వారి మనస్సులు కలిసినవని సూచించుకోవడమన్న మాట. చాతీ ముందు చేతులు జోడించడం దీన్నే సూచిస్తుంది. తలవంచడమంటే స్నేహాన్ని ప్రేమానురాగాల రూపంలో వినమ్రంగా అందించడం. ఇదే మాదిరి నమస్కరించి 'జై శ్రీరాం, 'రాంరాం' 'జై శ్రీకృష్ణ', నమోఃనారాయణ' వంటి మాటలను కూడా దైవత్వ గుర్తింపుగా అంటూ ఒకరి నొకరు పలకరించుకోవడం, వీడ్కోలు చెప్పుకోవడం అనేది ఆనవాయితీగా ఉంది. 'నమస్తే' అన్న మాటకు ఆధ్యాత్మిక అర్థం జీవనశక్తి, దైవత్వం. నమస్కారము అనెడి సుగుణము సంస్కారులను వరించును. నమస్కారము బ్రతుకులో ఆనందమును నింపును. అజ్ఞానమును అంతమొందించును. అహంకారమును ధ్వంసమొనర్చును.

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2019 ఏప్రిల్, మే, జూన్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ సద్గురువాణి పబ్లికేషన్స్ సంయుక్తముగా 2019 ఏప్రిల్, మే, జూన్ నెలలలో అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమములు నిర్వహించటము జరిగింది. ఆ యా కార్యక్రమాలలో ట్రస్టు ఛైర్మన్, శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు దంపతులు మరియు ట్రస్టు సభ్యులు పాల్గొనటము జరిగింది.

ఏప్రిల్ 6వ తేదీ తెలుగు నూతన సంవత్సరము 'శ్రీ వికారి' నామ సంవత్సరం "ఉగాది" సందర్భముగా ట్రస్టు ఆవరణలో పంచాంగ శ్రవణము నిర్వహించి "సద్గురు కృపతో నూతన సంవత్సరములో ఆచరించాల్సిన విధి విధానాలు" గురించి చర్చించుకొని భక్త సమారాధన ఏర్పాటు చేయటమైనది.

ఉగాది సందర్భముగా శ్రీకాకుళం పి.ఎన్. కాలనీలోని "ఓపెన్‌షెల్టర్" అనాథ బాలుర వసతి గృహములోని వారి అవసరార్థము వంటసామాన్లు మరియు బియ్యం ఇవ్వటం జరిగింది.

ఏప్రిల్ 12వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము సందర్భముగా, ట్రస్టు ఆవరణలో వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు నోట్సు పుస్తకాలు బహుకరించటము జరిగింది. అదే సందర్భములో పవర్‌సిటీలోని శ్రీ సద్గురుపాదుకా క్షేత్రం వద్ద చలివేంద్రము ప్రారంభం చేయటమైనది.

సాయంత్రం ట్రస్టు ఆవరణలో జరిగిన కార్యక్రమములో 'మాష్టారు చూపిన సాయి మార్గము' అనే అంశముపై సత్సంగమము నిర్వహించి, సాయిమాస్టర్ గ్రంథాలు, ఫోటోలు ఉచితముగా బహుకరించి, తదనంతరము సమారాధన చేయటమైనది.

శ్రీకాకుళంలోని అరసవిల్లి అనాథ నిరుపేద బాలికల నివాసకేంద్రం "బాలసదనానికి" ట్రస్టు తరపున ఫ్యాన్‌లు, సిల్వర్ గిన్నెలు మొదలైవని బహుకరించటము జరిగింది.

ఏప్రిల్ 14వ తేదీ శ్రీరామనవమి సందర్భముగా ట్రస్టు ఆవరణలో చందనోత్సవము నిర్వహించి 'శ్రీసాయి-రాముడు' అనే అంశముపై సత్సంగమము నిర్వహించి, అన్న సమారాధన ఏర్పాటుచేయటమైనది.

శ్రీరామనవమి సందర్భముగా శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలోని నిరుపేదలకు అన్నదాన నిమిత్తము అక్కడి సేవాకేంద్రం వారికి కూరగాయలు, పాలు అందజేయటమైనది..

ఏప్రిల్ 24వ తేదీ ట్రస్టు ఆవరణలో జరిగిన కార్యక్రమములో 'శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం' పేరిట 60 నిరుపేద, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. ఆ కార్యక్రమములో ట్రస్టు మరియు సత్సంగ సభ్యులు పాల్గొనటము జరిగింది.

మే 10 మరియు 11 తేదీలలో గుంటగన్నె, ఇసుక గరువు, గేదెలబంద గ్రామాలలోని శ్రీ శిరిడీసాయిబాబా మందిర వార్షికోత్సవాలను మూడు గ్రామాల కూడలిలో అత్యంత వైభవోపేతముగా నిర్వహించటము జరిగింది. ఆ సందర్భముగా శ్రీ దత్తావతార పాదుకలతో శోభాయాత్ర నిర్వహించి, సాయంత్రం 'నేటి యుగావతారము శ్రీసాయి' అనే అంశముపై గోష్ఠి నిర్వహించటము జరిగింది.

కుజబంగి, రంకిలిసింగి, కొత్తురుగూడ, సొబూరు, దోరగూడ, పింపలిగూడ, గుంటగిన్నెల, జాకరవలస, జాముగూడ, గేదెలబంద, ఇసుకగరువు, మజ్జిపుట్టు, తూటంగి, కురంజగూడ, పిట్టగూడ, లక్క, గంగవలస, గుంటసీమ, ఒంద్రుగడ్డ, (ఒరిస్సా) గంజ, లయగండ మొదలైన అనేక గిరిజన గ్రామాలనుంచి దాదాపు 10 కిలోమీటర్లు నడచి విచ్చేసిన వందలాది మంది గిరిజన సాయి భక్తులచే 11వ తేదీ ఉదయం సామూహిక గురుపూజలు నిర్వహింపచేసి, శ్రీ శిరిడీసాయి అద్భుతమైన లీలలు, గాథలు, బోధలు గురించి వివరించటము జరిగింది. అనంతరము ట్రస్టు ఛైర్మన్ 16 మంది చిన్నారులకు సామూహిక నామకరణములు, 25 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసములు నిర్వహించటమే కాకుండా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. అందుకు కావాల్సిన వస్తుసామాగ్రి మొత్తము ట్రస్టు వారే సమకూర్చటమైనది. ఆ సందర్భముగా, గేదెలబంద సాయి మందిరము తరపున శ్రీ సీతారామ్ అక్కడి నిరుపేదలయిన సాయి సేవకులకు ట్రస్టు ఛైర్మన్ చేతుల మీదుగా వస్త్రాలు అందజేయటమైనది. ఆ కార్యక్రమాల నిర్వహణార్థమై విశాఖపట్నం నుండి ట్రస్టు సభ్యులు 15 మంది పాల్గొన్నారు..

మే 22వ తేదీ 'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట 40 మంది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ట్రస్టు ప్రతినిధులు అందజేయటము జరిగింది.

మే 25వ తేదీ ట్రస్టు ఛైర్మన్ జన్మదిన సందర్భముగా స్థానిక గాజువాకలో గల ఎయిడ్స్ బాధితుల పునరావాస కేంద్రం 'డిజైర్ సొసైటీ' వారి అభ్యర్ధన మేరకు దాదాపు 25 వేల రూపాయల విలువచేసే స్కూలు బ్యాగులను ఎయిడ్స్ బాధిత చిన్నారులకు ట్రస్టు ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమములో ట్రస్టీలు అయిన శ్రీమతి సాయి శిరీష, శ్రీమతి సాయి సృజన, శ్రీమతి సాయిప్రత్యూషలు అందజేయటము జరిగింది. ఆ కార్యక్రమములో ట్రస్టు ప్రతినిధులతో పాటుగా 'డిజైర్ సొసైటీ' తరపున శ్రీలక్షణ్ పాల్గొనగా పవర్‌సిటీ వెల్ఫేర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శంకరరావు మరియు సత్సంగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆ సందర్భములోనే శ్రీకాకుళంలోని అనాధ బాలుర వసతి గృహానికి కావలసిన వాటర్‌డ్రమ్ములు బహుకరించటము జరిగింది. అదే సందర్భములో అరసవిల్లిలోని బ్రాహ్మణులు, వేదపండితుల భోజన శాలకు ఆర్థిక సహాయము అందచేయటమైనది.

అరసవిల్లిలో వైశాఖమాసం 3వ ఆదివారం వచ్చే యాత్రికులకు షుమారు 3000 మందికి అన్నదాన నిమిత్తము కూరగాయలు మొదలైనవి అక్కడి అన్నదాన సమితి వారికి ట్రస్టు తరపున అందజేయటమైనది.

జూన్ 9వ తేదీ అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవము సందర్భముగా ట్రస్టు ఆవరణలో "అవధూత చివటం అమ్మ" చరిత్ర సామూహిక పారాయణ నిర్వహించి భక్త సమారాధన చేయటమైనది. ఆ సందర్భముగా చివటం అమ్మ చరిత్ర పారాయణ గ్రంథాలు, చిత్రపటాలు ఉచితముగా అందజేయటమైనది.

జూన్ 17వ తేదీ శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి సందర్భముగా నర్సీపట్నంలోని బాబుగారి ఆశ్రమాన్ని ట్రస్టు ఛైర్మన్ దంపతులు దర్శించుకొని అక్కడి కార్యక్రమములో పాల్గొనటము జరిగింది.

జూన్ 23, 24వ తేదీలలో తెలంగాణా రాష్ట్రంలో నిజామాబాద్‌లోని "తేనెసాయి ద్వారకామాయి బాబా" మందిర 13వ వార్షికోత్సవము సందర్భముగా జరిగిన శ్రీ మహాసత్సంగ్ కార్యక్రమములో ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు దంపతులు పాల్గొనటము జరిగింది. ఆ సందర్భముగా రెండు రోజులు 'శ్రీ శిరిడీసాయి సంప్రదాయము', 'శ్రీ సాయి అనుగ్రహానికి అనుసరించాల్సిన సాయి బోధలు' మరియు 'సాయిమాస్టర్' గురించి శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేయటమైనది. ఆ కార్యక్రమములో పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి అల్లుడైన శ్రీ శ్రీకాంత్ (విజయవాడ) శ్రీ కృష్ణావఝ్ఝల రాజేంద్రప్రసాద్, (హైదరాబాదు) శ్రీ సాయిదాస్ (శ్రీ శైలం), శ్రీ రాణి గోపాలకృష్ణ (హైదరాబాద్) శ్రీరమేష్ (నెల్లూరు) శ్రీ నరసింహరావు (హైదరాబాదు) మొదలైనవారు పాల్గొని, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆ సందర్భముగా విచ్చేసిన వేలాది మందికి ఆహ్వాన కమిటీవారు విశేష అన్నదానము నిర్వహించారు.

జూన్ 27వ తేదీ స్థానిక పరవాడ మండలం బాలికల వసతి గృహములో నివశిస్తూ 10వ తరగతి చదువుతున్న అతి నిరుపేద విద్యార్థినులకు, వస్త్రాలను, వారికి అవసరమైన నిత్యావసర వస్తువులను ''సద్గురువాణి'' పబ్లిషర్ శ్రీమతి వి.యస్. లక్ష్మీపూర్ణచంద్రరావు ఆధ్వర్యములో పవర్‌సిటీలోని సామాజిక వేత్త శ్రీ రామారావుమాష్టారి గారి చేతులమీదుగా అందజేయటము జరిగింది. ఆ కార్యక్రమములో సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

వివిధ ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమ విశేషాలను సంక్షిప్తముగా అందజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి,** విశాఖపట్నం

ఓం శ్రీ సాయినాథాయనమః | ఆహ్వానము | శ్రీ భరద్వాజ గురవేనమః



# గురుపూర్ణిమ మహోత్సవములు





**వేదిక**

**శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**

**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖ - 21**

**తేదీలు**

**2019 జూలై 14,15 మరియు 16**

**(ఆది, సోమ, మంగళవారములు)**

## గురుపూర్ణిమ మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు

### 2019 జూలై 14,15 మరియు 16 (ఆది, సోమ, మంగళవారము) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు

**ప్రతి రోజూ అభిషేకం, భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, సామూహిక శ్రీ గురుచరిత్ర, సాయిలీలామృతము, సాయిమాస్టర్‌ల పారాయణ, విద్యార్థులచే సామూహిక గురుపూజలు, విష్ణుసహస్రనామ పారాయణ, భక్త సమారాధన మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును. ఆ యా కార్యక్రమాలలో పాల్గొని, శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహము పొందుటకు అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.**

**గమనిక :**

**దూర ప్రాంతాలనుండి విచ్చేసే వారికి ఉచిత సామాన్య భోజన, వసతి ఏర్పాటు చేయడమైనది**

**నిర్వహణ :**

**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు (రిజిష్టర్డు)**

**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖపట్నం-531 021.**

**ఫోన్ : 0891-2510817, సెల్ : 9849645224, 9441467648**

# మేము సహితం సాయి సేవలో భాగస్వాములై...

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2019 ఏప్రిల్, మే, జూన్ నెలలలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. 'శ్రీ భరద్వాజ ఆపన్న హస్తం' పేరిట ప్రతి నెల 60 శారీరక, మానసిక, దివ్యాంగుల మరియు అతిపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీతో పాటు, ఎయిడ్స్ బాధిత చిన్నారుల వసతి కేంద్రము "డిజైర్ సొసైటీ", (గాజువాక) లోని బాలబాలికలకు వేసవి శిక్షణా శిబిరం సందర్భముగా దాదాపు 25 వేల రూపాయలు విలువ చేసే 60 స్కూలు బ్యాగులు బహూకరించటము జరిగింది. గిరిజన గ్రామాలలోని నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు నోట్సు , పాఠ్య పుస్తకాలు ఇవ్వటము జరిగింది. శ్రీ శిరిడీ సాయిబాబా మందిరము, (గేదెలబంద) వార్షికోత్సవము సందర్భముగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతములలోని మారుమూల 25 గిరిజన గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆ సందర్భముగా సామూహిక గురుపూజలు, నామకరణోత్సవాలు, అక్షరాభ్యాసములు నిర్వహించటమే కాకుండా అందుకు అవసరమైన సామాగ్రిని ఉచితముగా అందజేయటమైనది. ఆసందర్భముగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటమైనది. ఇవి ట్రస్టు నిర్వహించిన కార్యక్రమాలలో కొన్ని మాత్రమే. పూర్తి వివరాల కొరకై 23వ పేజి చూడగలరు. ట్రస్టు నిర్వహించే సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞాభివందనాలు. మీరిచ్చే ప్రతి రూపాయి సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించగలమని తెలియజేస్తూ, చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికీ, తమ కృపానుగ్రహము ద్వారా అన్ని రంగాలలో వృద్ధి చెందుతూ, మరింతగా ఆధ్యాత్మిక – సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని "శ్రీ దత్త సాయి భరద్వాజులను" వేడుకుంటూ, సహాయ సహకారములు అందించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

**సహాయ సహకారములు అందించిన సహృదయులు**

| | |
|---|---|
| శ్రీమతి రాయుడు నాగరత్నం, అమలాపురం | 5,121/- |
| శ్రీమతి బి. సరస్వతి, పవర్‌సిటీ, వైజాగ్ | 5,000/- |
| శ్రీ ఎస్. రామకృష్ణ, కూర్మన్నపాలెం | 5,000/- |
| శ్రీ దత్తసాయి భరద్వాజ సత్సంగము, గోపాలపట్నం | 3,600/- |
| శ్రీ శరత్‌చంద్రబాబు, కూర్మన్నపాలెం | 3,348/- |
| శ్రీ ఎస్. తిరుమలరావు, విశాఖపట్నం | 3,125/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్ | 3,000/- |
| శ్రీ సిహెచ్. నరసింహరావు, హైదరాబాదు | 3,000/- |
| శ్రీ కె. శ్రీనివాసరావు, కేరళ | 3,000/- |
| శ్రీ కె. హైమా అప్పలరాజు, ఎన్.టి.పి.సి | 2,000/- |
| శ్రీ వై. ధర్మారావు, బరంపురం, ఒరిస్సా | 2,000/- |
| శ్రీ పి. అప్పలరాజు, ఆర్.ఆర్.వి.పురం, వైజాగ్ | 1,500/- |
| శ్రీ కె. అప్పలరాజు, ఎన్.టి.పి.సి, పరవాడ | 1,000/- |
| సాయిభక్తుడు, విశాఖపట్నం | 1,000/- |
| శ్రీ వి.ఎస్. గురునాధరావు,పార్వతీపురం | 1,000/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 900/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 250/- |
| శ్రీ బి. కృష్ణారావు, విశాఖపట్నం | 207/- |
| శ్రీ బి.వి. శంకర్, విశాఖపట్నం | 202/- |
| కె. లక్ష్మీ నీరజ్, దేశపాత్రునిపాలెం, వైజాగ్ | 105/- |

**ధన, వస్తు రూపేణా మీ విరాళములు పంపవలసిన చిరునామా:**

**SRI SHIRIDI SAI SEVA TRUST**
**Online A/C No. 09551001100 6492**

**SRI BHARADWAJA PUBLICATIONS**
**Online A/C No. 09551001100 6491**
**IFSC Code: ANDB0000955**
**Andhra Bank, Ukkunagaram**
**(Used for RTGS and NEFT Transactions)**

**గమనిక :** శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు నిర్వహించే సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తూ, ఆన్‌లైన్ ద్వారా బ్యాంకులో డబ్బు జమచేయు వారు, తమ పూర్తి వివరాలు **98496 45224 సెల్ నెంబరుకు** మెసేజ్ ద్వారా తెలియజేయగలరు.

**– మేనేజరు**

# శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం

గత 26 సంవత్సరాలు అద్దె ఇంటిలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు, ద్వారకామాయి సత్సంగ మందిరము–పాదుకా క్షేత్రం మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్, విశాఖపట్నంలోని పరవాడ మండలములోని గౌతు లచ్చన్న నగర్ ప్రక్కన గల పవర్‌సిటీ ప్లాట్ నెం.13లో "శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం" పేరిట సొంత భవన నిర్మాణ పనులు ప్రారంభించటము జరిగింది. అక్కడ తాత్కాలికముగా ట్రస్టు మరియు పబ్లికేషన్స్ కార్యాలయము ఏర్పాటు చేయటమైనది. కనుక ఇక నుంచి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలైనా ఈ క్రింది చిరునామాతో జరుపగలరని మనవి.

## శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**
**ప్లాట్ నెం.13, పవర్ సిటీ, గౌతు లచ్చన్న నగర్ దగ్గర,**
**పరవాడ (మండలం), విశాఖపట్నం - 531021.**
**సెల్ : 98496 45224, ఆఫీసు : 08924529689**

చిరునామా మార్పును గమనించగలరు.

**– మేనేజరు**


సింహాద్రి అప్పలవేణుంపాలు గారి
S.A.N
ఆశీస్సులతో...
1980-2019
39
సం. ల నుండి
వినియోగదారుని సేవలో
SVG JC. సింహాద్రి వేణుగోపాల రావు
శ్రీ మోహన్ జనరల్ స్టోర్స్
MGS
కార్డు సెంటర్
సింహాద్రి నిలయం, కళింగరోడ్
శ్రీకాకుళం 944 000 1212
పెండ్లి శుభలేఖల ప్రత్యేక నిలయం
ఆత్మవిశ్వాసం కోల్పోకు - నీకీలోకంలో అసాధ్యమేదిలేదు


గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

కర్నేన శ్రీనివాస్
(మార్బుల్ శ్రీను)
శ్రీసాయిపల్లవి
మార్బుల్స్, గ్రానైట్స్ & టైల్స్
ఐ.డి.బి.ఐ. బ్యాంక్ వెనుక, సానావీధి,
శ్రీఅపార్ట్‌మెంట్స్ ఎదురుగా, శ్రీకాకుళం
ఫోన్: 9440168399, 9010533566
గ్రానైట్ పలకపై పేర్లు చెక్కబడును
మావద్ద మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్
హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును.
గ్రానైట్ & మార్బుల్స్‌కు సంబంధించిన
డిజైనింగ్ వర్క్స్ మా ప్రత్యేకత


# పూజ్యాయ రాఘవేంద్రాయ!

శ్రీ రాఘవేంద్రప్రభువు దేశ సంచారము చేస్తున్న సమయములో ఎన్నో మహిమలను ప్రదర్శించటమే కాకుండా భగవంతుని అస్తిత్వాన్ని, వేదాల మహత్యాన్ని, సనాతన హిందూధర్మ విశిష్టతను ఇనుమడింప చేయటమే కాకుండా పరిరక్షించేవారుకూడా.

శిరసంగి దేశాయికి దేవుడులేడు, సత్యములేదు. వేదములు అబద్ధాల పుట్టలు అని అతని గట్టినమ్మకము. గురురాయలు ఆప్రాంతమునకు వెళ్ళినప్పుడు అతని సంగతి వారికి తెలిసెను. శ్రీవారు అతని నాస్తికతను ఆస్తికతగా మార్చి అనుగ్రహింపవలెనను అభిలాషతో నవలగుందకు పోయిరి. దేసాయిని పిలిపించి, ఆస్తిక్యము యొక్క మహత్వమును వివరించి చెప్పిరి. దేసాయి శ్రీవారితో, "స్వామి! వేదములను మంత్రములను మీరేమో తెగపొగడుచున్నారు. కాని వానియందు అంతటి శక్తి ఉన్నదనుట నేను నమ్మను. అవన్నియూ ఉదరపోషణకు కల్పించుకొన్న కట్టుకథలు. సరే. మీరన్నట్లు మీ వేదమంత్రములకు అంతటి మహాప్రభావము ఉండుటే నిజమైన, ఏది! ఈ రోకలిని చిగురింపగలరా! చివుళ్ళతో కలకలలాడింపగలరా?" అని వెకిలిగానవ్వెను. శ్రీవారు చిరునవ్వుతో శాంతచిత్తులై "అయ్యా! వేదములలో మంత్రములలో అగాధ శక్తి ఉండుట నిత్యసత్యము. అది అక్షరాలనిజము. లేదని వాదులాడవద్దు. దానిని అందరూ తెలుపలేరు. అందరూ తెలియలేరు. అంతమాత్రమున అవి అబద్ధములని భావింపరాదు. నీపై అనుగ్రహము చూపి నీకు దాని మహిమను తెలుపుటకే ఇక్కడికి మా రాక. చూచెదవా మా మంత్రశక్తిని? వేదప్రభావమును?" అని కమండలోదకమును అభిమంత్రించి, రోకలిపై ప్రోక్షించిరి. మంత్రోదక దివ్య ప్రభావముచే లేతచివుళ్ళతో రోకలి కళకళ లాడజొచ్చెను. (ఇటువంటి లీలనే శ్రీ గురుచరిత్రలో చూడవచ్చు. నరహరి శర్మ అనే వ్యక్తి శ్రీ నరసింహ సరస్వతి స్వామి వద్దకు వచ్చి తన కుష్టు రోగాన్ని తగ్గించమని ప్రాధేయపడగా, శ్రీగురుడు అతనికి ఎండిపోయిన మేడికట్టెను ఇచ్చి "రోజూ దీనికి నీళ్ళుపోయి, ఈ కట్టె చిగుర్చినప్పుడు నీ వ్యాధి తగ్గుతుంది" అని చెప్పగా, ఎంత మంది గేలిచేసినా, నరహరి శర్మ శ్రీగురుడు ఆదేశించిన విధముగా చేస్తుండగా, అక్కడకు శ్రీగురుడు వచ్చి ఆకట్టెపై నీళ్ళు చిలికరించగానే ఎండిపోయిన మేడికట్టె మొలకెత్తి చెట్టుగా మారింది). ఆ అద్భుతమును కన్నుల గాంచిన ఆ శిరసంగి దేసాయి, గురువుల ముందు సాగిలబడి, క్షమింపుడని వినయముతో వేడుకొనెను. గురువులు అతనిని అనుగ్రహించి ఫలమంత్రాక్షతలు కరుణించిరి. దేసాయి నాస్తికత పటాపంచలయ్యెను. ఆస్తికత అతనిలో ముద్రపడిపోయింది. అతడు గురుభక్తుడై మెలగసాగెను.

(ఆగష్టు 17వ తేదీ శనివారము, శ్రీగురురాఘవేంద్రుల ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

రచన, సేకరణ : **శ్రీమతి ఆర్ సాయి సృజన** గుర్‌గామ్, హర్యానా

# సర్వజీవ స్వరూపి శ్రీ వెంకయ్యస్వామి

అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో అని స్వామివారే స్వయముగా చెప్పి చీటి వ్రాయించేవారు. అంటే సర్వ జీవులు తమ రూపమేనని వారు చెప్పినట్టే కదా. ఆయన భక్తులమై ఉండి కుల, మత, వర్గ వైషమ్యాలు మనసులో పెంచుకొని తనవారిని ఒకలాగా, ఇతరులను ఇంకొకలాగా చూసే భక్తులు, స్వామివారు అన్నమాట గుర్తు తెచ్చుకుని సాటివారిని గౌరవిస్తూ, ప్రేమతో సహజీవనం గడపవలెను. ఇతరుల మనసు కష్టపెట్టుట స్వామివారికి నచ్చదు. ఒకసారి ఒక భక్తుడు సాటి వారిని నిందించి స్వామి వారి సేవకు వస్తే ఆరోజు అతను చేసే సేవను అంగీకరించలేదు. ప్రతిరోజు ఆ భక్తుడు స్వామివారికి రాగిజావను పోసేవాడు. స్వామివారు ఆరోజు స్వీకరించలేదు.



స్వామివారికి ఇతరులను నిందించడం, ఇతరుల మనసు కష్టపెట్టుట గిట్టదు. ఇది తెలుసుకొని స్వామి భక్తులు అందరి ఎడల సమభావము కలిగి ఉండవలెను, అన్ని జీవులను ప్రేమించవలెను. స్వామివారు "వాళ్లుండేదాన్ని బట్టి కదయ్యా మనముండేది" అనేవారు. దీనిని బట్టి గమనిస్తే భక్తి విశ్వాసములు గలవారికి తాను నిరంతర రక్షకుడై ఉంటానని అభయమిచ్చినట్లు తెలుస్తుంది. స్వామివారిపై పరిపూర్ణ విశ్వాసముతో ధర్మప్రవర్తన కలిగి, వారిని ఆరాధించినట్లైతే వారి జీవితాలకు ఏ లోటు ఉండదు. స్వామిని భక్తులకు ఏదైనా సందేశము ఇవ్వమని అడిగితే "చూసి నేర్చుకోనేదే గదయ్యా" నిరాడంబరంగా నివసిస్తూ అరిషడ్వర్గాలను జయించి సాధారణ మానవుని వలె తన జీవితాన్ని గడిపి తరగనంత ఆధ్యాత్మిక సంపద కలిగి కూడా ఏమీ తెలియని వానివలె భిక్షాటన చేసుకుంటూ నిత్యాగ్ని హోత్రులై భక్తుల కర్మలను ఆ అగ్నికి ఆహుతులుగా సమర్పించి తనను నమ్మి వచ్చిన వారికి వ్యాధులను, బాధలను తొలగించి ఆశ్రిత జనరక్షకుడై ఆదినారాయణుడిగా వెలుగొందారు.

నాదోపాసన చేయుచూ తన తపస్సుతో పంచభూతాలను స్వాధీన పరుచుకుని గ్రామ గ్రామాలు సంచరించి కరువుతో అలమటించిన రైతుల పాలిట అన్నపూర్ణేశ్వరుడయ్యాడు. కళ్ళముందు కనిపించే ప్రత్యక్ష దైవమైనప్పటికీ తాను పిచ్చివాడిననే సంభోధించాడు. తన జీవితాంతము వచ్చిన భక్తులకు సేవచేసి భగవంతుని అనుగ్రహానికి సేవను మించిన సాధన మరొకటి లేదని ఆచరించి చూపిన అగ్రగణ్యుడు. సృష్టిలో గల రహస్యాలన్నీ తెలిసి కూడా ఏమీ తెలియని అమాయకుని వలె నటిస్తూ, గ్రామగ్రామాలు తిరిగి పశువులలో, మనుషులలో ఉన్న భయంకర వ్యాధులను తొలగించి ఆ గ్రామాలను పట్టిపీడిస్తున్న దుష్టశక్తులను పారద్రోలి అనేకమంది భక్తుల పాలిట శ్రీ మహావిష్ణువై పూజింపబడ్డారు. కలియుగంలో తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకుంటూ భక్తులపాలిటి అభయముద్ర వేసి అందరినీ ఆదరించి ఆరాధించిన వారు శ్రీస్వామి. నిరంతర అగ్నిహోత్రులై ఈ సమస్త ప్రపంచంలో కంటికి కనిపించే ప్రతిదీ అశ్వాశతమైనదే, దేనిమీద వ్యామోహం లేకుండా మోక్షమార్గంలో పయనించుటకు గురువు అవశ్యకతను తెలిపి తన చర్యల ద్వారా అందరికీ అర్థమయ్యే విధంగా చిన్న చిన్న సూక్తుల ద్వారా పరమార్థాన్ని బోధించారు. వారి జీవితమే వేద సారాంశము.

స్వామివారు వచ్చిన వారికి భవిష్యత్ చెప్పడమే కాకుండా వాళ్ళకు చీటీలు వ్రాయించి వాటిపై వేలిముద్ర వేసేవారు. అది డబ్బు తీసుకున్నవారు వ్రాసి ఇచ్చే ప్రామిసరీ నోటుమీద మాదిరిగా ఎక్కడైతే వేలిముద్ర జవాబుదారునిగా వేస్తారో అలాగే స్వామి తాను చెప్పిన విషయములకు జవాబుదారునిగా అభయముద్ర వేసేవారు. అంటే నీ జీవితమునకు ఇంక నేను రక్షకుడిగా ఉన్నాను, నీవు నిశ్చింతగా ఉండవచ్చు అని అర్థం అన్నమాట. ఆయన మీద విశ్వాసము కలిగిన వారికి అదేవిధంగా జరిగినది, జరుగుతున్నది. అంటే వారే స్వయముగా భగవంతునిగా తమ దగ్గరకు వచ్చిన భక్తులకు అభయము ఇచ్చారన్నమాట. సాక్షాత్తు భగవంతుని స్వరూపమే వారని చెప్పకనే చెప్పిన సాక్ష్యమే ఈ అభయముద్ర. ఆయన జీవించి ఉన్నంతకాలం ఈ విధంగా ఎన్నో వేల పేపర్లు మీద వేలిముద్రలు వేసి ఇచ్చి భక్తులను ఆశీర్వదించి వారి బాగోగులు వ్రాయించి ఇచ్చి దానికి తాను జవాబుదారునిగా అభయముద్రలు వేసేవారు.

స్వామివారిలో ఎల్లప్పుడు, సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత్వము, సంపూర్ణత్వము వెల్లడి అవుతూ ఉండేవి. ఆయన సత్యము, ధర్మము, స్వయముగ ఆచరించి, తనను చూచి నేర్చుకొమ్మనెడి వారు.

స్వామివారు ఎక్కడ ఉంటే అక్కడ అగ్ని నిరంతరము వేస్తూయుండేవారు. స్వామి వారందరికీ భోజనవసతి మరియు ఉండుటకు నివాస-వసతి కల్పించేవారు. ఆ రోజులలో, మనుషులకు కలరా వ్యాధులు, పశువులకు గాలికుంటు వ్యాధులు నివారించుటకు స్వామివారు, తను తాకిన నూలు దారము ఇచ్చేవారు. వాటితో జబ్బులన్నియు నివారించేవారు. రేయింబవళ్ళు జలయజ్ఞములు చేస్తూయుండేవారు.

స్వామివారు ఎక్కడుంటే అక్కడేవారి సన్నిధి. వారు నిరంతరము, అగ్నిహోత్రమునే కొనసాగిస్తూ యుండేవారు. భక్తుల బాధలు తీరుస్తూయుండేవారు.

తమ ప్రియశిష్యులు, నిరంతరము స్వామి సేవలోనున్న గురవయ్యస్వామి వారిని శంఖుస్థాపన గుంట వద్ద కూర్చొనబెట్టుకొని, నవరత్నములు, ముంత, మరికొన్ని స్వామివారు

వాడిన వస్తువులు, నవధాన్యములు, ఇటుకలు, వారి చేతితో తాకించి, స్వామి శ్రీ గరువయ్యస్వామి చేత శంఖుస్థాపన చేయించారు. భక్తులు, శిష్యులు అందరూ శంఖుస్థాపన కార్యక్రమములో పాల్గొన్నారు. మాతాజీ తులశమ్మ కుమారుడు, ఆదినారాయణరెడ్డిగారు, ఆరోజు అన్నదానము చేసిరి. మాతాజీ తులశమ్మగారు, వారి స్వంత ఖర్చుతో వెంకయ్య స్వామివారి, పూర్ణాశ్రమములో సమాధి మందిరము కట్టించిరి. శ్రీ ఆదినారాయణరెడ్డిగారు ఎ 1-30 సెంట్లు భూమిని ఆశ్రమము కొరకై స్వామివారి పేరున రిజిష్టరు చేయించిరి.

1982 ఆగష్టు 24వ తేదీన గురవయ్యస్వామివారి తొడలపై శ్రీస్వామివారు భౌతిక శరీరమును వదలి, పరబ్రహ్మ స్వరూపములో ఐక్యమైన తరువాత శ్రీ వెంకయ్యస్వామివారి భౌతిక దేహాన్ని పూర్ణాశ్రమములో సమాధి చేయటమైనది.

ఆగష్టు 24వ తేదీ భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ

సౌజన్యం : **భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి**

రచన : **అవధూత శ్రీ గురవయ్యస్వామి**, గొలగమూడి

# స్వామి - మాష్టారు

'భగవంతుడు అవధూతల రూపంలో భూమిపై సంచరిస్తుంటాడని శ్రీ గురుచరిత్ర, భాగవతాది గ్రంథాలు చెప్తున్నాయి. ఈ అవధూతలను గుర్తించి, సేవించే సామర్థ్యం మనలో చాలామందికి ఉండదు. ఈ సామర్థ్యాన్ని మన కందించగల సత్సంగము, సద్గ్రంథ పారాయణలనే సనాతన సాంప్రదాయాన్ని వెలికితీసి లోకంలో ప్రచారంచేసిన ఘనత పూజనీయ మాష్టారుగారికే దక్కుతుంది. ఆ కారణంగానే తాను దర్శించిన మహాత్ముల చరిత్రలను ఎంతో వ్యయప్రయాసలకోర్చి సేకరించి అందించటమే కాకుండా ఆ యా మహాత్ముల దర్శనార్థమై సత్సంగ సభ్యులను ప్రోత్సహించేవారు.



"సర్వ ప్రకృతి వికారాలను విదిలించివేసి, ప్రాకృతిక విషయాల నుండి మనస్సును ఉపసంహరించి, ఆత్మయందు లీనం చేసినవారే అవధూత"లని శ్రీ గురుచరిత్రలో మాష్టారుగారన్నారు. నిస్సంగులైన అవధూతలకు దేహంపై గాని, వస్త్రాలపైగాని ఆపేక్ష వుండదని కూడా అందులో వ్రాశారు. కండ్లు పుసిగట్టి నీరు గారుతున్నా, దేహము, గుడ్డలు మురికిపట్టివున్నా, అవధూత శ్రీ చీరాలస్వామి వారు పట్టించుకునేవారు కాదు, అయినప్పటికీ వారివద్ద సువాసనలు వెదజల్లుతుండేవని మాష్టారుగారన్నారు. తనకు భిక్షనివ్వాలని తాపత్రయ పడేవారిని పట్టించుకోకుండా శ్రీ చీరాలస్వామి తనకు బుద్ధి పుట్టినప్పుడు నడిబజారులో కూర్చుని, తోచిన భక్తుడిని పిలిచి భోజనం తెమ్మనేవారు. కుక్కలు ఇష్టట్లో మూతిపెట్టి తింటున్నా, కలుపుతున్న అన్నంలో రోడ్డు మట్టి కలుస్తున్నా నిర్లిప్తులైయుండేవారు. ఆకలి తీరాక తినడం మానేసి స్వామి అంతర్ముఖులై అలానే కొంతసేపు కూర్చునేవారు. ఎక్కడి నుంచో వచ్చిన కుక్కలు వారి గడ్డానికి, మీసానికి అంటిన మెతుకులు తిని, చేతికున్న ఎంగిలి నాకి శుభ్రం చేసేవి. ఆ తర్వాత స్వామి ప్రక్కనే వున్న మురికిగుంటల్లోని నీరు త్రాగి దాహం తీర్చుకునేవారు. వారి స్పర్శతో ఆ నీరు పవిత్ర గంగాజలంగా మారేదేమో.

శ్రీ చీరాల స్వామి పోలికలు మాష్టారుగారిలో వుండడంచేత వీరిద్దరిని భక్తులు తండ్రీబిడ్డలుగా తలచేవారు. హోదాగల గొప్ప ఉద్యోగినని గాని, కట్టుకున్న గుడ్డలు మాసిపోతాయనిగాని స్ఫురణ లేకుండా మాష్టారుగారు ఆత్మజ్ఞులైన శ్రీస్వామి ఎదుట, చెత్తకుండీల ప్రక్కనే, మట్టిలో గంటల తరబడి కూర్చునేవారు. శ్రీ చీరాలస్వామి మాష్టారుగారిని "ఎర్రస్వామి" అని పిలిచేవారు. తీవ్ర వైరాగ్యమూర్తి అయిన మాష్టారుగారికి కాలాంతరంలో సన్యసించాలని ఆ రోజుల్లో వుండేది. అయితే తండ్రి జీవించి వున్నంతకాలం ఆ పని చేయబోనని మాష్టారుగారు తండ్రికి వాగ్దానమిచ్చారు. ఈరోజుల్లోనే స్వామి మాష్టారుగారికి నైలాన్ చీరెను ప్రసాదంగా యిచ్చి రానున్న కాలంలో వారు గృహస్థాశ్రమ ధర్మాన్ని స్వీకరించాల్సి వుంటుందని సూచించారు. మాష్టారుగారి వివేక వైరాగ్యాలు, ఆధ్యాత్మిక పరిపూర్ణత స్వామినెంతగానో ఆకర్షించాయి.

సెప్టెంబరు 2వ తేదీన శ్రీ స్వామివారు అస్వస్థతకు లోనయినారు. స్వామి ''ఎర్రస్వామి, వచ్చాడా'' అని భక్తులను పదే పదే అడుగుతున్నారు. మాష్టారుగారిని చూచాక స్వామి ముఖంలో ప్రశాంతత చోటు చేసుకుంది. నాటి రాత్రి స్వామి మాష్టారుగారిని ఏకాంతంగా పిలిపించుకొని తన ఆధ్యాత్మిక సంపదకు వారసుని చేసి కొన్ని ముఖ్య విషయాలను చెప్పారు. తెల్లవారుజామున శ్రీ చీరాలస్వామి తన భౌతికదేహం వీడేరు. తేదీ 3-9-1972న స్వామి వారి శరీరాన్ని పద్మాసనంలో కూర్చోబెట్టి, చీరాల వీధులలో ఊరేగించి, స్వర్ణగేటు సమీపాన గల స్మశానంలో మాష్టారుగారే స్వయంగా సమాధి చేశారు. 1979లో నాకు శిరిడీలో మాష్టారుగారితో తొలిసారిగా పరిచయమైన నాటి నుండి వారి వల్ల ప్రభావితుడనై శ్రీ సాయిలీలామృతాన్ని, శ్రీ గురుచరిత్రను శ్రద్ధాభక్తులతో పారాయణ చేస్తున్న కారణంగా అనేకసార్లు మాష్టారుగారితో పాటుగా స్వామివారి ఆరాధనోత్సవాలలో పాల్గొనే అదృష్టం లభించింది. మాష్టారుగారే స్వామి సమాధిని పూజించి స్వామి చిత్రపటాన్ని పురవీధులలో ఊరేగించి మధ్యాహ్నం తన ఖర్చుతో మాకందరికీ భోజనం యేర్పాటు చేసేవారు. ఆరోజు మాష్టారుగారు నిండు సంతోషంతో ఉల్లాసంగా కనిపించేవారు.

*(సెప్టెంబరు 3వ తేదీ అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)*


సౌజన్యం : **సద్గురుస్మృతులు**

రచన : **శ్రీ జె.వి. సుబ్బయ్యమాష్టారు**, ఒంగోలు

# లోకమాన్యుడు - శ్రీ గజానన్ మహారాజ్

శ్రీ బాలగంగాధర్ తిలక్ మహారాష్ట్రలోని ఒక కోహినూరు వజ్రం లాంటివారు. దూరదృష్టి సాగరుడూ! రాజనీతి కుశలుడూ! పరాయిపాలన తొలగించటానికీ, దేశాన్ని స్వతంత్రం చేయటానికీ తన ప్రాణాలనే పణంగా పెట్టినవాడు. ఆయన తన జీవితాన్నంతా ఏ ఆశా లేకుండా దేశంకోసం గడిపాడు. అందుకే ప్రజలు ఆయనను 'లోకమాన్య'దని పిలిచారు. ఆయన తన జీవితాన్నే దేశ సేవకంకితం చేసి, ఆ బిరుదును సార్ధకం చేశాడు. ఒకసారి శివాజీ జయంతి ఉత్సవానికి ప్రజలు ఆహ్వానిస్తే ఉపన్యాసం యివ్వటానికి మహారాష్ట్రలోని అకోలా గ్రామానికి తిలక్ వచ్చారు. ఉత్సవానికి ఏర్పాట్లు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. శివాజీ జయంతి ఉత్సవానికి అధ్యక్షులుగా తిలక్‌నే నిశ్చయించారు.

ఒక ప్రక్క శివాజీ జయంతి మహారాష్ట్రలోని ముఖ్య పండుగ. మరో ప్రక్క ఉత్సవ అధ్యక్షులు లోకనేత బాలగంగాధర తిలక్ అవటంవలన బంగారానికే వన్నె తెచ్చినట్లయింది. ఉత్సవానికి ఏర్పాట్లు అవుతున్నాయి. ఈ శివాజీ జయంతోత్సవ సందర్భంలో శేగాంవ్‌లోని శ్రీ గజానన మహరాజ్ స్వామిని ఆహ్వానిస్తే బాగుంటుందన్నారు. శివాజీ దేశంకోసం చేసిన పనులన్నింటికినీ స్వామి సమర్ధ రామదాసుల ఆశీర్వాదం వుండేది. అందువల్ల అతనికి జయమే కలిగింది. తిలక్‌జీ చేసే రాజనీతి కూడా శివాజీవలె దేశోద్ధరణకే కదా! కాబట్టి యిట్టి కార్యానికి కూడా శ్రీస్వామీజీ యొక్క ఆశీస్సులు లభించాలి. దీనికి కొందరు సమ్మతిస్తే కొందరు అసమ్మతి తెలిపారు. అసమ్మతి వర్గీయులు యిలా అన్నారు. "ఆ శేగాం పిచ్చివాణ్ణెందుకు యీ శుభసమయంలో పిలుస్తారు? అతను ఇలాంటి సమయంలో ఏదో ఒక విచిత్రం చేసి సభని పాడుచేస్తాడు. ఆయన సభలో దిగంబరుడుగా తిరుగుతాడు. 'గిణ గిణ గణాత్ బోతే!' అని భజన చేస్తూ లోకమాన్యుణ్ణి కూడా కొట్టవచ్చు!" అన్నారు. ఐతే కొందరు దీనికి అసమ్మతిని ప్రకటించి "శ్రీగజాననుల శ్రీ చరణాలు ఇలాంటి స్థితిలో ఇక్కడి ధూళిని తాకాలి" అన్నారు. "ఆయన పిచ్చి వాడెవరికి? సామాన్యుల దృష్టిలో ! విద్వాంసులూ, సజ్జనులూ వారిని పిచ్చివాడనుకోరు. తిలక్‌జీ నిజంగా దేశోద్ధారకులైతే తప్పకుండా శ్రీస్వామీజీ ఉత్సవ సమయంలో ఇక్కడే ఉపస్థితులౌతారు. నిజానిజాలేవో ఆ సమయంలోనే తేలిపోతాయి కదా! కాబట్టి స్వామీజీని ఆహ్వానించటానికి వెనుకా ముందూ అక్కర్లేదు" అన్నారు. ఇలా చర్చ జరిగిన తరువాత కొందరు శ్రీస్వామీజీని ఆహ్వానించటానికి శేగాం వచ్చారు. వచ్చినవారిని చూడగానే శ్రీస్వామీజీ దాదాసాహెబ్ ఖాపర్దే తో "శివాజీ జయంతి మహోత్సవానికి తప్పక ఉపస్థితుణ్ణౌతాను, అక్కడ పిచ్చి వేషాలు



వేయక మౌనంగానే కూర్చుంటాను. బాగుకోసం పాటుపడే వారి మనస్సెప్పుడూ నావల్ల చెడిపోదు! దేశానుద్ధరించటానికి బాలగంగాధరుడు సుయోగ్యుడు, అధికారి, ఆయన దేశప్రేమి, దేశభక్తుడు. వీరిని కలియటానికి అకోలా తప్పక వస్తా"నన్నారు స్వామీజీ. ఇది వినిన ఖాపర్దే ఎంతో సంబరపడ్డారు. ఆయన కోల్హాటికర్‌తో "యీ పర్హాడ ప్రాంతపు జ్ఞానవజ్రాన్ని చూశావా?" అన్నారు. "ఈయన అకోలాలో జరిగిన విషయాన్నంతటినీ ఇక్కడుండే తెలుసుకున్నారు. యోగులయొక్క అగాధజ్ఞానాన్ని చూడండి. దేశభక్తుల ఎడగల స్నేహాన్ని చూడండి. మనం మాట్లాడటానికి ముందే స్వామి వస్తానని మాటిచ్చారు. వారికేమీ చెప్పనక్కరలేకపోయింది. ఈ శుభకార్యానికి శకునం మంచిదే! పదండి. శ్రీస్వామి చరణాలకు ప్రణమిల్లి తిరిగి పోదాం!" అన్నారు ఖాపర్దే. శకసంవత్సరం పద్దెనిమిది వందల ముప్ఫై వైశాఖమాసంలో అకోలాలో బ్రహ్మాండమైన మండపంలో శివాజీ జయంత్యోత్సవం జరిగింది. పర్హాడ ప్రాంతంలో అక్షయ తృతీయ పండుగను బ్రహ్మాండంగా జరుపుతారు. అక్షయ తృతీయ రోజే ఉత్సవానికి చివరిరోజు. అందుచేత 'లోకమాన్యుణ్ణి' చూడటానికోసం ఎంతోదూరం నుంచి అనేకమంది వచ్చారు. శ్రీస్వామీజీ కూడా ఆ సందర్భంగా వస్తున్నారని జనాలకు తెలిసింది. అందుచేత సభామండపం పూర్తిగా కిక్కిరిసిపోయింది. జీవన్ముక్త సాధువు శ్రీ గజాననులు సభామండపంలో ఉన్నతాసనం మీద ఉపనిష్టుడయ్యాడు. ఆయన దగ్గర అణ్ణాసాహెబ్ పట్వర్ధన్ వున్నారు. గణేష్‌జీ ఖాపర్దే కులభూషణమైన శ్రీ కృష్ణనందనుడు తిలక్‌జీకి రెండవవైపు కూర్చున్నారు. దామరే, కోల్హాట్‌కర్ భావే, వెంకటరావు దేశాయి, ఈ సభాముఖ్యులంతా ఉచ్చాసనం మీద కూర్చున్నారు. ఇంకా ఉపన్యాసాలు చెప్పే సజ్జనులూ కూర్చున్నారు. దాన్ని వర్ణించటం ఏ ఒక్కనోటితో కాదుమరి! కోల్హాట్‌కర్‌జీ ఆ సభ యొక్క ఉద్దేశ్యాన్ని వివరించారు. తరువాత 'భాషణసింహులు'

లోకమాన్యతిలక్ నిలబడ్డారు "నేటిరోజు చాలా ధన్యమైనది. ఇక్కడి వీరుడొకరు దేశ స్వాతంత్ర్యానికి తన ప్రాణాల్ని పణంగా పెట్టారు. అధనుర్ధరుడైన వీర శివాజీ యొక్క జన్మోత్సవాన్ని నేడు జరుపుకొనటానికి మనమంతా యిక్కడికి వచ్చాం. ఆ శూరవీరునికి, శివాజీకి సమర్థ రామదాసుల కృప, ఆశీర్వాదం లభించాయి. అందుచేత ఇతని పేరు కేవలం మహారాష్ట్రలోనేకాక యావద్భారతావనిలో మారుమ్రోగింది. అలానే ఆశీర్వాదం ప్రసాదించటానికి సాధువు శ్రీగజాననులు నేడిక్కడ ఉపస్థితులయ్యారు! ఇవి మనకెంతో అవసరం. స్వాతంత్ర్యపు సూర్యుని అస్తమయం, పరతంత్రపు ఘోర అంధకారం దేశం నలుమూలలా అలుముకుంది. స్వాతంత్ర్యహీనమైన దేశం ప్రేతంతో సమానంగా భావించబడుతుంది. కాబట్టి దేశప్రేమను వృద్ధి చేయటానికి మనమంతా ప్రజలకు శిక్షణనివ్వాలి. నేటినుంచి పిల్లలకు కూడా దేశప్రేమను బోధించటం అత్యావశ్యకం!" అన్నారు తిలక్. ఉపన్యాసం చెప్పే ఉద్వేగంలో తిలక్‌జీ ప్రస్తుతం వున్న ప్రభుత్వాన్ని చాలా చెడుగా నిందించారు. వారి ఉపన్యాస ధోరణి ఎలాంటిదో స్వామీజీ గమనించి, నవ్వుతూ– "ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుటవల్ల చేతులకు బేడీలు పడతాయి!" అని స్వామి తన ప్రియమైన భజన "గిణ గిణ గణాత్ భోతే!" అని పాడటం ప్రారంభించారు, సభ నిర్విఘ్నంగా సంపన్నమైంది. తరువాత ప్రజలంతా తిలక్‌జీని ఎంతో ప్రశంసించారు. కాని స్వామియొక్క భవిష్యవాణి ఆ ఏడాదిలోనే రుజువయింది. ప్రభుత్వం తిలక్‌జీ పైన దావావేసి, 124 సెక్షను క్రింద బంధించారు. చేతులకు బేడీలు కూడా వేశారు. పెద్ద పెద్ద వకీళ్ళు తిలక్‌జీ పక్షాన దావా వేయటానికి ప్రయత్నాలు చేయసాగారు. దాదాసాహెబ్ ఖాపర్డే తిలక్ మిత్రుడు, సహయోగి. ఆయన అమరావతినుంచి తిలక్‌జీ తరపున న్యాయస్థానంలో వాదించటానికై బొంబాయి వెడుతున్నారు. అకోలా స్టేషన్‌లో కోల్హాట్‌కర్‌జీతో ఇలా అన్నారు. "మీరు వెంటనే శేగాం వెళ్ళి స్వామీజీని తిలక్‌జీని రక్షించమని ప్రార్థించండి" అన్నారు. "దేశం ఆపదలో వుంది. నేనే స్వయంగా శేగాం వెడదామనుకున్నాను. కానీ వెంటనే బొంబాయి వెళ్ళాల్సివుంది. అందుచేత మీరు శేగాం వెళ్ళి స్వామిని ప్రార్థించండి" అన్నారు. వెంటనే ఆ తిలక్‌జీ భక్తుడు కోల్హాట్‌కర్‌జీ బండిలో కూర్చుని శేగాం వెళ్ళి స్వామిని చేరారు. ఆ సమయంలో స్వామీజీ నిద్రిస్తున్నారు. మూడు రోజులైనా లేవలేదు. అంతవరకూ కోల్హాట్‌కర్‌జీ అక్కడే మఠంలో వుండిపోయారు. తిరిగి వెళ్ళకూడదనుకున్నారు. తిలక్‌జీ మీదున్న అచంచల భక్తి విశ్వాసాలవల్ల ఆయన స్వామి నిద్రలేచేంతవరకూ కదల్లేదక్కడినుంచి. మరాఠీభాషలో "నిప్పులేకుండా పొగ, మాయా మమతా లేకుండా కన్నీళ్ళూరావు" అని నాలుగవనాడు శ్రీస్వామి మేలుకొని, "ఈ విషయంలో మీరెంత ప్రయత్నించినా ఫలితం దక్కదు. ఛత్రపతి శివాజీకి శ్రీ సమర్థరామదాసస్వామి అండదండలున్నా బాద్‌షా అతణ్ణిఖైదు చేయలేదా? సజ్జనులు, వీరులకు కష్టాలు లేకుండా రాజ్యంలో క్రాంతి ఎలా వస్తుంది? నేనొక జొన్న రొట్టె యిస్తాను. దాన్ని నిస్సంకోచంగా తిలక్‌జీ చేత తినిపించండి. అది తిన్న తరువాత భవిష్యత్తులో ఒక గొప్ప కార్యం ఆయనచేత కావాల్సివుంది" అన్నారు స్వామీజీ. యీ పలుకులు విన్న కోల్హాట్‌కర్‌జీ మనస్సులో శంకించారు. రొట్టె తీసుకొని స్వామికి వందనం చేశారు. తరువాత ఆయన బొంబాయి వెళ్ళి తిలక్‌జీకి రొట్టెయిచ్చి శేగాంలో జరిగిన కథనాన్ని వినిపించారు. అదివిన్న తిలక్‌జీ అక్కడున్నవారితో నవ్వుతూ "స్వామీజీ మాటలలో ఏదో ఆంతర్యం వుంది. వారు అంతర్జ్ఞానులు! మన ప్రయత్నం బహుశా ఫలించకపోవచ్చు, ప్రభుత్వం తన్ను సమర్థించుకొనటానికి మంచీ చెడూ అన్నీ చేస్తుంది. స్వార్థం లేకున్నప్పుడే న్యాయం బయటకు వస్తుంది కదా! ఇదే లోకరీతి. నా చేత ఏదో ఘనకార్యం జరగబోతుంది అనే స్వామి అమృతవాక్కులలో ఏదో సంకేతం వుంది. యోగులు భూత భవిష్యద్వర్తమానాలు తెలిసినవారు కదా! చూద్దాం! భవిష్యత్తులో ఏం జరుగనున్నదో!" అన్నారు. కోల్హాట్‌కర్‌జీ యిచ్చిన ఆ రొట్టెను చక్కగా నమిలి తిన్నారు తిలక్‌జీ. వారికి పళ్ళు లేకపోయినా స్వామి ప్రసాదాన్ని అతి భక్తితో గ్రహించారు. తిలక్‌జీకి ఆరుమాసాలు జైలుశిక్ష విధించి 'మాండలే' కారాగారానికి (బ్రహ్మదేశంలోని) పంపారు. అక్కడే భగవద్గీతపై సమీక్షాత్మక గ్రంథం 'గీతారహస్యం' ఆయనచే వ్రాయబడింది. ఇదే మహాకార్యంగా రుజువైంది. దీనివలన తిలక్‌జీకి జగద్గురు శంకరాచార్యుల వారితో సమానమైన గౌరవం లభించింది! ఈ గీతాశాస్త్రంమీద అనేక భాష్యాలు వచ్చాయి. తిలక్‌జీ 'కర్మయోగ' మార్గమే శ్రేష్ఠమైనదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే వారిచేత కావించబడిన మహత్కార్యం! అది 'గీతారహస్యం' లోకంలో వున్నంతకాలము తిలక్‌జీ అమరులై వుంటారు! వారి ప్రయత్నం వలన స్వాతంత్ర్యం లభించటం సుగమమైంది. ఇది నిజమే! 'గీతారసహ్యం' రచించటం వలన ఆయన అజేయుడు, అమరుడూ అయ్యారు. అంతేకాక అందులో చెప్పబడిన నిరంతర సత్యం (నిత్యసత్యం) సమాజం సరియైన మార్గంలో నడవటానికి సాయపడుతుంది! యావచ్చంద్ర దివాకరుడైన లోకమాన్య బాలగంగాధరుడు తన కీర్తిచేత నిరంతర చిరంజీవియే అయినాడు.

(జూలై 23 శ్రీ బాలగంగాధర్ తిలక్ జన్మదినము, ఆగష్టు 15 స్వాతంత్రదినోత్సవము మరియు సెప్టెంబరు 3వ తేదీ మంగళవారం శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

సౌజన్యం : **శ్రీగజానన్ విజయం** సేకరణ : **"సత్యాన్వేషి"**

# భవితవ్యానికి బంగారుబాట

అనేకమంది తల్లితండ్రులు తమ బిడ్డలు చెడు సహవాసాలు చేసి చెడిపోయారని కొందరు, జులాయిగా తిరుగుతున్నారని, పట్టుమని పదినిముషాలైనా కూర్చొని చదవరని కొందరు, పాఠం వింటే చక్కగా వ్రాయగలరు కానీ, క్లాసులకే పోరని కొందరూ వాపోవడం చూస్తూనే ఉన్నాము. భక్తి అనే ముసుగులో వీరు తమ విద్యుక్తధర్మ నిర్వహణలో ఎంతలోపం చేశారో గ్రహించడం లేదు. ఒకటవ తరగతి నుండి బడికి పంపడం తప్ప బడికి పోతున్నాడా లేదా, చదువుతున్నాడా లేదా చెడు సహవాసాలు చేస్తున్నాడా, తెలీదు. ఇంటిలో నిత్యం కొంతసేపు చదివించాలి అనే ఆలోచనే లేకుండా బిడ్డలను పెంచి, పదవ క్లాసు ఫెయిల్ అయినాక కొందరు, ఇంటర్‌లో ఎక్కడో చేర్చి, తన బిడ్డకాలేజీకే పోలేదని లెక్చరర్స్ చెబుతున్నారని వాపోయే వాళ్ళందరికీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి ఆచరణే గొప్ప బోధ.



పిల్లలను కని మంచి పౌరులుగా తీర్చిదిద్ది సంఘానికి మేలుచేసే వారుగా తయారు చేసే ఆశయము కంటే గొప్ప భక్తి ఏముంది? అదే శ్రీ భరద్వాజగారి తండ్రియైన అనంతాచార్యులుగారు తన బిడ్డల విషయములో చేసి చూపించారు. దానినే మాస్టరుగారు తన పిల్లల విషయంలోనూ పాటించారు. అక్షరాలు దగ్గరుండి ఇంట్లోనే నేర్పారు. ఆయనకు తీరిక ఉండే చేశారా? ఒక ప్రక్క ప్రూపులు దిద్దడం, రెండవ ప్రక్క ఊపిరి సలపని విజిటర్స్, మూడవ ప్రక్క పర్యటనలు, నాల్గవప్రక్క పిల్లల చదువులు ఐదవ ప్రక్క అమ్మగారి ఆరోగ్యము, ఆరవప్రక్క పుస్తక మరియు సాయిబాబా పత్రిక రచనా వ్యాసాంగము. ఇన్ని వత్తిళ్ళలోను పిల్లల చదువు క్రమశిక్షణల యందు ఎంత శ్రద్ధ వహించేవారో, వందమంది విజిటర్స్ కూర్చొని ఉన్నా ఒక ప్రక్క పిల్లల చదువు – ఏమి ఆలెక్క చేశావా లేదా! ఆ పాఠం వచ్చిందా! అంటారు. ద్వారకా ఆ పాఠం వచ్చిందా లెక్కల అభ్యాసం పూర్తి చేశావా, తెలియని లెక్కలు అడుగు అంటారు. ఆడుకునే టైంలో వదిలేస్తారు. మిగతా టైంలో తప్పక కూర్చొని చదవాలి. అలా నిత్యం కనిపెడితే బిడ్డలు చెడే ప్రశ్నేలేదు.

ఆరు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాల వయసు నుండే ఆ పాఠం పూర్తిచేస్తే నీతో కేరంస్ ఆడుతానని, ఈ అభ్యాసం పూర్తిచేస్తే లెక్కలన్ని కరెక్టుగా చేస్తే ఫలానా సినిమాకు తీసుకువెళ్తాననో చెప్పేవారు. ఒక్క దెబ్బ కొట్టకుండా కండ్ల బెదిరింపుతోను, ఆటలతోను, సినిమా చూపిస్తాను అనే ఆశతోను వారిని కృషిచేసి గంటల తరబడి కూర్చోబెట్టే అలవాటు చేశారు. ఇకవాళ్ళు క్లాసుకు ఫస్ట్, సెకండ్ ర్యాంకులు రాకుండా ఎలా వుంటారు. వేసవి సెలవుల్లో కూడా పిల్లలను వదిలే ప్రసక్తేలేదు. ఢిల్లీనుండి సెంట్రల్ సిలబస్ ప్రకారం పుస్తకాలు తెప్పించి అవన్నీ సెలవుల్లో పూర్తి చేయించేవారు. స్కూలు ఫస్టు వస్తే నీకు ఫలానాది కొనిస్తానని ముందుగా చెప్పి అలా వస్తే తప్పక తన మాట నిలబెట్టుకునేవారు.

కొంచెం పెద్దయ్యాక టి.వి. చూడాలని ప్రక్క ఇండ్లకు పోతుంటే టి.వి. తెచ్చి ఇంట్లోపెట్టి చూడతగ్గ ప్రోగ్రాములే చూపించేవారు. పౌరాణిక సినిమాలు వస్తుంటే వాటిని గురించి చెపుతూ చూపించేవారు. టి.వి. ప్రోగ్రాంలో సినిమా అయిపోయాక ఆ సినిమా గురించి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టేవారు. సరిగ్గా సమాధానం చెప్పలేకపోతే తానే చెప్పేవారు. మరలా టి.వి.లో సినిమా వస్తుందంటే ముందుగానే జాగ్రత్తగా గమనించండి. నేను మరలా ప్రశ్నలు అడుగుతాను. ఎవరు బాగా చెబుతాడో చూస్తాను అనేవారు. ఎన్నడూ సినిమాహాల్ వైపే వెళ్ళని మాస్టరుగారు పిల్లల కొరకు ఫిక్షన్ ఉండే సినిమాలు చూస్తూ పిల్లలకు చూపించి వారికి తెలియని వాటిని వివరించేవారు. వారికొరకు సముద్ర స్నానాలకు వెళ్ళేవారు. చిన్న పిల్లలప్పుడు తగు శ్రద్ధ వహిస్తే పెద్దవాళ్ళయినాక చెడు సహవాసాలు చేయరు.

పిల్లలంటే మాష్టారుగారికి చాలా ఇష్టం "పిల్లలకు బాల రామాయణాన్ని ముఖ్యంగా చెప్పించాలి. దాని వల్ల వారిలో గ్రహణం శక్తి పెరుగుతుంది. రిటెన్షన్, రికాపిట్యులేషన్ అండ్ రిప్రొడక్షన్ పెరుగుతుంది. నేటి కాంపిటేషన్‌లో రావాలంటే ఈ మూడూ పెరగాలి. బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు మోనోగ్రాఫ్స్ వ్రాస్తున్నారు. నెహ్రూ, ఠాకూర్, వివేకానందుల గురించి సంక్షిప్తంగా వివరిస్తున్నారు. ఇవి పిల్లలకు తప్పకుండా అందించాలి. సంస్కృత పరిచయం కల్గించాలి. శబ్దమంజరి నేర్పించాలి. వీలైనంత వరకు పిల్లలకు 6, 7 సంవత్సరాలలో ఉపనయనం చేయించటం, నమకం, చమకం నేర్పించటం చాలా అవసరం. ఎందుకంటే వేదసాంప్రదాయం రానురాను చాలా వరకు తగ్గిపోతున్నదని అందువల్ల ఇవన్నీ పిల్లలకు చెప్పించాలి" అని చెప్పేవారు. "కాలానుగుణంగా ఇంగ్లీషు కూడా బాగా నేర్పించాలి" అని చెప్పేవారు. చిన్నప్పటినుంచే పిల్లల్లో పెద్దలన్నా, దేశమన్నా భక్తిబీజాలని నాటాలి. పిల్లలకోసం కథల పుస్తకాలద్వారా మంచి సాహిత్యాన్ని అందించాలి అని వారి అభిలాష.

"చిన్న పిల్లలకు హారతులు, భజనలు అలవాటు చేయాలి. బాబా చరిత్రను చిన్న చిన్న కథల రూపంలో వారికి చెప్పాలి. వారిచేత చెప్పించాలి అని అనేవారు. పిల్లలు తప్పుగా ప్రవర్తిస్తున్నారంటే దానికి బాధ్యులు పెద్దవారే. తల్లితండ్రులు మంచి మార్గాన్ని తామాచరిస్తూ వారిని ఆచరించమని చెప్పాలి. అది తెలియకపోతే ముందు తాము నేర్చుకొని తర్వాత పిల్లలకు నేర్పాలి" అని చెప్పేవారు.

శ్రీ భరద్వాజమాస్టరుగారు విద్యానగర్‌లో కాలేజీ విద్యార్థులలో తాను ఒక విద్యార్థిగానే ఉండేవారు. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు. వారికుండే గౌరవం, మర్యాద, హుందాతనం వారి కిచ్చేవారు విద్యార్థులు.

పరీక్షల టైంలో మాస్టరుగారికి నమస్కరించుకొని, వారి ఆశీస్సులు తీసుకొని పరీక్షకు వెళ్ళాలనే నమ్మకంతో కొందరు విద్యార్థులు శ్రీమాస్టరుగారిని దర్శించుకునేవారు. ప్రసాదం రెడీగా పెట్టుకొని, వారు రాగానే విభూతి ప్రసాదమిచ్చి "విష్‌యు బెస్ట్ ఆఫ్ లక్" అని చెప్పి పంపేవారు. అందరు లెక్చరర్ల వలె బెట్టుగా ఉండకుండా పరీక్షల టైంలో గేటు దగ్గర నిల్చొని అందరికీ బెస్ట్ ఆఫ్ లక్ అని చెబుతూ చేయి ఆడిస్తుండేవారు. తన సొంత బిడ్డలను పరీక్షకు పంపే తండ్రి వలె కనిపించేవారు. శ్రీమాస్టరుగారితో పరిచయమున్న విద్యార్థులందరికీ వారి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు కంటే మాస్టరుగారంటేనే ఎక్కువ ప్రీతిగా ఉండేవారు.

పిల్లల పెంపకం గురించి చెప్తూ, "పిల్లల్ని ఫ్రెండ్స్‌లా చూడాలి. సలహాదారునిలాగే వుండి అవసరమైనప్పుడు సూచనలివ్వాలి. కాని అన్నీ స్పూన్ ఫీడింగ్‌లా అమర్చి పెట్టకూడదు. కష్టసుఖాలను వాళ్ళకి తెలియచెప్పాలి. వారిని కించపరచే విధంగా మాట్లాడకూడదు" అని చెప్తూ, "నా చిన్నతనంలో మా అమ్మ చనిపోతే ఆ కొరత లేకుండా తల్లి, తండ్రి తానే అయి మా నాన్నగారు పెంచారు. ఉన్నంతలో తల్లితండ్రులు తమ పిల్లలకు ఏ కొరతా లేకుండా ప్రేమగా పెంచటమే పద్ధతి. ఇవి చెప్తున్నాప్పుడు మాస్టారుగారు వారి పాప వేదమ్మని వడిలో పెట్టుకొని ఊపుతూ మాట్లాడుతుంటే ఈయన బ్రహ్మచారిగా ఉన్నప్పుడు బ్రహ్మచర్యాన్ని ఎంత నిర్దుష్టంగా పాటించారో, గృహస్తు అయిన తర్వాత గృహస్తు ధర్మాన్ని కూడా అంత ఖచ్చితంగా పాటిస్తున్నారనిపిస్తుంది. అంతే కాక తాను పాటించకుండా ఏ విషయాన్నీ ఇతరులకు బోధించేవారు కాదు. ముందు తను ఆచరించి, ఆ తర్వాత ఇతరులకు చెప్పేవారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజమాస్టారుగారు.

సౌజన్యం : **మాస్టారి మధురస్మృతులు** సేకరణ : **'విరించి'**

# సాయితత్త్వ సాధనం

ఏదో తెలియని అదృశ్యశక్తి ఈ విశ్వాన్ని కొన్ని ధర్మాలననుసరించి నడిపిస్తున్నదని నాస్తికులు కూడా అంగీకరిస్తారు. ఆ శక్తికెంతో తెలివి, సామర్థ్యము లేకంటే ఈ విశ్వాన్నింత క్రమబద్ధంగా నడిపించగలదా? ఈ శక్తికి చైతన్యమే మూలధర్మమని, ఈ సృష్టి మూలమంతా ఆ చైతన్యరూపమేనని మతాలన్నీ అంగీకరిస్తాయి. శ్రీసాయి కూడా "ఏకం సత్ విప్రా బహుధావదంతి" అన్న వేదవాక్యానికి ప్రతీకయై తమ సమకాలీన మహాత్ములేగాక, గతకాలపు మహాత్ములు, ముక్కోటి దేవతలు, సకల జీవులు, తుదకు జడ పదార్థం కూడా తమ రూపమేనని, తమకు, ఆ చైతన్య రూపానికి తేడా లేదని స్పష్టం చేశారు. "గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మైశ్రీ గురవేనమః" అంటూ గురుగీత ఈ భావాన్నే మరింత దృఢపరచింది. శ్రీ సాయి కూడా సృష్టిలోని ఏ జీవినాదరించినా, తన నాశ్రయించిన భక్తుల లౌకిక ఆధ్యాత్మిక శ్రేయస్సులకు తానే బాధ్యత వహిస్తానని వాగ్దానం చేశారు. ఆ కారణంగా సాటిజీవులకు తలపెట్టినకీడు, మన గురువుకు తగిలినట్లయి, అంతకు పదిరెట్ల దుఃఖాన్ని నెత్తిన



వేసుకుంటారు. శ్రీ సాయిలీలామృత పారాయణతో ఈ సత్యాలు హృదయగతమయ్యాక, మనమెలా దుఃఖాన్ని కోరుకోమో, ఆ దుఃఖానికి కారణమైన పాప కర్మాచరణకు కూడా పూనుకోము. కాలుతుందని తెలిసికూడా నిప్పులో చెయ్యిపెట్టే మూర్ఖుడుంటాడా? అకారణంగా ఈనాటి సుఖదుఃఖాలు, ఒకనాటి మన పుణ్యపాప కర్మల ఫలితాలేనని గుర్తించి, ప్రజలంతా సధర్మాచరణతో ప్రతిఒక్కరు పదిమందికోసం, పది మంది ప్రతి ఒక్కరికోసం శ్రమించాలి. ఆనాడు అన్ని మత సంప్రదాయాలవారు, కలిసి మెలసి సోదరభావంతో మనగగలుగుతారు. సమాజంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయి. అప్పుడది వసుధైక కుటుంబమవుతుంది.ఆ దిశగానే మన సాధన కొనసాగాలి. ఈ లక్ష్యాన్ని శ్రీసాయి తత్త్వ ప్రచారంతో సాధించేందుకు మన మందరము కలసికట్టుగా ముందుకు సాగుదాము. అందుకు రాబోయే 'శ్రావణపూర్ణిమ' ను వేదికగా చేసుకుందాము.

సౌజన్యం : **శ్రీ సద్గురుస్మృతులు**

రచన : **శ్రీ జె.వి. సుబ్బయ్య మాష్టారు**, ఒంగోలు

# శ్రీ సాయి కృష్ణ బోధామృతం

శ్రీ కృష్ణుడు భగవద్గీతలో తనకు అర్పించకుండా భుజించిన ఆహారము పాపభూయిష్టమైనదని, అందువలన నిష్కృతి లేని పాపాలను మూటగట్టుకుందురని, అదే విధముగా భగవంతునికి అర్పించి, పావనం చేసిన పిమ్మట తీసుకున్న ఆహారం అమృతతుల్యమని అలా చేయటము వలన ఇహంలోనూ, పరంలోనూ శ్రేయస్సు కలుగుతుందని సెలవిచ్చి ఉన్నారు. ఈ గీతాసారాన్ని కలియుగ దైవం భక్తుల పాలిటి కల్పవృక్షం అయిన శ్రీ సాయినాధులు తనదైన రీతిలో భక్తులకు బోధించారు. ఆ లీలను ఇప్పుడు స్మరించుకుందాము. శిరిడీలో ప్రతి ఆదివారం సంత జరిగేది, చుట్టు ప్రక్కల గ్రామాలనుండి ప్రజలు వచ్చి, ఆ వారానికి కావలసిన సరుకులను కొనుక్కొని తిరిగి వెళ్ళిపోయేవారు. వెళ్ళేముందు వారు మశీదుకు వచ్చి, సాయిని దర్శించుకోవడం ఒక అలవాటు. ఒక ఆదివారం ఎప్పటివలెనే మశీదు కిక్కిరిసిపోయి ఉన్నది. హేమాద్రిపంత్, బాబా ముందు కూర్చోని ఆయన పాదములను ఒత్తుతూ మనస్సులో నామజపం చేసుకుంటున్నాడు. బాబాగారి ఎడమవైపున శ్యామా, కుడివైపున బూటీ, కాకాదీక్షిత్ కూడా కూర్చోని ఉన్నారు. అప్పుడు శ్యామా నవ్వుతూ, "హేమాద్రిపంత్ జీ, నీ కోటుకు శెనగ గింజలు అంటినవి చూడు" అని అన్నాడు. అంతేకాక హేమాద్రిపంత్ చొక్కా చేతులను తట్టగా కొన్ని శెనగ గింజలు రాలిపడ్డాయి. హేమాద్రిపంత్ వెంటనే తన చేతులను ముందుకు చాచగా, మరికొన్ని శెనగ గింజలు రాలిపడ్డాయి. ఈ సంఘటనకు అందరూ ఆశ్చర్యపోయారు. శెనగలు, చొక్కా చేతుల లోపలకు ఎలా ప్రవేశించాయో అని ఎవరికి తోచినట్లు వారు ఊహించనారంభించారు. అప్పుడు శ్రీ సాయి కల్పించుకొని "ఆ హేమాద్రిపంత్‌కు తాను తిన్నప్పుడు ఇంక ఎవ్వరికీ పెట్టని దుర్గుణము ఉన్నది. ఈ రోజు సంతలో శెనగలు కొని తానొక్కడే తింటూ ఇక్కడికి వచ్చాడు" అని అన్నారు. సాయి మాటలకు హేమాద్రిపంత్ ఒకింత ఆశ్చర్యపడి, "బాబా! నేనెప్పుడూ దేనిని ఒంటరిగా తిని ఎరుగను. ఈరోజు వరకు శిరిడీలోని సంత ఎక్కడ జరుగుతున్నదో కూడా నాకు తెలియదు. ఈరోజు కూడ నేను సంతకు వెళ్ళలేదు, అయినప్పుడు నేను శెనగలు ఎలా కొని ఉండగలను? నా దగ్గర ఏ వస్తువైన ఉన్నప్పుడు, దానిని దగ్గర ఉన్నవారికి పంచి ఇవ్వకుండా నేనొక్కడినీ తినే అలవాటు నాకు లేదు. అటువంటప్పుడు ఈ దుర్గుణమును, అభాండమును ఏల నాపై మోపెదవు?" అని అడిగాడు. అప్పుడు సాయి చిరునవ్వుతో, "భాపూ (తమ్ముడా!) దగ్గర ఉన్నప్పుడు ఇంకొకరికి పంచి ఇస్తావు కానీ ఎవరూ లేనప్పుడు ఏం చేస్తావు? తినేటప్పుడు కనీసం నన్ను స్మరిస్తావా? నేనెల్లప్పుడు నీ చెంత లేనా? నీవేదైనా తినేటప్పుడు నాకు అర్పిస్తున్నావా?" అన్నారు. ఆ మాటలకు హేమాద్రిపంత్ ముఖం చిన్నబోయింది. బాబా మాటలలోని అర్థం అక్కడ కూర్చున్న వారందరికీ అవగతమై, అందరి అజ్ఞానం పటాపంచలు అయ్యి జ్ఞానోదయం అయ్యింది. హేమాద్రిపంత్ శెనగలు తినుటను ఆసరాగా చేసుకొని శ్రీ సాయి ఒక అద్భుతమైన, అపూర్వమైన బోధను చేసారు. మనస్సు, బుద్ధి, పంచేంద్రియముల కంటే ముందుగా విషయములను అనుభవిస్తాయి, కనుక మనము ముందే ఏ విషయాన్నైననూ భగవదర్పితం చేయాలి. అప్పుడు మనకు ఆ విషయములందు అభిమానము అదృశ్యమైపోతుంది. విషయములను అనుభవించే ముందు, బాబా మన చెంతనే ఉన్నట్లు భావించినచో, ఆ వస్తువును మనము అనుభవించవచ్చునా లేదా అన్న ప్రశ్న ఉదయించి తద్వారా వైరాగ్యం, వివేకము ఉదయిస్తాయి. ఆధ్యాత్మిక జీవితంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. మనము మన సద్గురువును లేదా ఇష్ట దైవమును స్మరించనిదే ఏ పనిని చేయరాదు. మనస్సును ఈ విధముగా క్రమశిక్షణతో ఉంచినట్లయితే, శీఘ్రమే ఆ సద్గురువు యొక్క అపూర్వమైన, అత్యద్భుతమైన కరుణా కటాక్షాలకు పాత్రులమవుతాము. "నాకు అర్పించకుండా ఎవరూ ఏమీ తినరో వారికి నేను బానిస" అన్నారు బాబా. శ్రీ సాయి చేసిన ఈ బోధనామృతమును మనసారా వంటబట్టించుకొని, ఆచరించి సాయికృష్ణుని కృపకు పాత్రులవుదాము.



**(ఆగష్టు 24వ తేదీ కృష్ణాష్టమి సందర్భముగా సమర్పణ)**

సేకరణ : **వి.వి. సత్యన్నారాయణ**

# సంకటనాశన గణేశ స్తోత్రమ్


ప్రణమ్య శిరసా దేవం, గౌరీపుత్రం వినాయకమ్
భక్తావాసం స్మరేన్నిత్యం, అయుఃకామార్థసిద్ధయే.

ప్రథమం వక్రతుండం చ, ఏకదంతం ద్వితీయకమ్
తృతీయం కృష్ణపింగాక్షం, గజవక్త్రం చతుర్థకమ్.

లంబోదరం పంచమం చ, షష్ఠం వికటమేవ చ
సప్తమం విఘ్నరాజం చ, ధూమ్రవర్ణం తథాష్టమమ్.

నవమం ఫాలచంద్రం చ, దశమం తు వినాయకమ్
ఏకాదశం గణపతిం, ద్వాదశం తు గజాననమ్

సెప్టెంబర్ 2వ తేదీ శ్రీ వినాయకచవి శుభాకాంక్షలు




## నుదుటన బొట్టు ఎందుకు పెట్టుకోవాలి

మన శరీరంలోని ప్రతి అవయవానికి ఒక్కొక్క అధిదేవత ఉన్నారు. లలాట అధినేత బ్రహ్మ. పరమ ప్రమాణములైన వేదాలు బ్రహ్మ ముఖకమలం నుంచి వెలువడ్డాయి. అందుకే బొట్టు పెట్టుకోవడానికి బ్రహ్మస్థానమైన లలాటం స్థానమయ్యింది. చతుర్ముఖ బ్రహ్మ రంగు ఎరుపు కాబట్టి ఎరుపురంగు బొట్టునే ధరించాలి. అంతేకాక, ప్రాణశక్తికి కారణమైన నరాలకు కేంద్రస్థానం..... కనుబొమల మధ్య ఉండే ఆజ్ఞాచక్రం. కుంకుమ బొట్టును పెట్టుకోవడం వల్ల, మానసిక ప్రవృత్తులను నశింపజేసే ఆజ్ఞాచక్రాన్ని పూజించినట్టేనని శాస్త్రాలు చెబుతున్నాయి.

## 'యోగా' అనగానేమి?

తల క్రిందపెట్టి, కాళ్ళు పైన పెట్టటం యోగాకాదు. శ్వాసను బంధించడం, శరీరాన్ని మెలితిప్పటం మొదలైనవి మాత్రమే యోగా కాదు. యోగాసాధనలో పలు రకాలు ఉన్నాయి. యోగా అనేది ఒక ప్రత్యేక తరహా కలిగినది. యోగా అంటే ఐక్యం. ఈ విశ్వంలో నీవు ఎవరో తెలుసుకుని జీవించడం ఒక యోగము. నవీన విజ్ఞానశాస్త్రం యోగా మనం చూస్తున్నదంతా ఒకేరకమైన శక్తి అని అది భిన్నరూపాలలో కనిపిస్తుందని చెబుతున్నది. అదేవిధంగా మీరుకూడా ఈలోకం అంతా ఒక్కటేనన్న భావన తెచ్చుకోగలగటమే యోగా. యోగా ఒక విజ్ఞానశాస్త్రం.

భౌతిక శరీరం బాగుకు విధానాలు ఉన్నట్టే, అంతర్గత బాగుకోసం అందించినదే యోగా. యోగా అనేది భారతదేశంలో పుట్టిన ఒక శాస్త్రం. ఇక్కడి సంస్కృతికి అందించిన వరం. దీనిని హిందువులు తొలుత కనుక్కున్నారు. అందుకు పతంజలి మహర్షి రచించిన యోగశాస్త్రము ప్రామాణికము.

## మీకు తెలుసా?

ప్రపంచంలో 7 నదులు ఒకేచోట కలిసే ఏకైక ప్రదేశమే సంగమేశ్వరం. కర్నూలు జిల్లా కొత్తపల్లి మండలంలో తుంగ, భద్ర, కృష్ణ, వేణి, భీమ, మలాపహరిణి, భవనాసి నదులు కలిసే ప్రదేశాన్నే సంగమేశ్వరం అంటున్నారు. ఈ నదుల్లో భవనాసి నది మాత్రమే పురుషుడి పేరున్న నది. మిగిలినవన్నీ స్త్రీ పేర్లున్న నదులు.

## శిఖిపింఛమౌళి

సృష్టిలో సంభోగం చెయ్యని ప్రాణి నెమలి మాత్రమే. శ్రీ కృష్ణునికి పదహారు వేలమంది గోపికలు. అన్నివేల మంది భామలతో శ్రీకృష్ణుడు సరససల్లాపాలు మాత్రమే చేశాడు. అల్లరిచేసి ఆడాడు, అంతవరకే మెలిగాడు. ఆ విషయాన్ని తెలియచేయటమే శ్రీకృష్ణుడి తలపై ఉన్న నెమలిపింఛం భావం. శ్రీకృష్ణుడు కొంటెవాడు మాత్రమే అయితే శ్రీకృష్ణుడు భోగిగా కనిపించే యోగీశ్వరుడు. వారందరితో పవిత్ర స్నేహ సన్నిహితంగా ఉన్నానని పదే పదే చెప్పటమే నెమలి ఫించము ధరించటములోని భావం. అంత పవిత్రమైనది కనుకే నెమలి మన జాతీయ పక్షి అయ్యింది.

## స్వాతంత్రము

భారత స్వాతంత్ర్యోద్యమం 1857లో ప్రారంభమయింది. మంగల్‌పాండే నాయకత్వంలో తొలి సిపాయి తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు తరువాత బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఝాన్సీలక్ష్మీభాయి, తాంత్యాతోపే, బహదూర్‌షా జఫర్, నానాసాహెబ్ మొదలైన వారెందరో స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిపోసి పోరాటం చేశారు.

ఆగష్టు 15వతేదీన స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని ఆఖరి బ్రిటిష్ ఇండియావైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ మన పెద్దలను సూచించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భముగా ఈ తేదీని ఆయన సూచించారు. సింగపూర్‌లో జపాన్ లొంగుబాటును అంగీకరించిన సౌత్-ఈస్ట్ ఆశియా కమాండ్‌కు మౌంట్‌బాటన్, సుప్రీం అలైజ్‌కమాండర్‌గా వ్యవహరించారు.

జాతీయగేయం వందేమాతరం ను బంకించంద్రచటర్జీ రచించారు. వాస్తవానికి ఇదొక పద్యభాగం. చటర్జీ రచించిన "ఆనంద్‌మఠ్" నవలలోని మొదటి రెండు చరణాలను తీసుకుని జాతీయగేయంగా ప్రకటించారు.

విదేశీ ఉత్పత్తులను బహిష్కరిస్తూ దేశీ ఉత్పత్తులకు మద్దత్తుగా 1900 ప్రారంభంలో శ్రీ బాలగంగాధర్ తిలక్‌తో కలసి సర్‌రతన్ జంషెడ్ టాటా బొంబాయిలో స్వదేశీ కో ఆపరేటివ్ స్టోర్స్ కో లిమిటెడ్‌ను స్థాపించారు. ప్రస్తుతం అది బాంబేస్టోర్‌గా సుప్రసిద్ధం.

భారత్ పాకిస్థాన్ మధ్య సరిహద్దును సిరిల్ జాన్ ర్యాడ్‌క్లిపి నిర్ణయించారు. ఈయన బ్రిటిష్ న్యాయ కోవిదుడు. భారత భౌగోళిక అంశాలపై పూర్తి అవగాహన లేకుండానే ర్యాడ్‌క్లిప్ సరిహద్దును నిర్ణయించారు. తన నిర్ణయం పై చనిపోయేంతవరకు ర్యాడ్‌క్లిప్ బాధపడుతూండేవారని చెబుతుంటారు.

ఇండియా పేరును ఇండస్ (సింధూ) నది నుంచి తీసుకున్నారు. అత్యంత ప్రాచీనమైన సింధూ నాగరికతకు నిదర్శనంగా ఈ పేరును పెట్టేరు.

# మాతృ భక్తి - దేశ భక్తి

1857 సం॥ మొదటి స్వాతంత్ర్య సమరంలో ముఖ్యపాత్ర వహించిన వారిలో కొలబా జిల్లాలోని 'పాన్వెల్' సమీపంలో 'షిర్ధోన్' గ్రామానికి చెందిన ఫడ్కే వంశానికి చెందిన వాసుదేవ బల్వంత్ ఫడ్కే గొప్ప ఐశ్వర్యవంతులు. విధివైపరీత్యం వల్ల ఆ నాటి ఆంగ్లేయ ప్రభుత్వ ఉద్యోగి అయినాడు ఫడ్కే.

ఒకప్పుడు వాసుదేవ బల్వంత్ ఫడ్కే తల్లికి విపరీతమైన జబ్బు చేసింది, అటువంటి ఆపద సమయంలో తల్లికి సేవ చేయడానికి ఆంగ్లేయ ప్రభుత్వాధికారులు అతడికి సెలవు మంజూరు చేయలేదు. కొద్ది కాలానికి తల్లి మరణించింది. కనీసం తల్లి అంత్యక్రియలకు కూడా హాజరు కావడానికి కఠిన హృదయులైన ఆంగ్లేయాధికారులు సెలవు మంజూరు చేయలేదు.

అంతటి చిత్రవధకు గురి అయిన ఫడ్కే హృదయంలో, అతని తల్లి మాతృదేశానికి ప్రతీకగా తోచింది. భౌతికమైన తల్లికి అత్యవసర పరిస్థితులలో కూడా సేవచేసుకోలేని తన దురదృష్టానికి పరిహారంగా తన జీవితాన్ని మాతృదేశ విముక్తికి అంకితం చేయాలని అతడు కఠోర శపథం చేసుకుని తన ఉద్యోగానికి రాజీనామా చేసి, కులమతాలకు అతీతంగా, అంత్యజులుగా తలచబడిన 'కోళి' జాతుల వారికి సైన్యంగా తర్ఫీదునిచ్చి, తీర్చిదిద్ది మనదేశం నుండి ఆంగ్లేయులను పారద్రోలాలని ఫడ్కే నిశ్చయించుకున్నాడు.

ఫడ్కే గొప్ప దత్తభక్తుడు, "శ్రీగురుచరిత్ర" పారాయణ, పూజ, ధ్యానం అతని నిత్య విధులు. ఇంతటి సమరయోధుడిలో ఇంతటి లక్షణం అందరినీ ఆశ్చర్య పరిచేది. 1876లో ధనవంతులను కొల్లగొట్టి పేదలకు పంచేవాడు. తన ఆశయసిద్ధి కోసం శ్రీ అక్కలకోట స్వామి సమర్థ మహరాజ్‌ను రెండుసార్లు దర్శించాడు ఫడ్కే. స్వాతంత్ర్య సమరం చేయడానికి ముందు మూడోసారి స్వామి సమర్థను దర్శించి, తన కత్తిని స్వామి సమర్థ ముందుంచి, ఆశీర్వదించమని కోరాడు. స్వామి సమర్థ ఫడ్కేను ఆశీర్వదించక, "అభీ వక్త హై!" అంటే "ఇంకా సమయముంది" అంటూ స్వామి సమర్థ ఆ కత్తిని మరొక భక్తుడికిచ్చి ఒక చెట్టుమీద పెట్టమన్నారు. ఫడ్కే చాలాసేపు నిరీక్షించినా, స్వామి సమర్థ అతనికి కత్తి ఇవ్వలేదు. అంటే ఆంగ్లేయ ప్రభుత్వం మన దేశన్ని వదిలి వెళ్ళే సమయం రాలేదని ఆయన సూచన!

కాని ఫడ్కే స్వామి ఆశీస్సులు తీసుకోకుండా, చెట్టుపైనున్న తన కత్తిని తీసుకొని వెళ్ళిపోయాడు. ఆ తరువాత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని వేలాదిమంది ఆంగ్లేయులను మట్టుబెట్టాడు. చివరకు పట్టుబడి 'బంధీ'గా ఏడాన్‌కు పంపబడ్డాడు. 1883 సం॥ ఫిబ్రవరి 17న ఫడ్కే దేహం చాలిస్తూ "నాదేశం నుండి కొంత మట్టి తెచ్చి నా తలక్రింద ఉంచవలసినది" అని చివరి కోరికగా కోరి స్వర్గస్తుడయ్యాడు.

"దత్త లహరి" పేరిట చాలా భక్తి కీర్తనలు రచించాడు శ్రీ ఫడ్కే.

(ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భముగా సమర్పణ)

**- శ్రీవత్సస**, విద్యానగర్



తరలి రండి! **ఆహ్వానము** కలిసి సాగుదాము!



## 25వ సద్గురువుల పాదుకా మహోత్సవము

**తేదీలు : 2019 ఆగష్టు 23, 24 మరియు 25**
**(శుక్ర, శని మరియు ఆదివారం)**

**వేదిక : శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖ - 21**

**శ్రీశిరిడీ సాయి సేవాట్రస్టు (ఉక్కునగరం) మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 25వ సద్గురువుల పాదుకా మహోత్సవము, 2019 ఆగష్టు 23,24 మరియు 25వ తేదీలలో నిర్వహించబడుతున్న తరుణంలో శ్రీ దత్త సంప్రదాయములో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న పాదుకల విశిష్టతను, పవిత్రతను తెలియజేస్తూ, పాదుకలతో పాటుగా వాడవాడలా సాయి తత్వ సౌరభాన్ని వెదజల్లుచున్న సాయి స్వరూపులైన ఎందరో మహాత్ములు , సాయి తత్వప్రచారకులు ఒక్కచోట చేరి క్షణక్షణమూ అద్భుతమైన సాయి తత్వాన్ని అందించే ఈ కార్యక్రమములో పాల్గొని ప్రతిక్షణము సాయి సన్నిధిని ఆస్వాదించటానికి అందరికీ పేరు పేరున ఇదే మా** హృదయపూర్వక ఆహ్వానము

**ఆగష్టు 23వ తేదీ పాదుకల ఊరేగింపు, ఆగష్టు 24 మరియు 25వ తేదీలలో సామూహిక గురుపూజలు, సద్గోష్టి, ఇష్టాగోష్టి, ఆధ్యాత్మిక ప్రవచనములు మొదలైన అనేక కార్యక్రమములు నిర్వహించబడును.**

**పాదుకామహోత్సవ సందర్భముగా శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలు మరియు దివ్య వస్తు, వస్త్ర సమదాయమును భక్తుల దర్శనార్థము ఏర్పాటు చేయడమైనది. అపురూపము, అమూల్యము అయిన వాటిని దర్శించి, స్పృశించి, శ్రీ దత్తసాయి అనుగ్రహము పొందగలరు.** అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

**దూర ప్రాంతముల నుండి విచ్చేసే భక్తులకు ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు చేయడమైనది.**

**వివరములకు :**
**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు (రిజిష్టర్డ్)**
**శ్రీ సద్గురు పాదుకాక్షేత్రం, ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, పరవాడ (మం), విశాఖ-21.**
**ఫోన్ : 0891-2510817, సెల్ : 9849645224, 9441467648**

# ఏరిన ముత్యాలు

### పుట్టినరోజు

పుట్టినరోజు అంటే గడిచిపోయిన కాలాన్ని గుర్తుంచుకోవడానికి కాదు. చేయవలసిన కార్యములను గుర్తుంచుకొని సమయాన్ని తగు జాగ్రత్త చేసుకోవడం కోసం.

### మార్గదర్శి

నా విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు నూతన సిద్ధాంతాలను రూపొందించడానికి నేను భగవద్గీతను ప్రధానమైన ఉత్సాహ కేంద్రంగా మార్గదర్శకంగా స్వీకరించాను.

– ప్రఖ్యాత శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్'

### అంకితభావం

పూర్తి అంకితభావము అంటే పూర్తిగా కష్టపడడం కాదు
పూర్తిగా అందులో నిమగ్నమవ్వటము – అబ్దుల్‌కలాం

### జీవించటం

బ్రతకటం వేరు, జీవించడం వేరు
బ్రతకడంలో ప్రాణం మాత్రమే ఉంటుంది కాని
జీవించడంలో సంతృప్తి, జీవితానుభూతి ఉంటుంది

### జిజ్ఞాసులు

బాధే బలవంతుణ్ణి చేస్తుంది
భయమే ధైర్యవంతుణ్ణి చేస్తుంది
వైఫల్యమే వివేకవంతుణ్ణి చేస్తుంది

### జీవితం

ఒడ్డుకు చేరిన అలకు ఆనందం,
మధ్యలో ఉన్న అలకు ఆరాటం
ఒడ్డుకు చేరని అలకు విషాదం,
అన్నీ తెలిసి ఏదో కావాలనుకోవటమే జీవితం

### బరువు- బాధ్యత

మోసేది బరువు అనుకుంటే
దించేయాలి అనిపిస్తుంది
బాధ్యత అనుకుంటే మోయాలనిపిస్తుంది

### తెలివి

తెలివికి నిదర్శం తప్పులు వెదకటం కాదు
పరిష్కారం సూచించగలగటము

### అభివృద్ధి

దేశం అభివృద్ధి చెందటం అంటే
అందాల మేడలు, రంగుల గోడలు కాదు,
పౌరుల నైతికాభివృద్ధే నిజమైన అభివృద్ధి

– మహాత్మాగాంధీ

### రహస్యం

అమూల్యమైన కాలాన్నిసార్ధకం
చేసుకోవటమే జన్మరహస్యం

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

### పని

లక్ష్యం ఉన్నవాడు లక్ష్యంకోసం పనిచేస్తాడు
లక్ష్యంలేనివాడు, లక్ష్యం ఉన్నవాడికోసం పనిచేస్తాడు

### శాశ్వతం

మనం మనకోసం చేసేది మనతోనే అంతరించి పోతుంది
ఇతరులకోసం చేసేది శాశ్వతముగా నిలచిపోతుంది

– మహాత్మాగాంధీ

### గౌరవం

ఈ ప్రపంచంలో ఎన్నివందల వృత్తులు ఉన్నా,
వారందరినీ తయారుచేసే వృత్తి, ఉపాధ్యాయ వృత్తే.
అందుకే ఆవృత్తి అంటే నాకు ఎంతో గౌరవం

– అబ్దుల్‌కలాం

### మరణం

చనిపోవటమే మరణం కాదు
ఏ పనిచేయక పోవటము కూడ మరణంతో సమానం

### ఆనందం

రెండు క్షణాలు నవ్వితేనే ఫోటో అందంగా వస్తుంది కదా.
మరి ఎప్పుడు చిరునవ్వుతో ఉంటే జీవితం ఎంత
ఆనందంగా ఉంటుంది

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



**ఆగష్టు 19వ తేదీ అండమాన్‌లోని పోర్టుబ్లయిర్‌లో**
**మొదటి పెళ్ళిరోజు జరుపుకుంటున్న**

**శ్రీ వి. జయప్రకాష్**
**శ్రీమతి సాయిగౌతమి** దంపతుల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో నిత్యనూతనముగా సాగాలని, ఆ దంపతులకు శ్రీదత్త సాయి భరద్వాజులు తమ కృపానుగ్రహము నిరంతరము అందించాలని కోరుకుంటూ శ్రీ భరద్వాజ **సద్గురువాణి** తన శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

## శుభాకాంక్షలు



**జూన్ 15వ తేదీన వివాహం జరుపుకున్న**

**శ్రీ భీమపల్లి శంకరరావు**
**శ్రీమతి సౌజన్య కుమారి** దంపతుల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



**జూలై 29వ తేదీన శ్రీకాకుళంలో**
**పెళ్ళిరోజు జరుపుకుంటున్న**

**శ్రీ బి. రవికుమార్**
**శ్రీమతి రమణమ్మ** దంపతుల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన మరియు పెళ్ళిరోజు శుభాకాంక్షలు



**ఆగష్టు 12వ తేదీన వెంకటాపురంలో**
**పెళ్ళిరోజు** జరుపుకుంటున్న

**చి॥ ఎన్. సత్యంనాయుడు, చి॥ సౌ॥ మౌనిక**

లకు, వారి కుమారుడు ఆగష్టు 3వ తేదీన మొదటి పుట్టిన రోజు జరుపుకుంటున్న




**చి॥ మణికంఠ** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...





శ్రీ కొంపెల్ల చిన్నిక్రిష్ణ, శ్రీమతి శ్రీలక్ష్మి

చి॥ చైతన్య స్వరూప్, చి॥ రాహుల్

పోతయ్యవలస గ్రామం

శెట్టి గారు

9440112816
9246636624

Cell : 7799255565
7989077370







సాయి తేజ మార్బుల్స్

గ్రానైట్స్ & టైల్స్

VSS Infra

BUILDERS & DEVELOPERS

సరస్వతి థియేటర్ ఎదురుగా,
శ్రీకాకుళం.







జన్మదిన శుభాకాంక్షలు



శ్రీకాకుళంలో ఆగష్టు 4వ తేదిన జన్మదినము జరుపుకుంటున్న

శ్రీమతి ఉషారాణి పట్నాయక్ గారికి

మరియు

ఆగష్టు 24వ తేదిన జన్మదినము జరుపుకుంటున్న

శ్రీ హరికృష్ణ పట్నాయక్ గారికి

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహములు అందించాలని కోరుతూ సద్గురువాణి తన శుభాకాంక్షలందజేస్తున్నది.

జన్మదిన శుభాకాంక్షలు



జూలై 12వ తేదీన మరియు సెప్టెంబర్ 10వ తేదీన పుట్టినరోజు జరుపుకుంటున్న

శ్రీ వి. వెంకటరమణ, శ్రీమతి వి. నాగమణి ల కుమారులు చి॥ గగన్, చి॥ జతిన్ లకు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ సద్గురువాణి తన శుభాకాంక్షలందజేస్తున్నది.

Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Plot No. 13, Power City, Near Gowthu Lachanna Nagar, Parawada Mandal, Visakhapatnam-21 and Printed at **M/s. UNITED POWER ENTERPRISES,** # 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka, Visakhapatnam-26 and Published at Power City, Visakhapatnam, Editor : **V.V. POORNA CHANDRA RAO**